ప్రత్యామ్నాయ సినిమాలు

దృక్పథాలు - దృక్కోణాలు

(వ్యాస సంకలనం)

సంపాదకత్వం & సంకలనం

గౌరవ్

ప్రత్యామ్నాయ సినిమాలు

దృక్పథాలు - దృక్కోణాలు

(వ్యాస సంకలనం)

సంపాదకత్వం & సంకలనం

గౌరవ్

డిసెంబర్, 2018

టైప్ సెట్టింగ్

వి.యస్. గ్రాఫిక్స్

© కాపీలెఫ్ట్

సర్వహక్కులూ సమాజానివి

విజ్ఞప్తి

ఇందులోని వ్యాసకర్తల అభిప్రాయాలన్నిటితోనూ సంపాదకుడు ఏకీభవించనవసరం లేదు.

ప్రతిపాదిత విరాళం

రూ. 75/-

ప్రతులకు

9032094492

వివరాలకు

gouravmeka@gmail.com

"One ought, every day at least, to hear a little song, read a good poem, see a fine picture, and, if it were possible, to speak a few reasonable words."

– Johann Wolfgang von Goethe

"No, we shall not silenced. It's our duty to speak and oppose the dehumanization of our planet, the globalization of fear and hatred through this creeping theocracy and the brutalization of the medium of film."

– Paul Cox

World Cinema : Politics, Power and Humanity
Satyajit Ray Memorial Lecture - 2004
Nandan, Kolkata.

"I believe in the transformative power of cinema. It is only through this shared dream-experience that we can transcend the oppressive minutiae of daily existence and find some spiritual connection in the deeper reality of our mutual desire. "

– Daniel Clowes

ఇందులో....

1. జండర్ స్పృహలేని సినిమా జనానికి ప్రమాదం 10
2. సినిమా ప్రజాస్వామికం కావాలి! 13
3. సమాంతర సినిమా, ఒక సామాజికవశరం 15
4. డాక్యుమెంటరీలే ఎందుకు? 16
5. సినిమాలు – స్త్రీలు 20
6. అంతరంగాన్ని తీర్చిదిద్దేవి మంచి చిత్రాలే 21
7. ప్రత్యామ్నాయ సినిమా : కొన్ని అభిప్రాయాలు 23
8. పోరాట రూపంగా సినిమా! 25
9. మంచి సినిమాలు ఎందుకు చూడాలి–వాటినే ఎందుకు చూపించాలి 26
10. ఫిలిం సొసైటీలు ఎందుకు అవశరం? 35
11. మంచి సినిమా చూతము రారండి! 36
12. మంచి సినిమా ఒక మానవీయ సృజన 41
13. ఫిలిం సొసైటీ కబుర్లు 42
14. సమాంతర సినిమా; దశ – దిశ 44
15. మంచి సినిమా నేటి అవసరం 51
16. ఉత్తమ సినిమాలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తాయి. 53
17. వ్యాపార సినిమా – పతన సంస్కృతి 54
18. అవరోధాల మధ్య అస్తిత్వాన్ని నిలుపుకున్న ఫిలిం సొసైటీ ఉద్యమం 60
19. బాల్యంపై మంచి సినిమాల ప్రభావం అవశరం 66
20. అవును – మళ్ళీ కావాలి ఫిల్మ్ సొసైటీలు 67
21. కళాత్మక సాధనంగా సమాంతర సినిమా 71
22. సినిమా రంగంలో సిసలైన మార్పు 74
23. నేటి సినీమాల తీరూ తెన్నూ 78
24. తెలుగు సినిమా వాస్తవిక దృక్పథం 80
25. భావజాల మాధ్యమంగా సినిమా 89
26. మంచి సినిమా అంటే? 96

అనుబంధం-1 సినిమా ఒక సామాజిక కార్యాచరణ 97

అనుబంధం-2 పిఠాపురం ఫిల్మ్ సొసైటీ కరపత్రాలు 99

అనుబంధం-3 అప్రయోజన దృష్టికో నిదర్శనం 101

అంకితం

జీవించడం కోసం
అనునిత్యం యుద్ధం చేస్తున్న
LGBTQ+ ఇంకా
భిన్న లైంగికతలవారందరికీ
మద్దతుగా...

కృతజ్ఞతలు

రావెల సోమయ్య, డా॥ చెలికాని స్టాలిన్,
డా॥ చల్లా రవికుమార్, డా॥ భానుప్రసాద్,
డా॥ ప్రదీప్, గాడి నెహ్రూ, రావు కృష్ణారావు,
అద్దేపల్లి ప్రభు, గ.న.రా., మాల్యాద్రి, చార్వాకాశ్రమ సుధాకర్,
అడుగుజాడ రవికాంత్, మాదేటి రవిప్రకాశ్,
పెద్దింశెట్టి రామకృష్ణారావు, దాడి గంగాధరరావు,
మహోదయ యాజరా, గోపు చంద్రరావు,
సినీ ప్రేమికులు, ఇంకా ఆత్మీయులందరికీ...

ప్రస్తావన

"నేను హత్య కావించబడ్డాను.
వాళ్ళు నాకోసం దుకాణాలు, స్మశానాలు, దేవాలయాలు వెతికారు
కానీ నన్ను కనుక్కోలేకపోయారు.
ఎప్పటికీ కనుగొనలేరు
అసలెప్పటికీ కనిపెట్టలేరు"

ఫెడ్రికో గార్షియా లోర్కా స్పానిష్ కవి, నాటక రచయిత, దర్శకుడు, ప్రజాప్రయోక్త. జనరేషన్ ఆఫ్ 27 ఉద్యమ సంఘంలో క్రియాశీల మేధావి. కళ ప్రజల కోసమని భావించి గ్రామగ్రామాన థియేటర్‌ను తీసికెళ్ళి ప్రజల ముందు సాంస్కృతిక చైతన్యానికి తెరకట్టినవాడు. 38 ఏళ్ళకే సివిల్ వార్‌లో ముష్కర మూకలచేత హత్య కావించబడ్డాడు. చనిపోడానికి 7 సం॥రాల ముందే రాసిన పై కవితలో జోస్యం చెప్పాడు. అన్నట్టుగానే ఆయన దేహం ఎవరికీ, ఎప్పటికీ లభ్యం కాకున్నా, కలలు కన్న చైతన్యం మాత్రం కళగా మారి అనంతంగా విస్తరించింది.

అర్ధశతాబ్దం పైగా గడిచిపోయింది. ఈ మధ్యలో ఎన్నో ఆగమనాలు, మరెన్నో నిష్క్రమణలు. కళ ప్రజలకోసమే అని నమ్మి వార్ని చైతన్యపర్చడమే సాంస్కృతిక కార్యకర్తల లక్ష్యమని నమ్మిన సఫ్దార్ హశ్మి సైతం 34 ఏళ్ళకే కర్కశుల చేతుల్లో హతమయ్యాడు. 3 దశాబ్దాలు గడిచిపోయాయి.

నరేంద్ర దభోల్కర్, గోవింద పన్సారే, కల్బుర్గి, గౌరీ లంకేష్‌ల దాకా ద్వేషం బుసకొడుతూనే వుంది. అయినా చైతన్యం సాగుతోందే కానీ ఆగడం లేదు. ప్రక్రియ అదేదైనా దాని లక్ష్యం ప్రజలబాగు కోరడమే ననే స్పృహను కొనసాగించే ప్రయత్నాలు ప్రతీ తరంలోనూ జరుగుతూనే వుంటాయి.

ఆనాటి అవంత్ గార్డే నుంచి ఈనాటి ఇంక్విలాబ్ దాకా ఇదంతా ఒక నవ్య ప్రత్యామ్నాయ పోరాట చరిత్రే, నూతన సాంస్కృతిక పునర్వికాసపు అభివ్యక్తే. భవితకోసం జరిగే అలాంటి ఆశల సమిష్టి నిర్మాణాలకి కుదిరినంతలో చేతనైన చేయూతతో కూడిన ఆసరా ఇవ్వడం కార్యకర్తల విధి. అందుకే ఇది!

ఇంక్విలాబ్ దారిలో...

ఇంక్విలాబ్ వాట్సప్ గ్రూపు పెట్టిన చాలా కాలానికి మంచి పుస్తకం గ్రూప్‌లో మంటో సినిమా గురించి రివ్యూ పెడితే ఎవరో ఏదో అన్నారని మాట పట్టింపుకి పోయి **మంచి సినిమా** వాట్సప్ గ్రూపును ప్రారంభించాను. నన్ను విస్మయానికి గురి చేస్తూ సుమారు రెండొందల మంది సభ్యులు వందల సంఖ్యలో వివిధ భాషా చలన చిత్రాలు, ప్రపంచ దేశాల్లోని విఖ్యాత సినిమాలు, డాక్యుమెంటరీలు, లఘు చిత్రాలపై విమర్శలు, సమీక్షలు చేస్తూ ఆరోగ్యకరమయిన రీతిలో పాలుపంచుకుంటున్నారు. వారి తోడ్పాటే కనుక లేకుంటే అంతమందితో గ్రూపు సమన్వయం చేయడం సాధ్యమయ్యేది కాదు. కమర్షియల్ హంగులతో కూడిన వెకిలి సినిమాలకి భిన్నంగా మానవీయ స్పృహతో తీసిన అర్థవంతమయిన అనేక సినిమాలకి సంబంధించిన సంవాదాలు మంచి సినిమా గ్రూప్ ద్వారానే సాధ్యమయ్యాయి. అందుకు స్ఫూర్తినిచ్చిన **ఇంక్విలాబ్, మంచి సినిమా వాట్సప్ గ్రూపులకి** నా కృతజ్ఞతలు.

బెర్ట్రోల్డ్ బ్రెహ్ట్ జయంతి సందర్భంగా అజయ్‌గారి ప్రోత్సాహంతో పాతిక మంది సభ్యులతో **'పిఠాపురం ఫిల్మ్ సొసైటీ'** కరపత్రం వేసాను. స్థానిక గ్రంథాలయంలో ఆరు తెల్ల కాగితాలు గోడకు అతికించి వో మాదిరి తెర తయారుచేసి గౌహర్‌రజా డాక్యుమెంటరీని వేసాం. సాంకేతిక లోపంతో సౌండ్ రాకపోతే, సినిమా సాగుతుండగా మైకు పుచ్చుకుని కామెంటరీ చెప్పాను. చూసిన నలభై మందీ తిడతారనుకుంటుండగా, చిన్నప్పుడు పరభాషా చిత్రాలు తెరపై వస్తుంటే పక్కనొకాయన నిలబడి వాటిని తెలుగులో తర్జుమా చేసేవాడనీ, ఆ మధుర స్మృతులు మళ్ళీ వచ్చాయని చూసినవారు మురిసిపోయారు. బతుకు జీవుడా అనుకుని కిరాణాకొట్టు మిత్రుడి దగ్గర ఎరువు తీసుకొచ్చిన డబ్బా ప్రొజెక్టరుకొక దండం పెట్టి ఊరుకున్నాను. తర్వాత మహిళా దినోత్సవం రోజున **సావిత్రీభాయ్ ఫూలే, ఫాతిమా షేక్**లని స్మరిస్తూ **వెన్ వుమెన్ యునైట్** (ఆడవాళ్ళు ఏకమయితే) ప్రదర్శించాం.

అస్తిరత్వం, ఆర్థిక లేమి నాకు అన్నదమ్ములవంటివి. కాబట్టి అక్కడితో ఫిల్మ్ సొసైటీల కథ ముగిద్దామనుకున్నాను. అనుకోకుండా ఒక పెద్దమనిషితో మాటపట్టింపుకి పోయి **మంచి సినిమా** గ్రూప్ మొదలుపెట్టాల్సి వచ్చింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఉన్న సాంస్కృతిక కళాభిమానులు, సినీ ప్రేక్షకులు, సామాజిక

కార్యకర్తలు ఇందులో భాగమయ్యారు. ఇంతలో తెలంగాణా రాష్ట్రంలోని వికారాబాద్ చుట్టుప్రక్కల గ్రామాల్లో సినిమాలు ప్రదర్శించడం గురించిన ప్రయత్నాల్లో భాగంగా అక్కడ క్షేత్రస్థాయి అధ్యయనాలు చేసాను. బెంగాల్, కేరళ, మహారాష్ట్ర మొదలయిన ప్రాంతాల్లో జరుగుతున్న ప్రత్యామ్నాయ దృశ్యమాధ్యమాల నిర్మాణం గురించి కలెక్టివ్ ప్రయత్నాలయిన ఇప్టా, ఒడిస్సీ, అఖ్‌రా, ఏక్‌తారా మొదలైన ప్రయత్నాల గురించి నాకప్పటికే వివరాలు తెలుసు. హిమాచల్ ప్రదేశ్‌లో జరిగిన **సినిమా ఆఫ్ రెసిస్టెన్స్ (ప్రతిరోధ్ కా సినిమా)** వర్క్‌షాపులో పాల్గొని దేశవ్యాప్తంగా మంచి సినిమాల గురించి తెల్సుకోవడమే కాక ఎంతోమంది సినిమా కార్యకర్తల్ని కల్సుకోగలిగాను. అలాగే కోల్‌కతాలో జరిగిన పీపుల్స్ ఫిల్మ్ కలెక్టివ్ ఫెస్టివల్‌కి బాలాజీగారి సహకారంతో వెళ్లగలిగాను. అక్కడ ఎన్నో అద్వితీయమైన సినిమాలు చూడ్డమే కాక వాటి నిర్మాణంలో పాలు పంచుకున్న నిపుణుల భావాలు వినడం నా వరకూ నాకు ఒక మరపురాని అనుభవం.

అయితే, దేశం సంగతి అటుంచి మొత్తం దక్షిణ భారతంలో ప్రత్యామ్నాయ సాంస్కృతిక, చిలనచిత్ర రంగాల్లో తెలుగు రాష్ట్రాలు క్షీణదశకు చేరుకున్నాయి. భయంకరమయిన, వర్ణింపశక్యం కాని స్తబ్దత ఇక్కడ రాజ్యమేలుతోంది. అయినంతలో ఈ నిర్లిప్తతను నిలువరించడం సామాజిక బాధ్యతనుకుంటాన్నేను. తెలుగు సినిమా చరిత్ర మొదలుకుని ఏమేం విదేశీ సినిమాలు మంచివో, అలాగే ఉద్దండులైన నటీనటులు వారి జీవితాలు, అనుభవాల గురించీ, ప్రఖ్యాత దర్శక నిర్మాతల్ని గురించీ, సమీక్షలు, వ్యాసాలు, బ్రోచర్లు ఇలా అనేక ప్రచురణలు వచ్చి ఉన్నాయి. ఇంగ్లీషులో అయితే లెక్కేలేదు. ప్రధాన స్రవంతితో సహా ప్రజా ప్రయోజన సినిమాల గురించి కూడా వివిధ గ్రంధాలు వచ్చాయ్. **టువార్డ్స్ ఎ పీపుల్స్ సినిమా** పేర్తో కస్తూరిబసు, ద్వైపాయన్ బెనర్జీ ఈ మధ్యే ఉద్గ్రంధం కూడా తీసుకొచ్చారు.

ఆ ప్రయత్నాలన్నింటినీ గౌరవిస్తూనే ఇక్కడ దశాబ్దాలుగా సొసైటీలు ఏర్పర్చి కృషి చేస్తున్నవారు, మంచి సినిమాలపై మమకారం గల మిత్రుల భావాల్ని ఒక్కదరికి తీసుకొచ్చే దిశగా ఆలోచన సాగింది. చాలామంది హృద్యంగా స్పందించారు. అనేకమంది అభిప్రాయాలు రాయమంటే, ఆస్తులు రాయమన్నంతగా బెదిరిపోయారు. భావాల్ని కాగితంపై పెట్టడానికి బద్ధకించినవారూ, రేపు మాపని ఆశపెట్టి చివరాఖరికి ఖాళీ చెయ్యిచ్చినవారు ఎందరో. కొద్దిమంది భావాలు ఫోన్‌లో పంచుకుంటే వాట్ని రికార్డ్ చేసి నేనే అక్షరరూపమిచ్చాను. ఇంకా అనారోగ్యం కారణంగా తోటకూర

వెంకటేశ్వర్లు, సమయాభావం వల్ల నల్గొండ ఫిల్మ్ సొసైటీ బెల్లి యాదయ్య వైజాగ్‌లోని నరవ ప్రకాశరావు, రమణ వంటి వారి వ్యాసాలు రాలేదు. నా వరకూ నాకు ఇదో పరిమితమయిన స్వల్పయత్నమే కాని సమగ్రం కాదు. అది కూడా సమాజంలో మైనారిటీలుగానున్న ట్రాన్స్‌జెండర్, స్త్రీలు, పురుషులనే వరుసని అనుకరించడం జరిగిందిందులో. ఇంకా ఇందులో చేర్చాల్సిన సినీ అభిమానులు, సొసైటీలు, విమర్శకులు చాలామంది ఉన్నారు. వారందరితో మరో ప్రయత్నం చేసే తలంపు ఉంది. ఆ వ్యాయామం అయిందను కోగానే ముద్రణాభారం గుర్తుకొచ్చింది. ఘాటైనప్పటికీ సూటిగా చెప్పాల్సిన విషయం ఒకటుంది. అసహాయులయిన కార్యకర్తల్ని చూసి అవహేళన చేయడం, అక్కర్లేని జాలి చూపించడం మాని వారి భారంలో కొంతైనా మోయడానికి సిద్ధపడేవారు అరుదు, ప్రజాఉద్యమాల్లో దశాబ్దాలుగా ఉన్నవారు సైతం ఇందుకతీతుల కారనేదో చేదు నిజం.

ఏ సంఘానికీ బాకాలూదకుండా, ముద్రల సంస్కృతికి వ్యతిరేకంగా పూర్తిస్థాయి సామాజిక కార్యకర్తగా కొనసాగడంపై మనోబలం సన్నగిల్లుతోన్న వేళ, నన్ను నేను కూడదీసుకోడానికి ఇరుకు దారులకి విరుద్ధమైన విశాలత్వం అవసరం. సంకుచితత్వాన్ని చెండాడే ప్రక్రియ అదెంతటిదయినా సమాజ మార్పులో దాని కృషిని గుర్తించడం, గౌరవించడం ఈరోజు ఎంత ముఖ్యమైనవో అర్థం చేసుకోడానికి కూడా కొంత సంస్కారం కావాలి. అలాంటి ఇంక్విలాబ్ దారిలో పయనిస్తూ సినిమాల గూర్చి స్త్రీ పురుషులతో సహా భిన్న లైంగికతల్ని గుర్తిస్తూ ట్రాన్స్‌జండర్ల భావాలకి చోటివ్వడం మొట్టమొదటిసారి జరిగింది. అంతరాల్ని నిరసిస్తూ నినదించే గళాల్నీ, అసమానతల్ని ఖండిస్తూ ఉదయించే కలాల్నీ కలుపుకోవడం ప్రతి ప్రజాఉద్యమానికీ తప్పనిసరి అని నా అభిప్రాయం. పురుష దృష్టికోణం నుండి బయటపడని వ్యవస్థకి ప్రధాన స్రవంతనే మూసలోనే కాలం వెళ్ళపుచ్చుతున్న కళారంగానికి అణగారిన గొంతుల భిన్న స్వరాల్ని నిజాయితీగా అందించే చిరు ప్రయత్నం ఈ సంకలనం. అందుకే ఇది ట్రాన్స్‌జెండర్లకి అంకితం ఇచ్చాను. అలాగే ఇంతకు పూర్వం వచ్చిన సినిమా వ్యాసాల్ని ఒకట్రెండు తప్పా, ఇందులో చేర్చలేదు.సాంస్కృతికోద్యమంలో ఇది తన రవ్వంత పాత్రను నిర్వహించగలిగినా ఈ కృషి సార్థకం అయినట్లే, సెలవు.

- గౌరవ్

1. జండర్ స్పృహలేని సినిమా జనానికి ప్రమాదం

– **రచన ముద్రబోయిన**, ఫౌండర్,
ట్రాన్స్‌విజన్ యూట్యూబ్ ఛానల్, సెల్ : 7075968101

మనది పితృస్వామ్యం, కాన వ్యవస్థలోని అన్ని పాశ్వాలూ దానికి లోబడే ఉంటాయ్. స్త్రీలు, ఇతర లైంగికతలు గల వ్యక్తుల్ని అణగదొక్కడానికే సమాజం చూస్తుంది. సినిమా కూడా దీనికి అతీతం కాదు. ధీరత్వం పురుషులకి మాత్రమే ఉంటుందనుకునే మూస ధోరణిగల వ్యవస్థ స్త్రీలు, ఇతర జండర్లు నాయకత్వ పాత్ర పోషిస్తారనే విషయాన్నే గుర్తించదు. ఒక హిజ్రా కూడా హీరోగా, హీరోయిన్‌గా నటించగలదనే స్పృహ సమాజంలో ఉండదు. పాఠ్యపుస్తకాలు, భాషా శాస్త్రాలు, సంస్కృతి రాజకీయాలు అన్నీ స్త్రీ–పురుషుల చట్రం నుండి బయటకు చూడవు, బయట పడవు. ప్రసార మాధ్యమాలలో ఈ పరిస్థితి ఇంకా దారుణం.

మనుషులకి స్టీరియోటైప్ నిర్వచనాలు అంటకట్టడానికి అలవాటుపడ్డ అసమాన వ్యవస్థలో జండర్ స్పృహ గురించిన చర్చ నిత్యం జరగాలి. నేటికి అనేక సంవత్సరాల క్రితమే అర్జెంటీనాలో వ్యక్తులు వారి ఇష్టానుసారం లైంగికతని మార్చుకునే వీలు కల్పిస్తూ భిన్నలైంగికతల గల వారికి హక్కులు కల్పించడం జరిగింది. అభివృద్ధి చెందిన అనేక దేశాలు ట్రాన్స్‌జండర్ల హక్కుల్ని గుర్తించి, గౌరవించీ సమాజంలో గౌరవనీయంగా, ప్రజాస్వామికంగా జండర్ స్పృహను నిర్మించేందుకు కృషి చేసాయి, చేస్తున్నాయ్.

మన దేశంలో మాత్రం ఇందుకు భిన్నంగా రాజకీయాలు, సాంస్కృతిక రంగాలు, సినిమా జండర్ దృక్పథాల్ని కాలరాసి పురుషాధిపత్యాన్ని మరింత పెంపొందిస్తున్నాయి. ట్రాన్స్‌జండర్లను చులకనగా, హీనంగా చూపిస్తున్నాయ్. ఎక్కువ శాతం సినిమాల్లో ట్రాన్స్‌జండర్ల పాత్రలు కూడా స్త్రీ–పురుషులే పోషిస్తున్నారు. సాంస్కృతికంగా కూడా ట్రాన్స్‌జండర్లు సమర్దులని భావించే స్థితి లేకుండా జబర్దస్త్ వంటి రియాలిటీ షోలలో పచ్చిగా వెకిలిగా స్త్రీలనీ, ట్రాన్స్‌జండర్లనీ చిత్రీకరిస్తున్నారు.

కులం, మతం, ఆస్తి మొదలయిన అంశాలలో పితృస్వామ్యం సమాజమంతటా అమలౌతోంది. మేధావులు, రచయితలు, నాయకులు అనబడేవారికి కూడా ట్రాన్స్‌జండర్ల గురించిన వీసమెత్తు అవగాహన లేదు. ప్రధాన స్రవంతి మీడియాలో

మా గురించిన వార్తలు రావు, నిత్యం ట్రాన్స్‌జండర్లపై జరిగే దాడుల్ని గూర్చి టీవీ ఛానెళ్ళూ, పత్రికలు ప్రస్తావించవు. మా జీవిత సమస్యల్ని స్పృశిస్తూ ఎవరూ గ్రంధాలు రాయరు, సినిమాలూ తీయరు, విద్యాహక్కు, ఆస్తి హక్కు, వివాహ హక్కు మొత్తంగా ప్రజాస్వామికంగా జీవించే హక్కు మాకు లేదు.

పోగా మా గురించి తప్పుడు ప్రచారాలు జరుగుతాయి. మూఢ నమ్మకాలు వ్యాప్తిలో ఉంటాయి. మారుమూల గ్రామాల్లో కాదు, నాగరికత వెల్లివిరిసే నగరాల్లో సైతం మా పట్ల వివక్ష దుర్మార్గంగా, బాహాటంగా అమలౌతుంది. పెద్ద పెద్ద చదువులు చదువుకున్న విద్యావంతులతో మొదలెట్టి, ఈ దేశపు ప్రజాస్వామ్యానికి నాయకులనబడే వారి వరకూ ట్రాన్స్‌జండర్ల గురించిన స్పృహ శూన్యం.

అందుకే మా సమస్యల్ని గురించిన చర్చలకీ మాకు ప్రాతినిధ్యం వహించగల అభివ్యక్తులకీ అనుగుణంగా అంతర్జాలంలో సైతం మా గురించీ ప్రచారమౌతున్న అవాస్తవాలకి విరుద్ధంగా నిజాల్ని ప్రచారం చేయడానికి, హైద్రాబాద్‌లో **ట్రాన్స్‌విజన్** పేరుతో భిన్న లైంగికతలు గల వ్యక్తులం సమిష్టిగా ఒక యూట్యూబ్ ఛానల్‌ని ప్రారంభించుకున్నాం. ఉర్దూ, కన్నడ భాషల్లో కూడా ప్రసారాలు చేస్తున్న **ట్రాన్స్‌విజన్ దేశంలోనే మొట్టమొదటి ట్రాన్స్‌జండర్ న్యూస్ ఛానల్.**

పుట్టుకతోనున్న శారీరకమయిన భౌతిక అవయవాల్ని ఆధారం చేసుకుని వ్యక్తుల లైంగికతల్ని నిర్ణయించడం, జీవితాంతం వార్ని ఆయా చట్రాల్లోనే ఉంచడం అప్రజాస్వామ్యం. ప్రతీ వ్యక్తికీ తన లైంగికతను నిర్ణయించుకోడానికి ఎంత హక్కుందో, పుట్టుకతో రుద్దబడ్డ లైంగికతని నిరాకరించడానికీ కూడా అంతే హక్కుంది. రాజ్యాంగం ప్రకారం ఏదోక కులంలో పుట్టినవారికి కులాతీతంగా ఉండడానికి, మతాల్ని విశ్వసించేవారికి ఏదో మతాన్ని అనుసరించినట్లుగానే మతాతీతంగా మెలగడానికీ కూడా హక్కున్నట్లే స్త్రీలు / పురుషులనే కాకుండా ఇతరులుగా తమని తాము వ్యక్తీకరించుకునేందుకు ప్రతి ఒక్కరికీ హక్కుంది. దానిని గుర్తించి, గౌరవించడం ప్రజాతంత్ర విధానం.

అయితే పురుషాధిక్యత దీనిని అంత త్వరగా అంగీకరించదు. ప్రతీ వ్యక్తికీ ఒకే విలువనే సూత్రం దానికి శరాఘాతం. అందుకే అది తనకి వీలైన అన్ని రూపాల్లో,

మార్గాల్లో పురుషాధిపత్యాన్ని వ్యవస్థలో పెంచి పోషిస్తుంది. లైంగికతకి సంబంధించీ ఈ సాంప్రదాయపు చట్రాల్ని బద్దలుకొట్టడం చాలా అవశరం. సినిమా తదితర కళా సాంస్కృతిక రంగాల్లో కూడా జండర్ స్పృహ పెరగాలి. అమెరికాలో బ్లాక్స్ మూమెంట్‌తో మొదలుకుని ఈ దేశంలో దళిత బహుజన మైనారిటీలు, స్త్రీలతో కలిసే మేం కూడా ప్రజాస్వామిక వ్యవస్థ కోసం, ట్రాన్స్‌జండర్ల హక్కుల కోసం పోరాటాలు చేస్తున్నాం.

వాటికి బెదిరిన పితృస్వామ్యం బలప్రయోగం, హింసలతో తన అధికారాన్ని ప్రకటించాలని చూస్తుంది. పోలీస్ స్టేషన్‌లో ఆదివాసీ స్త్రీ మధురను దారుణంగా రేప్‌చేస్తే, ఆమె ఆదివాసీ కాబట్టీ ఆమెకు వాంఛ **సహజాతమని** సుప్రీంకోర్టు వ్యాఖ్యానించీ సుమారు 50 సం॥రాలౌతోంది. నాటి నుండి మొన్నటి నిర్భయ దాకా దాడులు, అత్యాచారాల విషయంలో దేశ అత్యున్నత న్యాయస్థానం మొదలుకొని ఏ రంగం పితృస్వామ్యానికి అతీతం కావని నిరూపితమయింది. స్త్రీలు, ట్రాన్స్‌జండర్ల విషయంలో జరుగుతున్న దాడుల విషయంలో న్యాయం కోసం అడిగితే మా వ్యక్తిత్వాలపై తీర్పులిచ్చే అసహజమయిన, అన్యాయకరమయిన వైఖరి సమాజం తీసుకుంటుంది. ఇది చాలా దుర్మార్గమయిన విషయం.

జండర్ స్పృహ సామాజిక ఆరోగ్యానికి చిహ్నం. బాల్యం నుండీ మానవీయ దృక్పథాన్ని కాదని స్త్రీ, పురుష స్వభావాల్ని పిల్లలకి రుద్దడం మాని ఒక సమానతా దృష్టి ఏర్పర్చడం ద్వారా మార్పుకు దోహదం చేయెచ్చు. మనవంతు ప్రయత్నంగా అన్ని రంగాల్లో లైంగికతా స్పృహను పెంపొందించడానికీ, భిన్న లైంగిక ధోరణులని స్వాగతించడానికీ వ్యవస్థలో చోటు కల్పించడం అందుకోసం సినిమా మొదలు అన్ని మాధ్యమాల్నీ సున్నితంగా ఉపయోగించుకోవడం ప్రజాస్వామికతను బలపర్చడంలో ముఖ్యమయిన మెట్టు. సాంస్కృతిక, సామాజిక కార్యకర్తలు, మేధావులంతా ఈ దిశగా కూడా కృషి చేయాలని కోరుకుంటున్నాను.

2. సినిమా ప్రజాస్వామికం కావాలి!

– **చంద్రముఖి,** సినీ ఆర్టిస్ట్, ఫౌండర్ మెంబర్
తెలంగాణా హిజ్రాట్రాన్స్‌జెండర్ సమితి, సెల్ : 9912674109

స్వాతంత్ర్యానికి పూర్వం పౌరాణిక, దేశభక్తి చిత్రాలు కొద్దోగొప్పో ఆదర్శాలను బోధిస్తూ వచ్చేవి. సమాజంలో మంచి చెడులకి సంబంధించి కొద్దిపాటి లోపాలున్నా అర్థవంతమయిన చర్చను అవి లేవనెత్తేవి. తర్వాత సినీ పరిశ్రమలో సైతం రుగ్మతలు ప్రవేశించాయి. కులం, మతం, వర్గం, మూఢనమ్మకాల్ని ప్రచారం చేయడం మొదలైంది. ఆదర్శాల్ని గాలికొదిలిన కళా మాధ్యమం ఆధిపత్య రాజకీయాలకి కొమ్ముకాయడానికే ఉపయోగపడుతుంది. సినీ పరిశ్రమ కూడా ఇందుకు అతీతం కాదు.

ఒకప్పుడు సినిమా అంటే ఒక రకమయిన ఎడ్యుకేషన్, ఈరోజు ఎంటర్‌టైన్ మెంట్ మాత్రమే. సందేశాత్మకమయిన మానవీయ చిత్రాలు నిర్మించేవారే కరువయ్యారు. సినిమా మొత్తం పురుషాధిక్యతతో కొట్టుమిట్టాడుతోంది. వ్యవస్థలోని మగహంకారమే సినీ పరిశ్రమను సైతం శాసిస్తోంది. కథ, కథనం అన్నింటికీ కథానాయకుడే ప్రధానం.

వ్యవస్థలో ఈసరికే లోతుగా పాతుకుపోయి ఉన్న అసమానతల్ని మరింత పెంచేలా సినిమా ఉండరాదు. జెండర్ స్పృహ ఏమాత్రం లేని వారి చేతుల్లో రూపొందుతున్న సినిమాలు హిజ్రాలు, ట్రాన్స్‌జెండర్లని వెకిలిగానో, విలన్లగానో చూపుతున్నాయి తప్పితే పౌరసమాజంలో గౌరవనీయ వ్యక్తులుగా చిత్రించడం లేదు. ఇన్ని సంవత్సరాల సినిమా చరిత్ర అంతా మగవారి గొప్పతనం ఆడంబరంగా చూపడం తప్పితే భిన్న లైంగికతలని గుర్తించి చూపించినవి అరుదు.

హిజ్రాల్ని ఏడిపించడం, హీనంగా చిత్రీకరించడం, ఆయా సినిమా నిర్మాణంలో పాలుపంచుకున్నవారి దిగజారుడుతనాన్ని వ్యక్తీకరిస్తుందేకానీ మా వాస్తవ జీవితాల్ని కాదు. అత్యధిక శాతం దర్శక నిర్మాతలకీ, నటీనటులకి ట్రాన్స్‌జెండర్ల గురించి మిడిమిడి జ్ఞానమే కాని అవగాహన లేదు.

సినిమా కాలక్షేప వ్యవహారంగా టైంపాస్ ధోరణిగా కాక సీరియస్ అంశంగా సందేశాత్మకంగా నిర్మించాల్సిన అవశరం ఈరోజు చాలా ఉంది. ప్రధాన స్రవంతిలో సైతం ప్రత్యామ్నాయ దృష్టికోణాన్ని ఏర్పర్చుకున్నవాళ్ళు కొద్దిగా లేకపోలేదు. అయితే కులతత్వం, మతోన్మాదం, పురుషాధిక్యతలను నిరసిస్తూ దళిత, బహుజన, స్త్రీ, హిజ్రా, ట్రాన్స్‌జండర్, మైనారిటీల సమస్యలకి అద్దం పట్టే సినిమాలు రూపొందాలి. నటీనటులనే కాదు. దర్శక, నిర్మాణ రంగాలు సైతం కేవలం కొద్దిమంది అడ్డాగానున్న పరిస్థితి పోవాలి.

సినిమాల్లో సైతం హీరోయిజాన్ని పదేపదే రుద్దకుండా అదో బహుముఖ కళాత్మక పాశ్వాన్ని ఆవిష్కరించేలా రూపొందాలి. హేతుబద్దతలేని సన్నివేశాలు, నిజజీవితానికి ఏమాత్రం సంబంధం లేని సంగతులు, కొందరు వ్యక్తుల్ని కించపరచడం ద్వారా ఇంకొందరు వ్యక్తుల స్థాయిని పెంచే ధోరణులు పూర్తిగా పోవాలి. **సమానత్వమనేది సినిమా సారం కావాలి, నిర్మించడంలోనే కాదు, బోధించడంలో కూడా.**

సమాజంలో సవాలక్ష సమస్యలని పెట్టుకుని సినిమా మాత్రం స్వచ్ఛంగా ఉండాలనుకుంటే అత్యాశ అవుతుంది. ప్రజల్లో సాంస్కృతిక వికాసం కొరకు చేసే ప్రయత్నాలతోబాటూ మంచి సినిమాల్ని చూసే సంస్కృతిని పెంపొందించుకున్నప్పుడే మంచి సినిమాలు తీసేందుకు వీలౌతుంది. ఇందుకోసం సినిమా ప్రజాస్వామికతను సంతరించుకోవాలి. ప్రజాస్వామ్య సినిమాలు రూపొందాలి. మనందరం చేసే బహుముఖ ప్రయత్నాలతోనే అది సాధ్యం.

3. సమాంతర సినిమా, ఒక సామాజికవశరం

– **జమీలా బేగం,** సంస్థాపక సభ్యురాలు.
ఘర్ బచావో ఘర్ బనావో ఆందోళన్, ముంబాయి, సెల్ : 8850529228

అర్థవంతమయిన సినిమాకి కోట్లాది రూపాయలు అవసరం లేదు, కోట్లమంది పేదల పక్షాన నిలబడే చేవ చాలు. **ఈనాటి సినిమా పురుషుడి హింస, స్త్రీల దేహంపై ఆధారపడి నిర్మించబడుతోంది.** దేశంలో అసంఖ్యాక ప్రజలు నిత్యం ఎదుర్కొంటున్న నిజజీవిత వ్యధల పట్ల అరుదుగా తప్పితే సినిమాలే లేవు. నిరక్షరాస్యులు సైతం సులభంగా అర్థం చేసుకోగల దృశ్యమాధ్యమం సినిమా. అంతటి ప్రభావశీల సాధనం ఈరోజు కొద్దిమంది బడాబాబుల చేతుల్లో కాలక్షేపంగా, కోట్లు కుమ్మరించే వాణిజ్య సరుకుగా మారిపోయింది. అందుకే దేశంలో అనునిత్యం జరుగుతున్న అత్యాచారాల గురించి కానీ, అభివృద్ధి పేరిట ప్రభుత్వం కార్పోరేట్లు చేస్తున్న విధ్వంసం గురించి కానీ ఆకలి, నిరుద్యోగం, పోషకాహార లోపం, ఆరోగ్యం, విద్య, విస్థాపన తదితర సమస్యలపై వేళ్ళ మీద లెక్కపెట్టగలిగినన్ని సినిమాలు కూడా లేవు. ముంబయ్ నగరంలోని మురికివాడల ప్రజానీకం జీవన పోరాటాల్ని గురించి, ఇంకా ఇతరేతర సమస్యలపై మేం ఐదారు లఘు చిత్రాలు, డాక్యుమెంటరీలు తీసాం. ఈ మధ్యనే కొద్దిమంది మిత్రులతో కల్సి సమాంతర సినిమాల నిర్మాణం దిశగా కృషి చేస్తున్నాం. మురికివాడ పిల్లల కోసం రెండు పాఠశాలలు మేమే నడుపుకుంటున్నాం. కళా, సాంస్కృతిక రంగాల్లో అభిరుచి ఉన్న పిల్లలకి ఆయా అంశాల్లో శిక్షణిచ్చి ఒక కళాబృందాన్ని కూడా తయారుచేసుకున్నాం. **అన్నాభావ్ సాఠే మానవ్ వికాస్ సేవక్ సంఘ్** తరపు నుండీ దశాబ్దాలుగా ముంబాయి మురికివాడల్లో అణగారిన ప్రజల జీవించే హక్కుల కోసం పోరాడుతున్న మేము త్వరలోనే సమానత్వం దిశగా చిత్రాలు తీయటం సామాజిక అవశరమని నమ్మి అందుకోసం సొంత స్టూడియో పెట్టుకునేందుకు కూడా కృషి చేస్తున్నాం. సాగుతున్న అసమానతా దృశ్యమాధ్యమాలకి భిన్నంగా సినిమాను ఒక సమాంతర శ్రేణులకి సంబంధించిన ప్రత్యామ్నాయ ఉద్యమంగా నిర్మించడం అవసరం. ఆ దృష్ట్యా బహుముఖ భావనలతో కూడిన సమిష్టి ప్రయత్నాలు ఎక్కడికక్కడ జరగాల్సిఉంది. అందుకోసం మావంతు పాత్రను నిర్వహించడానికి మేమెప్పుడూ సిద్ధం.

4. డాక్యుమెంటరీలే ఎందుకు?

– సరస్వతి కవుల, డాక్యుమెంటరీ మేకర్,
రంగారెడ్డి జిల్లా, సెల్ : 9849718364

డాక్యుమెంటరీ చిత్రాల నిర్మాణాన్నే మీరెందుకు ఎంచుకున్నారని అప్పుడప్పుడూ నన్ను ప్రశ్నిస్తూంటారు. ఈ రంగం వాణిజ్య సినిమాతో పోలిస్తే అంతగా ఆర్థికంగా కలిసొచ్చేది కాదు, పరపతిని పెంచేదీ కాదు. డాక్యుమెంటరీలు వివిధ రకాలు – ప్రభుత్వ సంస్థలకోసం చేసేవి, స్వచ్ఛంద సంస్థలు, ఎన్.జి.వో.లకి చేసేవి, అలాగే మనం చెప్పాలనుకుంటున్న సందేశాన్ని చిత్రిస్తూ స్వతంత్రంగా చేసేవి. ఈ మధ్య కార్పోరేట్ కంపెనీలు కూడ సొంత 'డాక్యుమెంటరీ'లు నిర్మిస్తున్నాయ్. కానీ అవి వారి స్వప్రయోజనం కోసమే కానీ ప్రజా ప్రయోజనం కొరకు కావు.

వ్యక్తిగతంగా ఈ నా ప్రయాణంలో ఎన్నో మలుపులున్నాయి. 2000 సం॥రంలో నేను క్షేత్రస్థాయి డాక్యుమెంటరీలతో పాటూ కమర్షియల్ సినిమాల్లో సైతం పని చేయడానికి ఆసక్తి చూపించాను. తెలుగు, హిందీ సినీ పరిశ్రమల్లో కొన్ని ఫీచర్ ఫిల్మ్‌లకి అసిస్టెంట్ డైరెక్టరుగా, కాస్ట్యూమ్ డిజైనర్‌గా పనిచేసాను. డాక్యుమెంటరీలు తీయడం కూడా అప్పుడే ప్రారంభించాను. సామాజిక కార్యకర్తగా నాకు సమాజంలో డాక్యుమెంటరీల అవశరం చాలా బలంగా కనబడింది. ప్రజల సమస్యలకు రూపం ఇవ్వడంలో డాక్యుమెంటరీల పాత్ర చాలా ఉంది. వాటిద్వారా సమస్యలను చర్చకు పెట్టి బాధిత ప్రజల్ని ఒక్కదరికి చేర్చడం వీలౌతుందనేది నా అనుభవం. ప్రధాన స్రవంతి సినిమా, టీవీలు కావాలని ఎంతలా విస్మరించినా మంచి డాక్యుమెంటరీలకు ప్రజాదరణ ఎప్పుడూ ఉంది, ఉంటుంది.

సామాజిక చైతన్యం కలిగించడంలో డాక్యుమెంటరీల పాత్రను ఎవరూ కాదనలేరు. సామాజిక కార్యకర్తగా నేను డాక్యుమెంటరీలను విస్తృతంగా వివిధ ప్రజా ఉద్యమాల్లో వినియోగించాను. మొదట 2003-6 సం॥రాల్లో తెలంగాణాలోని నల్గొండ జిల్లాలో జరుగుతున్న మైనింగ్ వ్యతిరేకోద్యమం గూర్చి చెప్పాలి. ఒక నెల రోజుల వ్యవధిలో ప్రజాభిప్రాయ సేకరణ జరగాల్సి ఉందనగా, బాధిత గ్రామాల

ప్రజలకు యురేనియం మైనింగ్ వల్ల తలెత్తే దుష్పరిణామాలకి సంబంధించీ అవగాహన కల్పించాల్సి ఉండింది. మేం గ్రామాలు సందర్శించినప్పుడు అధికారులు ప్రజలకి ఎలాంటి అబద్దాలు చెప్పారో చూసి నివ్వెరపోయాం. కొందరు ప్రజలకి మందుల ఫ్యాక్టరీ కడుతున్నామని చెబితే, మరికొంత మందికి బిస్కట్ల యూనిట్ పెడుతున్నామని చెప్పారట! అప్పటికీ నాకే అసలు యురేనియం మైనింగ్ పరిణామాల గురించి పూర్తిగా తెలీదు. అలాంటిది, ప్రజలకి వీలైనంత సమగ్రంగా ఎలా తెలపాలని ఆలోచించా. మైనింగ్, రేడియేషన్ కారణంగా తలెత్తే వినాశకర పరిస్థితిని కళ్ళకు కట్టినట్లు చిత్రిస్తూ అప్పటికి శ్రీప్రకాష్, జార్ఖండ్‌లోని జాదూగూడ నేపధ్యంగా తీసిన, **"బుద్ధ వీప్స్ ఇన్ జాదుగూడ"** డాక్యుమెంటరీ కంటబడింది. వెంటనే దానిని స్థానికులకి కూడా సులభంగా అర్థమయ్యేలా వారం రోజుల్లో తెలుగులో చేసి గ్రామగ్రామాన తిరిగి ప్రజలకి చూపించాం. కేబుల్ టీవీలో ప్రసారం చేయించాం. అలాగే ఇంగ్లీషు వెర్షన్‌ని హైద్రాబాద్‌లోని స్కూళ్ళు, కాలేజీలలో ప్రదర్శించాం. కొన్ని జాతీయ ఛానళ్ళు కూడా దానిని ప్రసారం చేసాయి. అయినప్పటికీ, గ్రామాల్లో తిరిగి ప్రజలతో మమేకమయి వారి సందేహాలు తీర్చి ఈ డాక్యుమెంటరీ చూపించిన అనుభవం గొప్ప ఫలితాన్నిచ్చింది. ఆగస్టు 2003న జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో ప్రజలంతా స్వచ్ఛందంగా ఒక్కమాటకు కట్టుబడి ప్రాజెక్టును వ్యతిరేకించారు. అఖిలపక్ష సమావేశంలో ప్రదర్శించిన ఆ ఫిల్మ్ చూసి నాటి ప్రతిపక్షనేత డా॥ వై.యస్. రాజశేఖర్ రెడ్డి సహా ఎందరో ప్రాజెక్ట్‌ను నిర్ద్వంద్వంగా నిరాకరించారు. మైనింగ్ కారణంగా తలెత్తే దుష్పరిణామాలని చర్చించిన ఆ డాక్యుమెంటరీ ప్రజాస్వామిక ఉద్యమాల్లో ప్రజల్ని మమేకం చేయగలిగింది. **నిబద్ధత గల ప్రజాభిప్రాయం ప్రజాస్వామ్యానికి వెన్నెముక వంటిది. దానిని నిటారుగా నిలిపి ప్రజలకు వారి హక్కులు, విధులకు సంబంధించిన అవగాహన కల్పించడంలో ఆ డాక్యుమెంటరీ ప్రధానపాత్ర పోషించింది.**

నాటి ప్రచారంలో దేశాభివృద్ధికి తోడ్పడే మైనింగ్‌ను ఎలా వ్యతిరేకిస్తామని మమల్ని కొందరు అడిగేవారు. ఆ ప్రశ్నలే నన్ను విశాఖజిల్లా నర్శీపట్నం వద్ద రంగురాళ్ళ తవ్వకాల్ని తీసుకుని మొట్టమొదటిసారిగా స్వతంత్రంగా, పరిశోధనాత్మక డాక్యుమెంటరీ **"బిహైండ్ ది గ్లిటర్స్"** నిర్మించడానికి నడిపించాయి. ఆనాటి నుండి

తెలంగాణ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టులు, కోస్టల్ కారిడార్, పోలవరం, పురుగుమందుల ప్రభావం, జన్యుమార్పిడి విత్తనాలు మొదలయిన అంశాలపై డాక్యుమెంటరీ చిత్రాలు తీయడం జరిగింది. అలాగే, ప్రఖ్యాత గే ప్రొఫెసర్ హైదరాబాదీ ఫెమినిస్ట్ జమిల్ నిషాత్ కవిత్వాన్ని ఇంగ్లీష్‌లోకి అనువదించిన హౌషాంగ్ మర్చంట్‌పై **'మై డియర్ గే టీచర్'** అనే డాక్యుమెంటరీ తీసా. ముఖ్యంగా రైతులు, పర్యావరణానికి సంబంధించీ ఈ రోజు అందరం దృష్టి పెట్టాల్సిన అత్యవసర స్థితి (ఎమర్జెన్సీ) ఉందని నేను నమ్ముతాను. ఆ దిశగా అంతా ప్రయత్నించి ఎవరి పరిమితుల్లో వారు పనిచేయాలని నా భావం. సముద్ర తీరంలో రానున్న కోస్టల్ కారిడార్‌కి సంబంధించిన డాక్యుమెంటరీని 2009 ఎన్నికల సమయంలో వేన్‌పిక్ దగ్గరి గ్రామాల్లో చూపించాం. అలాగే, బొగ్గు, ధర్మల్ ప్లాంట్‌లు వస్తున్న కరీంనగర్ జిల్లాలో కూడా చూపించాం. అదే ఫిల్మ్‌ను 2009 వేసవిలో ఖమ్మం జిల్లాలో ఓపెన్ కేస్ట్‌మైన్ జెవిసి–2 కి జరిగిన ప్రజాభిప్రాయ సేకరణలో కూడా ప్రదర్శించాం. హైద్రాబాద్, బెంగుళూరుల్లో తీర ప్రాంతం నుండి వచ్చిన విద్యార్థుల మధ్య దానిని ప్రదర్శించాం అలాగే రైతుల గురించి నిర్మించిన ఫిల్మ్‌లని క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న అనేక ఎన్.జి.వో. సంఘాలు ఉపయోగించుకున్నాయి. తమిళనాడులో సేంద్రీయ వ్యవసాయం చేస్తున్న సుదర్శన్ అయ్యర్ గురించిన డాక్యుమెంటరీ ఎంతగా ఆదరణ పొందిందంటే అది తీసి 13 సం॥రాలౌతున్నా ఈనాటికీ ప్రకృతి సహజ సేద్యం చేయాలనుకునే ఎందరో దానిని పదేపదే చూస్తుంటారు. ఎన్నో స్వచ్ఛంద సంస్థలు కూడా దీనిని ఉపయోగించు కుంటున్నాయి.

యూట్యూబ్, వాట్సప్‌ల రాకతో ప్రభుత్వ, ప్రైవేటు సమాచార సంస్థలు, ఎన్‌జివోలు, ఛానెళ్ళకీ ఆదరణ తగ్గింది. ప్రజానీకం దగ్గరికి డాక్యుమెంటరీలు తీసికెళ్ళే మార్గం తేలికయ్యింది. ప్రపంచంలోనే గొప్ప డాక్యుమెంటరీలని వీక్షించేందుకు ఈరోజు ఇంటర్‌నెట్‌లో అనేక ఛానళ్ళు అందుబాటులో ఉన్నాయి.

అయితే ఆర్థికంగా భరోసా ఇవ్వని, లాభసాటి మాటటుంచి ఎక్కువమంది దాతలు కూడా ముందుకు రాని డాక్యుమెంటరీల్ని నిర్మించి జీవనోపాధి ఎలా పొందడమనే సమస్య ఇప్పటికీ అలానే ఉంది. అయినప్పటికీ, ఎంతోమంది స్వతంత్ర డాక్యుమెంటరీ నిర్మాణకర్తలు ప్రజాసమూహాల నుండి, స్వచ్ఛంద సంస్థల నుండి

విరాళాలు పొందగలుగుతున్నారు. వారి వారి ప్రయత్నాల్లో సఫలీకృతులౌతున్నారు. ప్రభుత్వం చేత నిర్మించబడుతోన్న చిత్రాలు, స్వచ్ఛంద సంస్థలు తీస్తున్నవి కూడా ఎడిటింగ్ దగ్గర కొచ్చేసరికి సంకుచిత మనస్తత్వాల ప్రభావాలకి లోనౌతున్నాయి. రాజకీయ పార్టీలు సైతం వారికి అనుగుణంగా మీడియాను నియంత్రించాలని ప్రయత్నిస్తున్న ప్రస్తుత పరిస్థితుల్లో స్వతంత్ర డాక్యుమెంటరీ చిత్రాల అవశరం, ప్రాశస్త్యం మరింత పెరిగింది.

బిబిసి వంటి ప్రజా సమాచార మాధ్యమ విధానం కల యునైటెడ్ కింగ్‌డమ్ వంటి దేశాల్లో డాక్యుమెంటరీలని ఛానెళ్ళలో ప్రసారం చేసే నిర్దిష్టమయిన సాంప్రదాయం ఉంది. డాక్యుమెంటరీ చిత్రాలకి జన్మస్థానమయిన బ్రిటన్‌లో వంద సం॥రాలుగా ఈనాటికీ డాక్యుమెంటరీ చిత్రాలకి ఆదరణ ఏమాత్రం తగ్గలేదు. అటువంటి ఆరోగ్యకర సంస్కృతి మాత్రమే ఏ దేశపు ప్రజాస్వామ్య విధానాన్నయినా ప్రతిబింబిస్తుంది. ఇండియాలో కూడా అలాంటి స్వతంత్ర డాక్యుమెంటరీల్ని వీక్షించే ప్రేక్షకులు, భాగస్వాముల సంఖ్యను అర్థవంతమయిన రీతిలో పెంచుకోవడం ద్వారానే సమాజంలో ప్రజాస్వామిక పునాదులనేవి ప్రజల సహకారంతో బలపడగలుగుతాయి. ఆ దిశగా ప్రయత్నించడం మనందరి కర్తవ్యం.

5. సినిమాలు - స్త్రీలు

– రజనీ, రే సర్కిల్, స్టీరింగ్ కమిటీ మెంబర్, సెల్ : 98480 30089

తొంభై సం॥రాల క్రితం స్త్రీకీ శరీరం ఉందనీ, దానికీ వ్యాయామం కావాలనీ ఆమెకీ హృదయం ఉన్నదనీ దానికీ అనుభవం అవసరమని ఉద్ఘాటించిన మహనీయుడు చలం. స్త్రీకి ఆర్థిక స్వాతంత్ర్యం ఉండాలని ఆశించాడు. సమాజానికి ప్రతిబింబం సినిమా. అక్కడ కూడా స్త్రీల పట్ల సంకుచిత దృష్టికోణమే ఉంది. మీరే సినిమాలో చూడండి, హీరోయిన్లకు స్వతంత్రంగా సమస్య వచ్చినప్పుడు సొంతంగా నిర్ణయించుకునే తెగువ ఉండదు. అందులో నుండి ఆమెను బయటపడేయడానికి కచ్చితంగా హీరో కావాలి. స్వతహాగా స్త్రీలు భయస్తులనీ, పిరికి వాళ్ళనీ, అందచందాలపై తప్పితే ఇతర అంశాలపై ఆసక్తి లేనివారనీ, సున్నిత మనస్కులనీ, విధేయులని చూపడం జరుగుతుంది. అందుకే రాజకీయ సామాజిక విషయాల్లో ఆమెకి అసలు ప్రమేయం ఉండదనీ, ఉండరాదనీ సినిమా నిర్మాతలు, దర్శకులు బలంగా నమ్ముతారు. కాబట్టే చెడుపై పోరాటం చేయడం పురుషుడికే సాధ్యమనీ స్త్రీ ఆమె ఎన్ని తెలివితేటలు కలది అయినా విద్యావంతురాలైనా అతడికి వొదిగిమదిగి అడుగుజాడల్లో తోడునీడగా నడవడమే ఉత్తమం అనే భావనను సినిమాలు కలిగిస్తాయి.

అద్వితీయ దార్శనికుడు సత్యజిత్‌రేపై అభిమానంతో **జై భారత్** నిర్మించుకున్న సినిమా బృందం **రే సర్కిల్**, మంచి సినిమాల్ని చూడటం, వాట్ని గురించి చర్చించు కోవడమే ప్రధానంగా గత నాలుగు సంవత్సరాలుగా నడుస్తోంది. భారతీయ విప్లవానికి కొత్త గొంతుకలతో కూడిన కొనసాగింపుగా సమిష్టిగా కృషి చేస్తున్న మేము ఖల్సాస్ఫూర్తి భవనంలో మా రే సర్కిల్ కోసం ఒక సినీ థియేటర్‌ను సినిమాలు చూడటం కోసమే నిర్మించుకున్నాం. మా జాతీయ నాయకుడు ఆజాద్‌షేక్ గురించి ఆయన సంస్మరణార్థం డాక్యుమెంటరీ కూడా చేసాం. లింగ సమానతతో కూడిన దృక్పథం వ్యవస్థలో పెంపొందనంతదాకా సామాజిక ప్రసార మాధ్యమాల్లో కూడా స్త్రీలపై వివక్ష తప్పదు. ఇందుకు వ్యతిరేకంగా పన్చేయడం మనందరి బాధ్యత.

6. అంతరంగాన్ని తీర్చిదిద్దేవి మంచి చిత్రాలే

– కాళిదాసు పురుషోత్తం, ప్రోగ్రెసివ్ ఫిల్మ్ అసోసియేషన్,
నెల్లూరు, సెల్ : 9247564044

చిన్నప్పట్నుంచీ సినిమాలంటే ఆసక్తి. అప్పటికి నెల్లూరు ప్రపంచంలోని మంచి క్లాసిక్ చిత్రాలన్నింటికీ అడ్డాగా ఉండేది. నేను ఉస్మానియాలో తెలుగు పి.హెచ్.డి విద్యార్థిగా ఉన్ననాటి నుండే అక్కడ సినిమాలు చూసే అలవాటుండేది. తర్వాత ప్రముఖ కవి పఠాభి రామిరెడ్డి, స్నేహాలతారెడ్డి, గిరీష్ కర్నాడ్ మొదలగువారు యు.ఆర్. అనంతమూర్తి గారి ప్రసిద్ధ సంచలన నవల **'సంస్కార'**ని సినిమాగా నిర్మించారు. దేశమంతటా విడుదలైన ఆ సినిమా వాణిజ్య పరంగా డబ్బులు రావన్న భయంతో నెల్లూరులో ఎవరూ తీసుకోలేదు. అలాంటి సమయంలో కొద్దిమంది మిత్రులం ప్రోగ్రెసివ్ ఫిలిం సొసైటీ (దీనినే ప్రోఫిలిం సొసైటీ అని పిలిచేవారు). స్థాపించి సంస్కారను ప్రదర్శించాం. తర్వాత కాలంలో ఎన్నో కార్యక్రమాలు చేసాం.

స్థాపించిన 6 నెలల్లోనే ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియాతో సహా, పూనా ఫిల్మ్ ఇనిస్టిట్యూట్ కూడా అఫిలియేట్ అవడమే కాక స్పానిష్, రష్యన్, జర్మన్, ఫ్రెంచ్ సినిమాలెన్నో ప్రదర్శించాం. ప్రతీ సినిమా అయ్యాక బి. నరసింగరావు వంటి వార్ని పిల్చి సినిమాల్ని గురించి ప్రసంగాలు ఏర్పాటు చేసేవాళ్ళం. సత్యజిత్‌రే పథేర్ పాంచాలి, బెర్గ్‌మెన్ వైల్డ్ స్ట్రాబెర్రీస్, కురుసోవా రషోమన్ పాఠ్యపుస్తకాలుగా ఫిల్మ్ అప్రిషియేషన్ కోర్సు పెట్టాం. సౌత్ ఇండియా ఫిల్మ్ సొసైటీ కాన్ఫరెన్స్‌ను కూడా నిమయిఘోష్ వంటి వార్ని అతిథులుగా పిలిచి నిర్వహించాం. కెనడియన్ మెక్లర్ ఫిల్మ్‌లు, నేషనల్ ఫిల్మ్ ఆర్కివ్స్ సినిమాలు విస్తృతంగా ప్రదర్శించాం. సావనీర్లు ముద్రించడమే కాక లెక్కలేనన్ని కరపత్రాలు వేసి పంచాం.

అప్పటికే విజయవాడ ఫిలిం సొసైటీ కార్యకలాపాలు జరుగుతున్నాయి. చార్వాక పత్రిక స్థాపకులు తోటకూర వెంకటేశ్వర్లుగారప్పటికే ఎమ్మెన్ రాయ్ సిద్ధాంతమైన **సాంస్కృతిక పునర్వికాసం (రినైజాన్స్)** స్ఫూర్తితో సహకార ఆర్థిక విధానం (కో–ఆపరేటివ్ ఎకానమీ) తరహాలో బ్యాంకు ఉద్యోగిగా లైబ్రరీయే కాక వరల్డ్ క్లాసిక్స్ ప్రేక్షకులకి చూపించడం కోసం ఫిల్మ్ సొసైటీ కూడా స్థాపించి నడిపేవారు.

శరపంజర, కాడు వంటి చిత్రాల్ని వేసేవారు. దాని స్ఫూర్తితోనే తెనాలి క్లాసికల్ ఫిల్మ్ సొసైటీ, గుడివాడ, మచిలీపట్నం సొసైటీలు ఏర్పడినట్లు గుర్తు. కాన వారి సహకారం కూడా తీసుకున్నాం. మా స్ఫూర్తినందుకుని తదనంతరం చిత్తూరు, సూళ్ళూరుపేట, బాపట్ల, కావలి మొదలైన ప్రాంతాల్లో సైతం సొసైటీలు ఏర్పడ్డాయి. పిడతల రంగారెడ్డిగారు అమాత్యులుగా ఉన్నప్పుడు సొసైటీల కోసం టేక్స్ రిలీఫ్ తెచ్చుకున్నాం. అయితే ఎన్.టి.ఆర్. గారి పాలనలో వచ్చిన జి.వో. సొసైటీల అస్తిత్వానికి గండి కొట్టింది. ఇంతలో సరాసరి ఇంట్లోకి వచ్చిన టీవీ, సొసైటీలను మరింత బెదరగొట్టింది. అలా 84 వరకూ నడిపిన సొసైటీని తదనంతరం వ్యక్తిగత కారణాల వల్ల కూడా నడపలేక మరొకరికి అప్పగించేసాను. ఎన్నో ఫిలిం ఫెస్టివల్స్‌ను అనితర సాధ్యంగా నిర్వహించిన మేం ఎందరో సినీ ప్రేమికుల్ని తయారుచేయగలిగాం.

ప్రభుత్వ క్షేత్ర ప్రచారశాఖ సహకారాన్ని కూడా తీసుకుని స్థానిక కలెక్టరు, అధికారుల్ని కలుపుకుంటూ మేం చేసిన కార్యక్రమాలు అన్నీ ఇన్నీ కావు. మద్రాసు, పూనా సినిమా సంస్థలు మా వెన్నంటి ఉండేవి. మద్రాసు నుండి కె. శ్రీనివాసన్ అనే ఫిల్మ్ ఎక్స్‌పర్ట్‌ని పిలిపించి సినిమాలపై తరగతులు నిర్వహించుకున్నాం. స్వయంగా ఎంతోమంది ప్రముఖులు ఇక్కడికి వచ్చి మా కార్యక్రమాల్లో భాగస్వాములయ్యేవారు. సోషలిస్టు దేశాల సినిమాలు ఉచితంగానే ప్రదర్శనకి దొరికేవి. ఏదేమయినా, **మంచి సినిమా మానవీయ స్పృహ గల అంతరంగాన్ని నిర్మించే ఆర్ద్రమయిన సాధనం.** అర్ధవంతమయిన వ్యవస్థ రూపకల్పనలో అలాంటి కళాత్మక చిత్రాలకెపుడూ స్థానం ఉంటుంది.

7. ప్రత్యామ్నాయ సినిమా : కొన్ని అభిప్రాయాలు

– గంగారెడ్డి, ఫిల్మ్‌మేకర్, బెడ్‌ఫోర్డ్ విశ్వవిద్యాలయం (లండన్)
పూర్వ విద్యార్థి, సెల్ : 9000022443

తెలుగులో మంచి సినిమాలు రావట్లేదనే అభిప్రాయం చాలామంది లాగానే నాక్కూడా ఉంది. అందుకు గల కారణాలని నాకనిపించిన వాట్ని మీతో పంచుకోడానికే ఈ చిరుప్రయత్నం.

సినిమా అనగానే హీరో, హీరోయిన్ (లు), విలన్(లు), కమెడియన్(లు), ఆరుపాటలు, నాలుగు ఫైట్లు, రెండు మూడు సెంటిమెంట్లు, ఒక ఐటం సాంగ్ అనే ధోరణి బలంగా స్థిరపడిపోయిన ఒక వ్యవస్థలో ప్రత్యామ్నాయ సినిమాల గురించి ప్రస్తావించుకుంటూ, వీలయినంత విస్తృతంగా చర్చించుకోవడం చాలా అవశరం.

మొత్తం సమాజం ఒక రకమయిన వ్యక్తి పూజని చేస్తున్నప్పుడు అందులోని ఏదో ఒక్క రంగం మాత్రం అందుకు అతీతంగా ఎలా ఉండగలుగుతుంది?

ప్రత్యామ్నాయ సినిమాలుగా గతంలో ప్రచారం చేయబడినవి కూడా అతిశయోక్తులతో కూడిన మూస ప్రయత్నాలేకానీ సమాజం మొత్తానికి వర్తించేవి కావు. అన్నింటా అమలౌతోన్న అగ్రవర్ణ కులాధిపత్యం, పురుషాధిక్యతలు దశాబ్దాలుగా తెలుగు సినిమాను భల్లూకపు పట్టులా పట్టుకు వేలాడుతూనే ఉన్నాయి.

ఏ నేపధ్యం లేకుండా ఏ ప్రముఖుడికీ బంధువు కాకుండా కులం, మతం, ధనం కీర్తి వంటి వాటికి అతీతంగా నటనా కౌశలంతో, ప్రతిభా నైపుణ్యంతో సినీ పరిశ్రమలో నిలదొక్కుకున్నవారు అరుదు.

ప్రధాన స్రవంతిలోని ఈ అవలక్షణాలే లఘు చిత్రాల్లో కూడా కొనసాగు తున్నాయి. మూస పద్ధతులని తలపై పెట్టుకు మోస్తున్న మెయిన్ స్ట్రీమ్ మీడియా ప్రభావంతో పులిని చూసి వాతలు పెట్టుకున్న నక్క చందంగా షార్ట్‌ఫిల్మ్ కూడా అదే బాణీని అనాలోచితంగా అనుసరిస్తోంది.

ప్రపంచ వ్యాప్తంగా లఘు చిత్రాన్ని తీసుకుని ప్రభావశీలమయిన వ్యక్తీకరణగా ప్రయోగాలు చేసిన ఎన్నో ఉదంతాలున్నాయ్. మన దేశంలో కూడా మళయాళం, మరాఠీ, బంగాళీ, ఇంగ్లీషుల్లో ఎన్నో మంచి ప్రయోగాలు జరుగుతున్నాయి. బాధాకరమయిన విషయం ఏమిటంటే, అలాంటి ప్రత్యామ్నాయ ప్రయత్నాల గురించి నేటి మన యువతకు తెలియజేసే ప్రజాప్రయోజన మాధ్యమాలు కావల్సినన్ని లేకపోవడం.

ఈ క్రమంలో ఎక్కడికక్కడ మంచి సినిమాలకి సంబంధించిన నిర్మాణాత్మక కృషి నిబద్ధతగా జరగాల్సిన అవశరం ఉంది. సినిమా అంటే రంగులు, హంగులు కాదనీ అదొక బాధ్యతతో కూడిన అభివ్యక్తనే విషయాన్ని విస్మరించని నూతన తరం వృద్ధి చెందినప్పుడే కొత్త తరహా సినిమాలని మనం ఆశించడానికి ఆస్కారముంటుంది. నెపాన్ని ఎవరిమీదకూ నెట్టకుండా ఈ పనిని కర్తవ్యంగా తల్చి ఆ దిశగా కార్యోన్ముఖులు కావడం, ఎవరి పరిమితుల్లో వారు నిజాయితీగా ప్రయత్నాలు చేయడం ఈనాటి తక్షణావశరం.

8. పోరాట రూపంగా సినిమా!

– లాలం సుబ్బయ్య, సామాజిక కార్యకర్త, కర్నూలు, సెల్ : 9440341735

దశాబ్దాల స్వాతంత్ర్యం శతాబ్దాల సంకుచితత్వాన్ని తొలగించలేకపోయింది. అందుకే ఈ దేశంలో ఇంకా కులం, మతం, లింగం, రాజకీయం ఆధిపత్యం చెలాయిస్తున్నాయి. వీటి నుండి కళ కూడా బయట పడలేదు. కాసుల కబంధ హస్తాల్లో చిక్కుకుని ఉంది. అందుకే మనకు ప్రజని చైతన్యపరిచే అర్థవంతమయిన కళాత్మక చిత్రాలకంటే అశ్లీలాన్నీ, హింసనీ, అవాంఛనీయమయిన ఉద్రేకాల్ని, బానిసత్వాన్నీ చూపించే సినిమాలే అధికం. ఆరోగ్యకరమయిన సంస్కృతికి సంబంధించిన స్పృహను సమాజంలో కలిగించడమే సాంస్కృతికోద్యమాల లక్షణం, లక్ష్యం. అది అకస్మాత్తుగా ఆకాశం నుండి ఊడిపడేది కాదు. పెట్టుబడిదారీ గుత్త సంస్థల కనుసన్నల్లో వారి వికారపు భావాలని జనాలపై రుద్దడానికే రూపొందుతున్న బడా బడ్జెట్ భారీ సినిమాలకి ప్రత్యామ్నాయంగా, విప్లవోద్యమ వెలుగులో అసమానతలని నిరసిస్తూ మనుషులందరి నడుమ ఐక్యతని ఆశిస్తూ, అందుకోసం నిబద్ధతగా కృషి చేసే శాస్త్ర సాంకేతిక మాధ్యమ ప్రేమికులు కావాలి. అటువంటివారు మాత్రమే చెత్త సినిమాలకి విరుద్ధంగా హృద్యమయిన చిత్రాల్ని మల్చగలుగుతారు. ఆర్. నారాయణ మూర్తి వంటివారు ఆ దిశగా కొంత ప్రయత్నించినప్పటికీ ఇంకా ఎంతో కృషి జరగాల్సిన అవసరం ఉంది. ప్రమాదకరమయిన రీతిలో కుల, మత తత్వాన్నీ పురుషాధిపత్యాన్ని లంపెన్ సంస్కృతిని పెంచి పోషిస్తున్న ఈనాటి విషమాధ్యమాల నుండి యువతను విముక్తి చేయడం వివేచనాపరులందరి విధి. అందుకోసం సామ్రాజ్యవాదపు సంకెళ్ళలో బంధీ అయ్యి ఉన్న కళకి ప్రజాభ్యుదయంతో కూడిన ఒక అంతరాత్మను నిర్మాణాత్మకంగా చేకూర్చే బృహత్తర కార్యాన్ని కళాసాంస్కృతిక కార్యకర్తలంతా భుజాన్నేసుకున్నప్పుడే మార్పు సాధ్యమౌతుంది. ఐతే, ఇందుకోసం ముఖ్యంగా యువత పూనుకోవాలి. కెరీరిజం, కేర్‌లెస్‌నెస్‌కు భిన్నంగా వ్యక్తిత్వంతో కూడిన ఆరోగ్యకరమైన సాంస్కృతిక వికాసానికి వారధులుగా పనిచేయడానికి సిద్ధం కావాలి. సినిమాను కేవలమొక వినోదమాధ్యమంగా కాక విప్లవ రాజకీయాల పోరాట రూపంగా చూడగలగాలి.

9. మంచి సినిమాలు ఎందుకు చూడాలి వాటినే ఎందుకు చూపించాలి

- పి.యస్. అజయ్ కుమార్

అనకాపల్లి ఫిల్మ్ సోసైటీ, సెల్ : 9989830711

అవేమి ప్రశ్నలు, పిచ్చి ప్రశ్నలు. ఈ భూగోళం మీద ఎవరైనా వీటికి 'నెగిటివ్' గా జవాబు చెపుతారా? ఏనాడూ మంచి సినిమా అంటే ఏమిటో ఆలోచించడానికి కూడా ప్రయత్నించని, సాహసించని వారు కూడా మనం సూటిగా అడిగితే మంచి సినిమాలే చూడాలని అంటారు. ఇంతకీ మంచి సినిమాలు, చెడ్డ సినిమాలు అంటే ఏమిటి? మేధావులకు మాత్రమే అర్థమయ్యి (లేదా వారు అర్థమైనట్లు నటించే మోడరన్ పెయింటింగ్ లాగా) సినిమానే మంచి సినిమానా? శంకరాభరణం మంచి సినిమానా, చెడ్డదా? అసలు నూటికి నూరు శాతం మంచి, చెడు వుంటాయా?

నేను ప్రపంచ సినిమా, ఆ సినిమా మాధ్యమంలో వచ్చిన మార్పులు, భావ స్రవంతులు, టెక్నిక్ లో వచ్చిన, కథ, కథనాలలో వచ్చిన మర్పులను గూర్చి ఒక పద్ధతిలో లోతుగా అధ్యయనం చేసినవాడను కాను. హైస్కూలు, కాలేజీ (ఇంటర్) నాటికి నేను నా మిత్రులు అయితే ఎన్టీఆర్ లేకపోతే ఎఎన్ఆర్ అభిమానులం. మా అభిమాన నటులు నటించిన సినిమాయే గొప్ప సినిమా. వారు నటించిన సినిమ చెడ్డది అయ్యే అవకాశమే లేదు. ఇప్పుడు టివిలో వచ్చే అలనాటి నా అభిమాన నటుని సినిమాలు చూస్తున్నప్పుడు (పూర్తిగా కాదు, ఎందుకంటే ఇప్పుడు భరించే ఓపిక లేదు), మన సినిమాలు ఎక్కడ ఆగిపోయాయో ఒక ప్రేక్షకునిగా మనం ఎంత దూరం వచ్చామో తెలుస్తువుంటుంది. దీని అర్థం ఎన్టీఆర్, ఎఎన్ఆర్ లను తీసి పడేస్తున్నానని అనుకోవద్దు. 'మిస్సమ్మ' నాకు చాలా ఇష్టమైన సినిమా. 'సీతారామయ్య గారి మనవరాలు' లో మీరు ఒక కొత్త ఎఎన్ఆర్ ను చూస్తారు, అలా ఎందుకు జరిగిందో ఆయనే ఒక ఇంటర్వ్యూలో చెప్పాడు.

సరే, సినిమా అంటే తెరమీద కనిపించే నటులు, నటీమణులేనా, కాదుకదా. సినిమా అంటే కథ. కెమెరా అనే ఒక సాంకేతికత సాధనంతో చెప్పే కథ. అది అప్పటివరకూ కథ చెప్పిన పద్ధతులకు భిన్నమైనది. మహా మేధ, గొప్ప సృజనగల దర్శకులు మనిషి లోపల, బయట, అతను / ఆమె చుట్టూ ఆవరించివున్న ప్రపంచాన్ని

మనకు చూపించే ప్రయత్నం చేస్తూ వస్తున్నారు. మంచి సినిమా అంటే ఏమిటి అనే ప్రశ్నతో కదా మనం మొదలు పెట్టాం. మంచి సినిమా మన హృదయ తంత్రులను మీటడంతో బాటు కొన్ని కొత్త సంగతులను (గ్రహించే మన శక్తిని బట్టి లేదా ఆ శక్తిని పెంచుకోవడానికి మనం పూనుకొని చేసే ప్రయత్నం బట్టి) మనకు నేర్పుతుంది, కొత్త ప్రశ్నలు సంధిస్తుంది, మనం మరికొంత 'మానవీయం' చెందడానికి దోహదపడుతుంది. లోపలకి చూసుకోగలిగే ధైర్యం వుంటే మన దుర్బలతలను కూడా ఎత్తి చూపిస్తుంది. అదీ మంచి సినిమా. నేను సత్యజిత్ రే 'ఫతేర్ పాంచాలి' చూశాను. అందులో ఆ ముసలమ్మకూ, మా అమ్మమ్మకు చాలా పోలికలు వుంటాయి తాను చేయకడుక్కునే ప్రతిసారి మొక్క దగ్గిరకు వెళ్ళి కడుగుతుంది. కెమెరా ఈ దృశ్యాన్ని తన కథనంలో భాగంగా చూపిస్తూ వుంటుంది. ఆ తరువాత నాకు తెలియకుండానే నేను మా ఇంటి దగ్గిర చేయకడిగే ప్రతిసారి మొక్కల దగ్గిరకి పోవడం మొదలు పెట్టాను.

కొద్దిగా ప్రక్కకు జరిగి మనకు తరచుగా ఎదురయ్యే మరో ప్రశ్న గూర్చి కొద్ది సేపు ముచ్చటించుకుందాం. ఏ కళారూపానికైనా సమాజాన్ని ప్రభావితం చేసే శక్తి వుంటుందా ? దాని ద్వారానే మంచైనా, చెడైనా, మార్పు వచ్చేస్తుందా. ఇది కూడా పెద్ద చర్చ. సినిమాకి సంబంధించి అవునని ... కాదని.. రెండింటికి బలమైన వాదనలు వున్నాయి. కాంచనమాల నటించిన 'మాలపిల్ల' విజయవంతం అయ్యింది. అంటరానితనం పోయిందా? కాంచనమాల వంటి 'మాల' పిల్లను భార్యగా స్వీకరించడానికి సవర్ణ హిందూ యువకులు సిద్ధంగా వున్నారా? అదే సమయంలో గత 15 ఏళ్లలో మన తెలుగు సినిమా తీసి సమాజం మీదకు విసిరేస్తున్న టీనేజ్ లవ్ స్టోరీలు, రౌడీ హీరో సినిమాల ప్రభావం లేదని మనం చెప్పగలమా?. మీరు టీనేజ్ (హైస్కూల్ నుండి) పిల్లలకు పాఠాలు చెప్పే ఉపాధ్యాయులతో ఒకసారి మాట్లాడండి, వారు చెప్పే సంగతులకు మీకు నోటి మాట రాదు. మిగిలిన కళారూపాలకు సినిమాకు కొంత తేడావుంది. సినిమా సాంకేతికత, సైన్స్ కలగలసిన కళా ప్రక్రియ. మిగిలిన కళా ప్రక్రియలలో సాధ్యం కాని, వూహించడానికే అవకాశం లేని ప్రపంచాన్ని, మాయ ప్రపంచాన్ని కూడా మీ ముందు నిజం అన్నంతగా చూపించగలదు. మహాకవి గురజాడ కన్యాశుల్కం ప్రధమ రంగంలోనే , రామప్ప పంతులు, మధురవాణి, గిరీశం, పుటకూళ్ళమ్మ ఒకే సారి రంగస్తలం మీద వుండే దృశ్యం వుంటుంది. మంచం క్రింద వున్న రామప్ప పంతులు, గిరీశంలు ఆ మంచం వద్ద నిలబడిన మధురవాణి, పూటకూళ్ళమ్మల సంభాషణలను, హావ భావాలను

రంగస్తల దర్శకుడు ఎలా చూపించాలి. మంచం క్రింద వున్న రామప్ప పంతులు, గిరీశంలు మాట్లాడుకునెప్పుడు పూటకూళ్ళమ్మ, మధురవాణి ఏమి చేయాలి. మంచం క్రింద వున్న పాత్రధారుల హావభావాలు, సంభాషణలు స్టేజి క్రింద వున్న ప్రేక్షకులకి కనిపించి, వినిపించే అవకాశం వుందా ? (రంగస్థల దర్శకునికి ఇలాంటి పరీక్షలు చాలా పెడతాడు గురజాడ). కానీ సినిమా ఇలాంటి వాటిని సులువుగా పరిష్కరించగలదు. ఎన్.టి.ఆర్. గిరీశంగా, సావిత్రి మధురవాణిగా నటించిన 'కన్యాశుల్కం' సినిమాలో మనం ఈ దృశ్యాన్ని చూడవచ్చు. ఒక కళారూపంగా సినిమా మాధ్యమం ఎంత గొప్పది, శక్తి వంతమైనదంటే అది లేని దాన్ని వున్నట్లు చూపించగలదు, ఆ క్షణానికి నమ్మించగలదు. 'గ్రావిటి' అనే సినిమా అంతరిక్షాన్ని మన ముందు వుంచితే, విశ్వామిత్ర సృష్టి లాగా లేని ఒక గ్రహాన్ని అవతార్ ప్రతి సృష్టి చేయగలదు. అందుచేత మానవ మస్తిష్కంపై సినిమా బలమైన ప్రభావాన్ని చూపగలదు. అందుచేత సమాజంపై సినిమా ప్రభావం అదివరకు ఏ కళారూపం చూపనంత తీవ్రమైనది. కనక సమాజం గూర్చి ఆలోచించే వారు ఎవరైనా సినిమా గూర్చి ఆలోచించకుండా వుండలేదు.

సినిమాతో వున్న మరో సమస్య 'పెట్టుబడి'. దాని నిర్మాణం దగ్గిర నుండి విడుదల వరకు అది రూపాయిల్లో పుట్టి వాటి మీద నడుస్తుంది. పెట్టుబడి లక్షణం లాభం. లాభానికి సామాజిక స్పృహ, చైతన్యాలకు చాలా దూరం వుంది. అప్పటికి వున్న సామాజిక విలువలను, నమ్మకాలను, భయాలను, బలహీనతలను, మానవ దౌర్భల్యాలను ముడి సరుకుగా చేసుకొని 'అమ్ముకొని' 'లాభాలు' మూటగట్టుకోవడం ఎప్పుడూ, తేలికైన, తెలివైన సినిమా వ్యాపార సూత్రం. అందులోని పెట్టుబడి 'ద్రవ్య పెట్టుబడి', 'నియో పెట్టుబడి' రూపం తీసుకున్న తరువాత ఆ పెట్టుబడికి 'లంపెన్' లక్షణాలు తప్ప మరే విలువలు వుండవు. అందుకే మనకు నేడు వస్తున్న సినిమాలన్ని లంపెన్ సినిమాలు. అవి సామాజిక విలువల పతనాన్ని మరింత వేగవంతం చేస్తాయి. అందుచేత మంచి సినిమాను చూడటం, చూపించడం, కాపాడుకోవడం తక్షన అవసరంగా వుంది.

నా మట్టుకు నేను సినిమాలని ఈ విధంగా వర్గీకరిస్తాను అవి 1. చెడ్డ సినిమాలు 2. పాప్‌కార్న్ లేదా కాలక్షేపం సినిమాలు 3. మంచి సినిమాలు 4. గొప్ప సినిమాలు. ఇప్పుడు వాటి గురించి నా అభిప్రాయాలు చెపుతాను.

చెడ్డ సినిమాలు :

సినిమా ఏమి చేస్తుంది ? మనిషి లోని సంస్కారాన్ని పెంచుతుంది లేదా తగ్గిస్తుంది. చెడ్డ సినిమా రెండవ పని చేస్తుంది. ఒక అమ్మాయిని తాను ప్రేమించే వరకు వేధించమని చెపుతుంది. ఆ తరువాత చచ్చినట్లు ఆమె ప్రేమిస్తుందని నేర్పుతుంది. నేను ఒక కారులో ప్రయాణం చేస్తున్నాను ఆ కారు డెక్ నుండి ఒక పాట వినిపిస్తోంది. అది తెలుగే కానీ సరిగ్గా దాని పల్లవి అర్థం కావటం లేదు. చాలా సేపు దృష్టి పెట్టి వినడానికి ప్రయత్నం చేస్తే ఆ హీరోగారు ''చావు పిల్ల ..చావు పిల్ల ... చావు చావు' అని అంటున్నాడు. తనను నిరాకరించిన అమ్మాయికి ఆయన పెడుతున్న శాపనార్థాలు అవి. టీనేజ్ ప్రేమలు , రాయలసీమ రౌడీలు, బారు కత్తులు, నీచాతి, నీచమైన చిల్లర హాస్యం వాటి ముడి సరుకులు. ఒకటిన్నర లేదా రెండు నెలల్లో పెట్టిన పెట్టుబడి మీద సూపర్ లాభాలు లాగేయ్యాలి, అదొకటే లక్ష్యం. మత్తుపదార్థాలు, మాదకద్రవ్యాలకు అలవాటు పడిపోయినట్లుగా మన ప్రేక్షకులు ముఖ్యంగా యువత వీటికి అలవాటు పడ్డారు. వారి మైండ్స్ ఆ విధంగా 'ట్యూన్' చేయబడ్డాయి. మనిషిలోని 'అమానవీయ' లక్షణాలు మరింతగా అవి పెంపు చేస్తాయి.

పాప్‌కార్న్ లేదా కాలక్షేపం సినిమాలు :

ఇవి వినోదాన్ని అందిస్తాయి, చూస్తున్నంతసేపు సేపు మిమ్ములను అలరిస్తాయి. హాలు బయటకు రాగానే వాటి దారి వాటిది మనదారి మనది. మన పైన ఎలాంటి ప్రభావం చూపదు. వారు ఇబ్బంది పడకుండా మనల్ని ఇబ్బంది పెట్టకుండా నాలుగు రాళ్ళు పోగేసుకొనే వ్యాపారం.

మంచి సినిమా :

ఇక నుండి మొదలౌతుంది మనకు పరీక్ష. ఏది మంచిది ఏది చెడ్డది ? నిర్ణేతలు ఎవరు? ఇందులో నేను రెండు అంశాలు వున్నాయని అనుకుంటాను, ఒకటి కథ రెండవది కథనం (పద్ధతి). మాదాల రంగారావు, నారాయణ మూర్తి ల విప్లవ (?) సినిమాలు అసలు మంచి సినిమాలేనా? వాటి కథన పద్ధతిని బట్టి వాటిని సినిమాలు అనవచ్చునా? నిజానికి ఏ కళా రూపం జీవితం కాదు. జీవితం జీవితమే. దాన్ని ఏది 'రీప్లేస్' చేయజాలదు. అయితే సినిమా అనే కళారూపం

యొక్క గొప్పదనం ఏమిటంటే ప్రయత్నిస్తే అది జీవితానికి చాలా దగ్గిరగా రాగలదు. 'మా భూమి' సినిమా చూస్తున్నంతసేపు తెలంగాణ సమాజం మన కళ్ళముందు వచ్చి నిలుస్తుంది. మన ప్రధాన స్రవంతి సాంఘిక సినిమాలలో కనిపించే పాత్రలను 'డొల్ల సాంఘిక పాత్రలు' అన్నాడు సత్యజిత్ రే. అంటే అవి నిజ జీవితంలో ఆ పాత్రలు ఎప్పుడు అలా వుండవు, ఒక్క వెండి తెరమీద తప్పా. కానీ మంచి సినిమా దీనిని అధిగమిస్తుంది, ఆ పాత్ర నిజజీవితం లో అలానే వుంటుదని మనకు అనిపిస్తుంది. ఈ మధ్యనే విడుదలైన 'కంచరపాలెం' సినిమాలో ఆఫీసు ఫ్యూన్ (బంట్రోత్)ను మీరు చూడండి. జీవితానికి సంబంధించిన, మన కళ్ళు పట్టుకొని లేదా మనం అప్పటివరకూ (మన చుట్టే వున్నా) అంశాన్ని మనకు కొత్తగా , బలంగా చూపిస్తుంది. మనతో 'అవురా' అనిపిస్తుంది. వున్న చోటునుండి సమాజం ఒక పిసరు ముందుకు వెళ్ళేందుకు 'నేను సైతం' అన్నట్లుగా తన వంతు పాత్ర నిర్వహిస్తుంది మంచి సినిమా. దాని ప్రభావానికి మనం లోనౌతాము. అది మనలను వెంటాడుతుంది. మనలోని సంస్కారం స్థాయిని మరో మెట్టు పైకి తీసుకు వస్తుంది. అందుకోసం ఇబ్బంది కలిగించే, చికాకు పరిచే ప్రశ్నలను మన ముందు వుంచుతుంది. మన చుట్టూ వుండే మనుషులను, సమాజాన్ని, మనల్ని మనం మరింత మెరుగుగా, 'పాజిటివ్' గా అర్థం చేసుకోవడానికి ఉపకరించేదే మంచి సినిమా. మంచి సినిమా వినోదాన్ని కూడా ఇస్తుంది. ఎలాంటి వినోదం అది, సున్నితత్వం, మేథోతనం, సంస్కారవంతమైన ఔచిత్యం గల వినోదం అది. అందుకే మంచి సినిమా తీయడం చాలా కష్టం.

గొప్ప సినిమా :

మంచి సినిమాలన్నీ గొప్ప సినిమాలు కావా ? కాలేవు. ఎందుకంటే గొప్ప సినిమా కథ, కథనంలో విప్లవాత్మక మైన ఆవిష్కరణలు చేస్తుంది. అది సినిమా అనే ప్రపంచంకు మైలు రాళ్ళను నిర్దేశిస్తుంది. ఇంకా చెప్పాలంటే ఆ సినిమా, సినిమానే ప్రభావితం చేస్తుంది. 'బైస్కిల్ తీఫ్' సినిమాను చూసిన ఒక భారతీయ యువకుడు సినిమా దర్శకుడు అయ్యాడు. ఆయన పేరు సత్యజిత్ రే. అకీరా కురూసోవ 'రోషమోన్' సినిమా పేరుతో మానసిక శాస్త్రంలో 'రోషమోన్ ఎఫ్ఫెక్ట్' ప్రసిద్ధి చెందింది. గొప్ప సినిమా అంటే ఏమిటో తెలుసుకోవాలంటే సత్యజిత్ రే

రాసిన వ్యాసాలు ('వాళ్ళ సినిమా మన సినిమా' తెలుగు అనువాదం వుంది) చదవాలి. ఈ సినిమాలు స్థల, కాలాలను జయిస్తాయి. 1921 లో చాప్లిన్ తీసిన 'ది కిడ్' సినిమాను నేను విశాఖ జిల్లా, నాతవరం దళిత కాలనీలో గత నెలలో ప్రదర్శించాను. అన్ని వర్గాల వారు ఆ సినిమాతో వెంటే 'కనెక్ట్' అయ్యారు. అది చాప్లిన్ గొప్పతనం, గొప్ప సినిమా గొప్పతనం. కాలంతో బాటు, మారుతున్న టెక్నాలజీ సహాయంతో సినిమా విస్తృతమౌతూ వస్తున్నది. కథ, కథనం, సాంకేతికతలలో కొత్త ద్వారాలు, కొత్త నుడికారాలు ఆవిష్కరించినవే గొప్ప సినిమాలు. అలాంటి సినిమాలు తరచుగా రావు. గురజాడ కన్యాశుల్కం తరువాత రాచకొండ విశ్వనాధ శాస్త్రి 'నిజం' రావడానికి చాలా కాలం పట్టింది కదా.

ఎందుకు చూడాలి ? ఎందుకు చూపించాలి ?

ఆ మధ్య మా ఆవిడను తీసుకొని (తాను పెద్దగా చదువుకోలేదు గాని దేవాంతకురాలు) 'కంచరపాలెం' సినిమాకు వెళ్ళాను. తిరిగి వచ్చేప్పుడు అడిగా 'ఎలా వుందని'. తాను ఏమన్నాదంటే,'అసలు సినిమా చూస్తున్నట్లే లేదండీ.. అదంతా మన ప్రక్కనే జరుగుతున్నట్లు ... వాళ్ళందరూ మనకు తెలిసినవాళ్లు అయినట్లు అనిపించింది' అంది. ఈ స్టేట్మెంట్‌లో మొదటిభాగం చాలా ఆసక్తికరమైనది. 'అసలు సినిమాలాగే లేదు' అంటే అర్ధం ఏమిటి? సినిమా అందునా తెలుగు సినిమా అంటే ఎలా వుంటుందో, ఎలా వుండాలో మన బుర్రలు ట్యూన్ అయిపోయాయన్నమాట. అందుకు ఏ మాత్రం భిన్నంగా వున్నా అసలు మన మెదళ్ళు వాటిని స్వీకరించకుండా అయిపోయాయి. కనుక మంచి సినిమా / గొప్ప సినిమా చూసేందుకు సిద్ధపడటం మాములు విషయం కాదు. అది ప్రయత్నపూర్వకంగా జరగవలసిన పని. కానీ అందుకు సంకల్పం, అవకాశం ఒక సగటు ప్రేక్షకునికి ఎలా వస్తుంది. ఎవరి వరకో ఎందుకు నావరకు నాకే మంచి సినిమా ను చూసి 'ఎంజాయ్' చేయగలగడానికి చాలా కాలం పట్టింది. కుర్చీలో శరీరాన్ని పడేసి, కళ్లనుతెరకు వప్పగించేయడానికి వీలులేదు. మన బుర్రకు పని పెట్టవలసి వుంటుంది. అది కొంత కష్టమైన పని. ఒకోసారి సినిమా చూసేసిన తరువాత మనం అదనంగా పని చేయవలసి వుంటుంది. ఆ సినిమా గూర్చి ఏమి రాశారు, ఎలాంటి సమీక్షలు వచ్చాయి, ఇతర ప్రేక్షకుల అభిప్రాయాలు ఏమిటి? తెలుసుకోవలసి వుంటుంది. అంటే మంచి సినిమా

చూసేందుకు మనలను మనం తయారుచేసుకోవలసి వుంటుంది. నెమ్మదిగా మనం అలవాటుపడతాం. మీరు ఒకసారి ఆ ప్రపంచం లోకి వెళ్ళే 'పాస్ పోర్టు – వీసాలు' సంపాదించి తరువాత మీరు ఎదగడం మొదలు పెడతారు. పోతన చెప్పినట్లుగా 'ఇంతింతై వటుడింతై' అనట్లుగా మీరు ఎదుగుతుంటారు. ఈ ఎదుగుదల అందరికీ వొకేలా వుండకపోవచ్చు కానీ తేడా తప్పక వుంటుంది. ఒకసారి మనం మంచి సినిమాల ప్రపంచంలోనికి వెళ్ళిన తరువాత అంతకు ముందు మనం చూసి వినోదించిన ప్రధాన స్రవంతి సినిమాలు, మనలను అలరించిన మహానటులు మరుగుజ్జుల్లా కనిపిస్తారు.

అయితే అసలు సమస్య ఇక్కడే వుంది. మంచి సినిమాల ప్రపంచంలోకి వెళ్ళేందుకు మనకు శిక్షణ ఇచ్చే, ప్రోత్సహించే వ్యవస్థలు ఏవీ లేవు. మన జూనియర్, సీనియర్ కళాశాలలు, యూనివర్సిటీలు ఆ పని చేయవచ్చుగాని చేయవు. ఎవరికి వారు వ్యక్తిగత స్థాయిలో తమ పుర్రాకులేవో తాము పడవలసిందే. అందరికీ అన్ని సమయాలలో కుదరకపోవచ్చును. అప్పుడప్పుడు పొరపాటున కొన్ని మంచి సినిమాలు ప్రధాన స్రవంతి సినిమాలకు మల్లె సినిమా థియేటరులకు రావచ్చును. ఆ విషయం మనం తెలుసుకొని వెళ్ళేసరికే దానిని తీసేసి వుంటారు. మంచి సినిమాలు చూడగలిగే మంచి ప్రేక్షకులను తయారు చేసే వ్యవస్థలు లేనందున, తమకు తాముగా అలా తయారైన వారికైనా తమ సినిమాలు చూపించుకోవాలంటే ఎలాంటి వేదికలు లేవని (ప్రధాన స్రవంతి థియేటర్లుతప్ప) దర్శకులు, అట్టి నిర్మాతలు గుర్తించారు. ఈ గుర్తింపు నుండి వచ్చినవే 'సినిమా సొసైటీలు' . ప్రేక్షకులు ఒక సొసైటీగా ఏర్పడి మంచి సినిమాలను తెప్పించుకొని చూడటం, కొత్త వారికి నెమ్మదిగా వీటిని అలవాటు చేయడం. ఒక్క మాటలో చెప్పాలంటే మంచి సినిమాలకు వేదిక, వాటిని చూసేందుకు శిక్షణ ఇచ్చే (ఇన్‌ఫార్మల్) సంస్థలుగా వీటిని పరిగణించేవారు. 1977లో మన దేశంలో అలాంటి ఫిల్మ్ సొసైటీల ఉద్యమం మొదలయ్యింది.

స్పందించిన అనకాపల్లి :

ఈ ఉద్యమ పిలుపుకు అనకాపల్లి అనే మా చిన్న పట్టణం కూడా స్పందించింది. 1977 అక్టోబరు 2 న అనకాపల్లి ఫిల్మ్ సొసైటీ లాంఛనంగా మొదలయ్యింది. వ్యక్తులకు 20 రూపాయలు, భార్య భర్తలకు 30 రూపాయల

సభ్యత్వంతో 300 మంది సభ్యులు గల మా సొసైటీ నెలకు ఒక సినిమా చొప్పున ప్రదర్శిస్తూ 10 ఏళ్లపాటు అజరామరమైన సినిమాలను మా అనకాపల్లి ప్రేక్షకులకు చూపించగలిగింది. ఈ సొసైటీ ఫిల్మ్ సోసైటీ ఫెడరేషన్ లో సభ్యురాలు కూడా.

1986-87 లో టివి రంగప్రవేశం చేసింది. అప్పుడే రామాయణం, భారతం సీరియళ్ళు, ఆసియా గేమ్స్, దాంతో ఆదివారం నాడు ఫిల్మ్ సొసైటీకి వచ్చి సినిమా చూసే వారి సంఖ్య తగ్గటం మొదలయ్యింది. నిజానికి ఆ రోజులలో ఫిల్మ్ సొసైటీ ద్వారా ఫిల్మ్ చూపించడం చాలా శ్రమతో కూడినది. ముందు థియేటరు దొరకాలి, ఫిల్మ్ రీల్ బాక్స్ లు తెప్పించుకోవాలి అయిపోయాక వాటిని జాగ్రత్తగా పార్సిల్ లో పంపాలి. సొసైటీ సభ్యత్వం తగ్గిపోవడంతో థియేటరు అద్దె కట్టడం కష్టంగా మారింది. దాంతో 1987 తరువాత మా అనకాపల్లి ఫిల్మ్ సొసైటీ సుప్తచేతనలోకి వెళ్లిపోయింది.

కొత్త టెక్నాలజీ పునరుజ్జీవం :

22 ఏళ్ల తరువాత కొత్త తరం 'అనకాపల్లి ఫిల్మ్ సొసైటీ' ని పునఃప్రారంభించే పని మొదలు పెట్టింది. అందుకు అవకాశం కల్పించింది కూడా టెక్నాలజీ నే. మన వద్ద ఒక ఎల్‌సిడి ప్రొజెక్టరు (40 నుండి 50 వేల మధ్యలో లభిస్తుంది), 20 నుండి 30 మంది సభ్యులకు చిన్నపాటి సౌండ్ సిస్టమ్ (3 నుండి 4 వేల మధ్యలో లభిస్తుంది), ఒక లేప్‌టాప్ లేదా డివిడి ప్లేయర్ (3 నుండి 4 వేల మధ్యలో లభిస్తుంది) వుంటే మనకు సినిమా హాలు సమకూరినట్లే. ఫిల్మ్‌రీల్స్‌తో పనిలేకుండా డివిడి / పెన్ డ్రైవర్ లో సినిమాలు లభిస్తున్నాయి. ఈ సాంకేతిక సౌలభ్యం ఫిల్మ్ సొసైటీలను తిరిగి మొదలు పెట్టడానికి మనకు వీలు కల్పించింది. 2009 లో మా అనకాపల్లి ఫిల్మ్ సొసైటీ కార్యక్రమాలను తిరిగి ప్రారంభించాం. గత 9 ఏళ్లుగా, నెలకి 2 సినిమాల చొప్పున, 150 రూపాయల సభ్యత్వంతో కొనసాగిస్తున్నాం.

కలిసే ఎందుకు చూడాలి :

ఇప్పుడు ఇంటర్ నెట్ ద్వారా కావలసిన సినిమాలు అందుబాటులో వున్నప్పుడు మళ్ళీ ఈ సొసైటీలు ఎందుకు ఎవరి ఇంటివద్ద వారు చూసుకోవచ్చుకదా అనే ప్రశ్న ఎదురౌతుంది. మా అనకాపల్లి ఫిల్మ్ సొసైటీలో సినిమా అయిపోయిన తరువాత దానిపై వీలును బట్టి చర్చ పెడతాం. ఒకే దృశ్యం పదిమందికి పది రకాల భావాలను

స్ఫురింపజేయవచ్చు వాటిని పంచుకున్నప్పుడు మనకు తట్టని కొత్త సంగతులు తెలుస్తాయి. పరభాష చిత్రం అయితే ముందుగా దానికి సంబంధించిన ఆసక్తికరమైన అంశాలను వివరిస్తాం (అలాగని మొత్తం చెప్పం). మొదట్లో బాగా తక్కువగానే వచ్చేవారు. అందుకే మేము నిరుత్సాహ పడకుండా మా ప్రేక్షకుల సంఖ్యను బాగా తగ్గించి పెట్టుకున్నాం (కేవలం 5 గురు). సినిమాలు చూపించడంతో బాటు ఆయా సందర్భాలను బట్టి ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తు వస్తున్నాం. ఉదాహరణకు గుమ్మడి చనిపోయినప్పుడు ఆయన నటించిన వివిధ పాత్రలు, సన్నివేశాలతో ఒక రూపకాన్ని తయారు చేసి చూపించాం. అదే విధంగా రంగారావు శత జయంతి సందర్భంగా చేశాం. నెమ్మదిగా మాకు అంటూ 50 నుండి 60 మంది ప్రేక్షకులు స్థిరపడ్డారు. మా అనకాపల్లిలోని శారద గ్రంధాలయం కేవలం విద్యుత్తు చార్జి మాత్రమే తీసుకొని,తమ రీడింగ్ రూమ్ ఇవ్వడంతో మాకు హాలు అద్దె కట్టాలనే బాధకూడా లేకుండా పోయింది. ఏ కారణం వల్లనైనా మేము ఒక నెలలో ఫిల్మ్ వేయకపోతే 'మీరు ఎందుకు వేయటం లేదు' అని ప్రశ్నించే వారు కూడా పెరిగారు. మీడియా కూడా మా పనిని గుర్తించింది.

ఇది ఎలా సాధ్యం అయ్యిందంటే, మొదలు పెట్టిన పనిని విడవకుండా కొనసాగించడం వలన. ఫిల్మ్ సొసైటీల ఫెడరేషన్, దక్షిణ భారత విభాగం మా కృషిని గుర్తించి **'జాన్ అబ్రహాం'** పేరుమీద ఒక అవార్డు ఇచ్చింది. అందరి సహకారం తో మేము లఘు చిత్రాల పోటీని కూడా నిర్వహించగలిగాం. ముందు చెప్పినట్లుగా ఫిల్మ్ సొసైటీ మంచి సినిమాలను చూపించే వేదికగానే గాక, వాటిని చూసే పద్ధతిని నేర్పే ఒక శిక్షణ కేంద్రంగా కూడా పనిచేస్తుంది. చెడ్డ సినిమాలు సమాజాన్ని చెడగొడుతున్నాయని తిడుతూ కూర్చోవడం కంటే మంచి సినిమాను చూపించే వేదికను మనం సృష్టించుకోవాలి. ముందు చెప్పినట్లు కొత్త టెక్నాలజీ మనకు ఆ వెసులుబాటును ఇస్తున్నది. **'సూట్ కేసులో సినిమా'** అన్నది నాకు ఇష్టమైన మకుటం.

10. ఫిలిం సొసైటీలు ఎందుకు అవశరం?

– బొల్లిముంత కృష్ణ, తెనాలి ఫిల్మ్ సొసైటీ,
సెల్ : 9959431235

సినిమా మాధ్యమం ద్వారా బాలల్లో, ప్రజల్లో మానసిక వికాసం, కళల పట్ల, జీవితం పట్ల అవగాహన పెంపొందించడం కోసం ఉత్తమ సినిమాలను ప్రదర్శించాలని, ఆ కోవలో ఫిలిం సొసైటీలు పని చేస్తున్నాయి. ఆ సినిమాలు ప్రదర్శించి ప్రేక్షకుల్లో చైతన్యం కలిగించేందుకు ఫిలిం సొసైటీలు దోహదపడతాయి. జ్ఞానంతోపాటు దేశ విదేశీ సాంప్రదాయాలు, ఆ దిశగా పరిస్థితులు, ఆయా ప్రజల మనోభావాలను, అవి పరిష్కరించేందుకు ఫిలిం సొసైటీలు ప్రదర్శించే సినిమాలు జాగృత పరుస్తాయి.

సాంస్కృతికంగా, సాహిత్యపరంగా అతి సామాన్య మానవుడు కూడా మార్పు చెందుతారనీ మంచి అవగాహన కలిగించేందుకు ఫిలిం సొసైటీలు ఇతోధికంగా కృషి చేస్తున్నాయి. కేవలం సినిమాలు ప్రదర్శనలేకాక మంచి సినిమాకు సంబంధించిన సాహిత్య సృష్టి, భాషాభివృద్ధికి కూడా తోడ్పడుతుంది. మంచి సినిమాలు చూడాలన్న అభిరుచి ఉన్న ప్రేక్షకుల ఆశలు తీర్చడంలో మంచి సినిమాలు ప్రదర్శించబడతాయి. ఆ సొసైటీల ద్వారానే సినీ రంగంలో పలు అంశాలపై చర్చాగోష్టులు నిర్వహిస్తారు. అన్ని దేశాల చిత్రాలు ప్రదర్శించటం వలన ఆయా దేశాల కళలు సంస్కృతి, అద్దం పట్టేలా వుంటాయి. సభలు, సెమినార్లు నిర్వహించటం సమాజాభివృద్ధి కూడా జరుగుతుంది. కమర్షియల్ చిత్రాలకు ధీటుగా మంచి చిత్రాలు ప్రదర్శించటం ద్వారా ఈ సినిమాల పట్ల ప్రేక్షకులు ఆకర్షితులౌతారు.

ఇతర దేశాల చిత్రాలు – అవార్డు అందుకున్న చిత్రాలు, సందేశాత్మక చిత్రాలు సినిమా, టివి వాళ్ళు స్క్రీనింగ్ చేయరు. వాటికి మిన్నగా ఫిలిం సొసైటీలు సినిమాలను ప్రదర్శిస్తాయి. అందుకు ఫిలిం సొసైటీలు అవసరం – ఈ విషయాలు గమనించగలరు.

11. మంచి సినిమా చూతము రారండి!

– ఐ. బాలాజీ, ముందడుగు పత్రిక,
కోల్‌కతా, సెల్ : 7044715519

ఎప్పటికప్పుడు అదృశ్యమైపోయే దృశ్యాన్ని బట్టి, బంధించి భద్రపరిచింది ఫోటోగ్రఫీ. ఆ ఫోటోగ్రఫీ సినిమాటోగ్రఫీగా రూపాంతరం చెంది నేటికి దాదాపు 120 యేళ్ళయింది. 1895 డిసెంబరు 28న ప్యారిస్‌లోని గ్రాండ్ కాఫీ హోటల్ గోడపై లూమియర్ సోదరులు 6 నిమిషాల నిడివిగల చలనచిత్రం ప్రదర్శించడంతో సినిమా చరిత్ర ఆరంభమైంది. రైలింజను నిజంగానే పైకి వచ్చేస్తోందా అన్న భయంతో కొందరు ప్రేక్షకులు పరుగుతీశారట. దీంతో సినిమాకున్న మాంత్రికశక్తి అర్థమైంది.

అయితే, టెక్నాలజీ ముద్దుబిడ్డగా వచ్చిన సినిమా కేవలం ఒక వినోద సాధనంగానే మిగిలిపోలేదు. నేత్రానందం కలిగిస్తూ ఆధిపత్యవర్గ భావజాలాన్ని వ్యాప్తిచేసే వ్యాపార పలాయనవాద సినిమా ఒకవైపు వర్ధిల్లగా, హాల్లోంచి వచ్చేసిన చాలాకాలం వరకు ఆలోచింపజేసే వాస్తవవాద, నవతరంగ సినిమా కూడా తన వునికిని చాటుకుంది. ఆ విధంగా, సినిమాకు ఓ బాషను ఏర్పరచి, దాన్ని సీరియస్‌గా పట్టించుకోవాల్సిన కళారూపంగా అభివృద్ధి చేసిన సృజనాత్మక దర్శకులెందరో వున్నారు. ప్రపంచ సినిమాను చూస్తే ముర్నవ్, బునువల్, ఐజన్‌స్టైయిన్, డీసికా, రినోయర్, కురసోవా, ఓజూ, బర్గ్‌మ్యాన్, ట్రుఫో, అంటోనియోనీ, లిటిన్, అంద్రి వాయ్దా, గొదార్, కిసలోవస్కీ, జానుస్సీ, జిరీ మెంజెల్, మొఖ్మల్‌బఫ్, మాజిద్ మాజిదీ; ఇటు మనదేశానికి వస్తే రిత్విక్ ఘటక్, సత్యజిత్ రే, మృణాల్ సేన్, జాన్ అబ్రహాం, అడూర్ గోపాలకృష్ణన్, గిరీశ్ కాసరవల్లి, ఎం.ఎస్. సత్తూ, శ్యాం బెనెగళ్, మణికౌల్, సయీద్ మీర్జా, గౌతమ్‌ఘోష్, అపర్ణాసేన్, రితుపర్నో ఘోష్, బి. నర్సింగరావు యిలా చాలా పేర్లు చెప్పుకోవచ్చు.

మన దేశంలో సినిమా అంటే ప్రధానంగా వ్యాపార సినిమానే. సామ్రాజ్యవాద సాంస్కృతిక పనిముట్టుగా వుండే 'హాలీవుడ్'కి పేరడీగా 'బాలీవుడ్', 'టాలీవుడ్', 'కాలీవుడ్' అని పేర్లు పెట్టుకోవడంలోనే కనిపిస్తుంది మన దౌర్భాగ్యం. అసలు 'హాలీవుడ్'కి బయట ఎన్నో భిన్న ధోరణుల వైవిధ్యభరితమైన ప్రపంచ సినిమా

పరివ్యాప్తమైవుంది. నిజానికి 'ఆస్కార్' అవార్డులు తమకి తామిచ్చుకునే భాస్కర్ అవార్డుల్లాంటివి. (అత్తారింటికి దారేదిలోలాగ) విశాల ప్రపంచమంతటా నిర్మితమైన సినిమాల కోసం వారి వద్ద ఒకే ఒక్క 'బెస్ట్ ఫారన్ ఫిల్మ్ కేటగిరీ' వుంది. సరే, ఆ సంగతలా వదిలేస్తే, పరాయి సంస్కృతిని అనుకరించే మన దేశీయ 'వుడ్డు'ల్లో అదనపు విశిష్టత ఏమిటంటే మూడు మెలోడ్రామాలూ, ఆరు తైతక్క పాటలూ, పన్నెండు పంచ్ డైలాగులూ.

వ్యాపార సినిమాల్లోనూ ప్రాంతాల వారిగా అక్కడి ప్రేక్షకుల పరిపక్వ స్థాయిని బట్టి, అక్కడి ఆదరణను బట్టి తేడాలు కన్పిస్తాయి. ఉదాహరణకి బెంగాలీ, మళయాలం, తమిళ, మరాఠీ సినిమాల్లో భిన్న ధోరణిలో వుండే పనికొచ్చే సినిమాలు దర్శనమిస్తాయి. హిందీలో కూడా 'జర హట్కే' సినిమాలు వెలువరిస్తున్నారు కొందరు నూతనతరం దర్శకులు. ఎటొచ్చీ తెలుగుసినిమా నడకే నానాటికీ తీసికట్టు నాగంబొట్టు చందంగా తయారౌతోంది. పౌరాణిక యితివృత్తాల ఆరంగేట్రంతో మొదలైన చిత్ర చరిత్రలో 'మాలపిల్ల' ఒక మెరుపు. తెలుగు సినిమారంగం చౌకబారు దశకు చేరకముందు వచ్చిన 'మల్లీశ్వరి', 'మాయాబజారు', 'దేవదాసు', 'బంగారు పాప', 'జయభేరి' లాంటి కళావిలువల చిత్రాలు పదులలోనైనా వుండేవి. 'ఒక వూరి కథ', 'దాసి' వంటివి ఫెస్టివ్ సర్కిల్ ఆర్ట్ హౌస్ చిత్రాలు. బాపు, జంధ్యాలల చిరుఝల్లులు, విశ్వనాథ స్వరఝల్లులు 'అంకురం' లాంటి సీరియస్ సినిమాలు మినహాయిస్తే, ఆరేసుకోబోయి పారేసుకున్న ఆగడాలతో, తెలుగు వాడెన్నడూ ఎరుగని విదేశీ కౌబాయ్ మొనగాళ్ళతో, దసరాబుల్లోళ్ళ సరదా కబుర్లతో, బండబూతు హాస్యమల్లరితో, వెరైటీ టీనేజీ వేలంవెర్రి సరసన బహుభార్యత్వాన్ని నీటుగా సమర్థించే బృందావనగానాలతో, టెక్నాలజీ 'ఈగ'లతో, సైన్సు సాయంతో మౌఢ్యాన్ని ఎగదోసే గ్రాఫిక్స్ 'అరుంధతు'లతో వాపెక్కుతోంది తెలుగు మ్యాటినీ రంగం!

ఆర్ట్ సినిమాలపై మీ అభిప్రాయమేమిటని ఓ సుప్రసిద్ధ తెలుగు నటిని అడిగితే, 'అవి తలాతోకా లేని సినిమాలు' అని చెప్పారట! ఇది ఈనాటి సంగతి కాదు. ఆర్ట్ సినిమా వుద్యమం బలంగా వున్న రోజుల్లో ఆవిడ వెలిబుచ్చిన అభిప్రాయమిది. కొన్నాళ్ళ క్రితం కోల్‌కతా ఫిల్మ్ ఫెస్టివల్‌లో సత్యజిత్ రే ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ దగ్గర నాకు చిత్ర నిర్మాణం అభ్యసిస్తున్న ఇద్దరు ఆంధ్రా అబ్బాయిలు

తారసపడ్డారు. 'ఫెస్టివల్ సినిమాలు ఎంజాయ్ చేస్తున్నారా?' అని వాళ్ళనడిగితే, 'మాకివేవీ నచ్చడంలేదు సార్. వీటిలో పాటలూ, ఫైట్లూ లేవు. మా సార్లు చూడమని చెబితే చూస్తున్నాం' అని జవాబిచ్చారు. స్వయానా ఒక సినీనటికి (రచయిత్రి కూడా!) వాస్తవవాద సినిమాపై అవగాహన అలావుంటే, గ్రేట్ మాష్టర్స్ సినీ శిల్పాన్ని ఆకళింపు చేసుకోవాల్సిన లెర్నర్ల సం'గతి' ఇలా వుంటే, ఇక సాధారణ తెలుగు ప్రేక్షకుల స్థాయి ఎలా వుండగలదో వూహించవచ్చు. ఈ పరిస్థితి ఇలా వుండటానికి వీల్లేదు. పరిస్థితి మారాలి. మనం మార్చాలి.

రెండవ ప్రపంచయుద్ధం తర్వాత (1948) విటోరియా డీ సికా అనే ఆయన ఇటలీలో 'బైసికిల్ థీఫ్' (లాద్రి బైసైకిలిట్టె) అనే కళాఖండాన్ని నిర్మించాడు. ఆర్థిక మాంద్యంలో చిక్కుకున్న సగటు పౌరుడు సైకిల్ దొంగగా మారే దైన్యగాధను చూపిందీ సినిమా. ఒక సరికొత్త వరవడిని సృష్టించిన ఈ సినిమా ఇటాలియన్ నియోరియలిజా (నవ్య వాస్తవవాదా)నికి మైలురాయిగా నిలిచింది. ఆ సినిమాని సత్యజిత్ రే ఇరవై ఐదుసార్లు చూశాడు. అందులోని ఒక్కో దృశ్యాన్ని ఎన్నోమార్లు విశ్లేషించాడు. ఈ ప్రేరణతోనే 'పథేర్ పాంచాలీ'ని నిర్మించి భారతదేశ చలనచిత్రానికి ప్రపంచ సినీరంగంలో గౌరవాన్ని ఆర్జించిపెట్టాడు. పై సినిమాలకంటే ముందే రష్యాలో 'స్ట్రైక్', 'బ్యాటిల్‌షిప్ పోటమ్‌కిన్' వంటి సినిమాల్ని అందించాడు సెర్జి ఐజన్‌స్టైయిన్. ఆయన సినిమాల్ని, 'మాంటేజ్ ఎడిటింగ్ పద్ధతి'ని వివరించడానికి ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లలో సిలబస్‌గా వినియోగిస్తారు. టర్కీలో యిల్మజ్ గూనే తన సినిమాల కారణంగా ఎన్నోసార్లు జైలుపాలయ్యాడు. ఫ్రెంచికి పారిపోయాక అక్కడ్నించి కూడా సినిమాలు తయారుచేసి సిసలైన 'సినీ రెబెల్' అనిపించుకున్నాడు. ఆంక్షల కారణంగా చిన్న పిల్లల సినిమాలు నిర్మిస్తూ వాటిద్వారా అక్కడి సమాజానికి పరోక్షంగా దర్పణం పట్టే మాజిద్ మాజిదీ వంటి ఇరాన్ దర్శకులెందరో వున్నారు. 'సర్కిల్', 'ఆఫ్‌సైడ్' వంటి సినిమాల ద్వారా వివాదాస్పదుడై గృహబందీగా వున్న జాఫర్ పనాహీ అనే మరో ఇరాన్ దర్శకుడు 'ది సీజ్ నాట్ ఎ ఫిల్మ్' అనే డాక్యుమెంటరీని నిర్మించి, దాన్ని మైక్రోచిప్‌లో వేసి, ఒక కేకులో దాచిపెట్టి బయటి ప్రపంచానికి స్మగుల్ చేశాడు. ఇలా ఉత్కంఠభరితమైన సినీ ప్రపంచం తన అంతు కనుక్కోమని త్వరపెడుతూ వుంటే, మనం మాత్రం కొత్తగిన్నెలో వేసిన పాత చింతకాయ పచ్చడిలాంటి మ్యాట్నీ మసాలాల్లోనే తలమునకలై వున్నాం.

కేవలం చలనచిత్రాలే కాదు. 'తన మరణాన్ని తనే చిత్రించుకున్న' దర్శకుణ్ణీ పరిచయం చేసిన పెట్రీసియో గజ్‌మ్యాన్ ('ది బ్యాటిల్ ఆఫ్ చిలీ'), అమెరికన్ రాజకీయాల్ని ఎండగట్టే మైకెల్ మూరే ('ఫారన్ హీట్ 9/11', 'క్యాపిటలిజం ఎ లవ్‌స్టోరీ'), మైకా ఎక్స్ పెలేడ్ ('గ్లోబలైజేషన్ ట్రయాలజీ'), అర్జెంటినాలో ఫెర్నాండో సొలనాస్ ('సోషల్ జెనోసైడ్'); మన దేశంలో ఆనంద్ పట్వర్ధన్ ('రామ్ కే నామ్', 'ఫాదర్, సన్ అండ్ హోలీవార్'), సంజయ్ కాక్ ('జస్నే ఆజాదీ కాశ్మీర్', 'రెడ్ ఏంట్ డ్రీమ్'), రాకేశ్ వర్మ ('ఫైనల్ సొల్యూషన్'), దీపా భాటియా ('నీరోస్ గెస్ట్స్') – ఇలా ఎంతోమంది నిర్మించిన ఉత్తమ డాక్యుమెంటరీలు, అంతేకాక అసంఖ్యాకమైన షార్ట్ ఫిల్మ్‌లు, పిల్లలే కాక పెద్దలూ చూడదగ్గ చిల్డ్రెన్స్ మూవీలు – అన్నీ మనవైపే చూస్తున్నాయ్, తమ ప్రత్యేకత కనుక్కోమంటున్నాయ్!

యూరప్‌లో ఫిల్మ్ సొసైటీ ఉద్యమం 1924 నాటి నుంచే వుంది. సత్యజిత్, చిదానంద్ దాస్ గుప్తా వంటి మహామహులు 1947లో 'కెల్‌కటా ఫిల్మ్ సొసైటీ' స్థాపించడంతో మనదేశంలో కూడా ఆరంభమైంది. ఆ తర్వాత దేశమంతటా తామరతంపరగా ఫిల్మ్ క్లబ్బులు వెలశాయి. 16 ఎం.ఎం. రీళ్ళతో పల్లెల్లో కూడా సినీ ప్రదర్శనలు జరిగాయి. సినీ వీక్షణంతోపాటు, వాదోపవాదాలూ, చర్చలూ, సమీక్షలూ మంచి సినిమాల నిర్మాణానికి నేపథ్యం ఏర్పాటు చేశాయి. ఫలితంగా ఎనభయ్యో దశకంలో ఆర్ట్ సినిమా నిర్మాణం తారాస్థాయిని చేరుకుంది. ఈ దశలో ఎందరో గొప్ప గొప్ప దర్శకులు ఆవిర్భవించారు. టీవీ ఆగమనంతో పరిస్థితి క్రమక్రమంగా క్షీణించింది. గ్లోబలైజేషన్ కాలంలో మంచి సినిమాలకోసం ప్రభుత్వ సహకారం తగ్గింది. ఆర్ట్ సినిమాలు వెనక్కి తగ్గాయి. ఇటువంటి విపరీత పరిస్థితుల్లోనూ కలకత్తా 'సినీ సెంట్రల్' వంటి సంస్థలు తమ వునికిని నిలుపుకునే ప్రయత్నాలు చేస్తూనే వున్నాయి. నెలవారి రెగ్యులర్ షోలతో పాటు ఏటా 'ఇంటర్నేషనల్ ఫోరం ఆఫ్ న్యూ సినిమా' వంటి పండగలు జరుపుకుంటూనే వున్నాయి.

అయితే మంచి సినిమాలు విరివిగా అందుబాటులో వున్న ఈరోజుల్లోనే మనం వాటికి దూరంగా మసలడం విచారకరంగా, విడ్డూరంగా కూడా కనిపిస్తోంది. ఒకప్పుడు ఫిల్మ్ సొసైటీ వాళ్ళు ప్రింట్లను రప్పించడానికి ఎంతో కష్టపడాల్సి వచ్చేది.

ఈరోజు డీవీడీలు అందుబాటులో వున్నాయి. ఇంటర్‌నెట్‌లో క్లాసిక్స్‌తోపాటు, డాక్యుమెంటరీలు, షార్ట్‌ఫిల్మ్‌లు ఇంగ్లీషు సబ్‌టైటిల్స్‌తో సహా లభిస్తున్నాయి. యూటీవీ వరల్డ్ మూవీస్, ఎన్.డీ.టీ.వీ. లూమియర్ వంటి ఛానెళ్ల ద్వారా అవార్డులు పొందిన ప్రపంచ సినిమాలు అందుబాటులో కొచ్చాయి. **మనం చేయవలసిందంతా సమభావాలూ, అభిరుచులూ గల మిత్రబృందాన్ని ఏర్పాటుచేసుకోవడం, స్తోమత వుంటే ప్రొజెక్టరు కొనుక్కొని లేదా టీవీ లేక కంప్యూటర్లో అవకాశాన్ని బట్టి సినిమాలు చూట్టమే. హాయిగా అర్థమయ్యే వాటితో మొదలై, ఉద్గ్రంథాన్ని చదివినంత సంతృప్తినిచ్చే గంభీరమైన సినిమాల వరకు క్రమక్రమంగా మన సినిమాల ఎంపిక ఎదగాలి. అభిరుచిలో విప్లవాత్మక మార్పు సాధించాలి.** చూసిన సినిమాలని విశ్లేషించడం, చూపబోయే సినిమాల గురించి చిన్న ఉపోద్ఘాతాలతో కరపత్రాలు వేసి కొత్తవాళ్ళని, ముఖ్యంగా యువతరాన్ని, విద్యార్థుల్ని ఆకర్షించడం మన కార్యక్రమాల్లో భాగంగా వుండాలి.

చీకట్లో చిరుదివ్వెలా అంతర్జాలంలో navatarangam.com వారు తెలుగునాట సరికొత్త ఫిల్మ్ కల్చరుకు నాంది పలుకుతూ మంచి మంచి సినిమాల్ని పరిచయం చేస్తున్నారు. అంపశయ్య నవీన్, టి.ఎల్. కాంతారావు, వారాల ఆనంద్ వంటి రచయితలు పాఠకుల కోసం ఉత్తమ సినిమాలను నిశితంగా విశ్లేషించారు. ఇటీవల సి. ఉమా మహేశ్వరరావు కొంత కృషి చేస్తున్నారు. 'ప్రజాసాహితి' వంటి పత్రిక మంచి, చెడు సినిమాల్ని, సినిమాల మంచి చెడుల్ని సమీక్షిస్తూ తనవంతు కృషి చేస్తూనే వుంది. 'బుక్కు కల్చరుపోయి, లుక్కు కల్చరొచ్చింది' (–రాధశ్రీ) కనుక, మంచి సినిమా ప్రచారం కూడా మన సాంస్కృతికోద్యమంలో భాగంగా చేసుకుంటే మంచి ఫలితాలను సాధించగలం. పతన విలువల్ని వ్యాప్తిచేస్తున్న వ్యాపార సినిమా మాయాజాలం నుండి కొందర్నైనా కాపాడగలం.

(ప్రజా సాహితి నుండి)

12. మంచి సినిమా ఒక మానవీయ సృజన

– **బిహెచ్.ఎస్.ఎస్. ప్రకాష్‌రెడ్డి**, హైదరాబాద్ ఫిల్మ్ క్లబ్, సెల్ : 9110301476

మార్చి 1, 1974న స్థాపించబడ్డ హైద్రాబాద్ ఫిల్మ్ క్లబ్ స్వచ్ఛంద సంస్థ. సామాజిక కార్యాచరణగా, కళాత్మక మాధ్యమంగా మంచి సినిమాను ప్రమోట్ చేయడంతోపాటూ విలువలతో కూడిన చిత్రాల పట్ల ప్రజాదరణ పెంచడానికి, అటువంటి సినిమాల్ని గురించి అధ్యయనం, పరిశోధన, విమర్శనాత్మక దృష్టితో కూడిన సంవాదాలు చేయడానికి హెచ్.ఎఫ్.సి. కృషి చేస్తోంది. అందులో భాగంగా నాటి నుండీ జంట నగరాల్లో అనేక ప్రదర్శనలు, ప్రసంగాలు ఏర్పాటు చేయడంతో బాటూ దేశ విదేశాల్లో కూడా తత్సంబంధిత అంశంపై జరిగే కార్యక్రమాలన్నింటా పాల్గోవడం జరుగుతోంది. ప్రపంచంలోనున్న ప్రసిద్దులైన సినీరంగ వంధిమాగధుల్నీ, వారి కృషినీ పరిచయం చేయడంతోబాటూ, స్విస్, జర్మన్, చైనీస్, కొరియన్, ఆఫ్రికన్, ఇరానియన్, హంగేరియన్, జపనీస్, బ్రిటీష్, ఫ్రెంచ్, స్పానిష్, ఇజ్రాయిలీ వంటి దేశాల క్లాసిక్ సినిమాలతో ఆయా దేశాల ఫిల్మ్ ఫెస్టివల్స్‌ను హైద్రాబాద్‌లో నిర్వహిస్తున్నాం. మూవీ మేళా పేరుతో కూడా మంచి సినిమాల్ని ప్రజలకి చేరువ చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. ఫిన్‌లాండ్, క్యూబా, ఇటలీ, పోలేండ్, న్యూజిలాండ్, రష్యా, స్వీడన్ మొదలగు దేశాల ఫీచర్ ఫిల్మ్‌లను ప్రదర్శించడంతోపాటు, హేమాహేమీలతో సినిమాలకి సంబంధించిన ఉపన్యాసాలు కూడా ఏర్పాటు చేస్తున్నాం. హెచ్‌వైఎఫ్ఐసి పేరుతో పత్రిక కూడా నడుస్తోంది. అలాగే దేశంలోని అన్ని భాషా చిత్రాలు మా క్లబ్‌లో స్క్రీనింగ్ చేస్తాం. 42 సం॥రాల్లో 3000 పైబడి లఘు, ఫీచర్ ఫిల్మ్‌ల్ని మా క్లబ్ ప్రదర్శించింది. సినిమాలపై అనేక పుస్తకాలు, సావనీర్లు ప్రచురించింది. అంతర్జాతీయ చలన చిత్రోత్సవాల్ని కూడా ఏర్పాటు చేశాం. మంచి సినిమా మానవీయ సృజనని మా నమ్మకం. మా కార్యక్రమాల ఇతర వివరాలు www.hyderabadfilmclub.org లో చూడొచ్చు. మూస విధానాలతో నడిచే సినిమాలకు ప్రతిగా ప్రజల్నీ, ప్రధానంగా యువతరాన్ని చైతన్యవంతం చేసే చిత్రాలను సమాజంలో అన్ని వర్గాలవారందరికీ చేర్చాల్సిన అవశరం ఈ రోజు ఎంతైనా ఉంది. ఫిలిం సొసైటీల కర్తవ్యం అదే.



13. ఫిలిం సొసైటీ కబుర్లు

– జంపా కృష్ణకిషోర్, విజయవాడ ఫిల్మ్ సొసైటీ
సెల్ : 9701044440

విజయవాడ ఫిలిం సొసైటీ (విఫిసో) ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో మొట్టమొదటి ఫిలిం సొసైటీ. విఫిసా 31 ఆగష్టు 1973లో విజయవాడలో ప్రారంభించబడినది.

అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు, ఫిల్మోత్సవ్, వివిధ దేశాల్లో ప్రదర్శించబడే చలన చిత్రాలను స్థానికులకు చూపించడం కోసం విఫిసా ఎన్నో చలన చిత్రాలను తమ సభ్యుల కోసం ప్రదర్శించింది. వాస్తవానికి నెలకు ఒక చలన చిత్రమైనా ప్రదర్శించాలనే ఉద్దేశ్యంతో విఫిసా తన ప్రస్థానం ప్రారంభించబడినా కొన్ని సందర్భాలలో గాని, కొన్ని నెలల్లోగాని ఒక్కో దేశం చలన చిత్రాలు 4 నుండి 6 చిత్రాలతో ఫెస్టివల్ ప్రదర్శించేది.

ప్రారంభం నుండి 1990 దశకం వరకు విఫిసా చలన చిత్రాలను విజయవాడ వాసులకే గాక పరిసర ప్రాంతాల ప్రజలకు, ఉత్తమ కళాభిమానులకు ఎన్నో దేశ విదేశీ చిత్రాలను ప్రదర్శించేది. అంతేగాక ఆ చలన చిత్రాలలోని మంచి చెడులు, సాంకేతిక విలువల మీద చర్చాగోష్టులను కూడా నిర్వహించేవి. ఈ చిత్రాలన్నీ కూడా ఫ్రీ సెన్సార్ చేయబడేవి. ఈ చిత్రాలు ఫిలిం సొసైటీలు తప్ప ఎక్కడా ప్రదర్శించబడేవి కావు. ఈ చలన చిత్రాలు వ్యాపారాత్మక చిత్రాలు కావు. కనుక ఉదయం 10 గం॥లలోపుగా ప్రదర్శించబడేవి. ఉదయం 7 గం॥లు లేదా 7:30 గం॥లకు ప్రదర్శించబడేవి. చలన చిత్రాలు చూసి ఆఫీసులకు వెళ్ళేవారుగాని, వ్యాపారస్తులు గాని 10 గం॥లకు వెళ్ళిపోయేవారు.

ఫిలిం సొసైటీలు ప్రదర్శించే చలన చిత్రాలు ఎక్కువగా సోషలిస్టు దేశాల నుండి వచ్చినవై ఉండేవి. మిగిలిన దేశాల చలన చిత్రాలు ఉన్నాకూడా ఎక్కువగా ఆ దేశాలవే ఉండేవి. ముఖ్యంగా క్యూబా, జి.డి.ఆర్. (జర్మన్ డెమోక్రటిక్ రిపబ్లిక్) యుగోస్లావియా, రొమేనియా, ఉత్తర కొరియా సోవియట్ యూనియన్ తదితర దేశాలతో పాటుగా దక్షిణ కొరియా, జపాన్, పోర్చుగల్, అమెరికా, అర్జెంటైనా, బ్రిటన్ తదితర దేశాల చలన చిత్రాలు ప్రదర్శించబడేవి. సభ్యులకు నెలకు కనీసం ఒక్క చిత్రమైనా ప్రదర్శించుతామని వాగ్దానం చేసినా 20 చిత్రాలు ప్రదర్శించిన సందర్భాలుండేవి. ఏడాదికి 100 చలన చిత్రాలు ప్రదర్శించేది విఫిసా.

విఫిసొ 1973లో ప్రారంభించిన నాటి నుండి విజయవాడ సబ్‌కలెక్టర్ గౌరవాధ్యక్షులుగా ఉండేవారు. ఇప్పటికీ అదే ఒరవడి కొనసాగుతున్నది. దీని వ్యవస్థాపకులు కొద్దిమందైనా, ఒక దశలో 1500 మంది వరకూ ఉండేవారు. సభ్యత్వం కొరకు సిఫారసులు కూడా చేయించుకునేవారు. విఫిసొలో సభ్యత్వం స్టేటస్ సింబల్‌గా ఉండేది. చాలామంది సభ్యులు తమ విజిటింగ్ కార్డులో విఫిసొ మెంబరు అని కూడా వేసుకునేవారంటే అతిశయోక్తి కాదు. సమయపాలన, క్రమశిక్షణ కలిగిన విద్యావంతులు, వ్యాపారస్తులు, డాక్టర్లు, ఇంజనీర్లు, లెక్చరర్లు, టీచర్లు మాత్రమే కాక విద్యార్థినీ విద్యార్థులు అలగే సామాన్యులు కూడా విఫిసొలో సభ్యులుగా ఉండేవారు. సుమారు 150 మంది వరకు జీవిత సభ్యులుండేవారు. ఇప్పటికీ ఫిలిం సొసైటీలు స్థాపించాలని చాలాచోట్ల నుండి ఉత్సాహపడుతుంటారు. విఫిసొ ప్రేరణతో రాష్ట్రంలో ఒకానొక దశలో 60 ఫిలిం సొసైటీలు ప్రారంభించబడ్డాయి. కానీ ఎక్కువ కాలం నిలవక 1990 దశకం తర్వాత ఫిలిం సొసైటీలు వెనుకపాటు పట్టాయి.

సంజయ్ గాంధీ మకుటంలేని మహారాజుగా వెలిగే రోజుల్లో, ఆయన ఢిల్లీ ఫిలిం సొసైటీలో సభ్యత్వం కొరకు దరఖాస్తు చేసుకుంటే చాలారోజుల తర్వాత గాని ఆయనకు ఢిల్లీ ఫిలిం సొసైటీ సభ్యత్వం ఈయలేదు. మన రాష్ట్రంలో కరీంనగర్ ఫిలిం సొసైటీకు స్వంతంగా ఆడిటోరియం నిర్మించుకున్నారు. కర్ణాటకలోని బెంగుళూరులో సుచిత్రా ఫిలిం సొసైటీకు కూడా సొంత ఆడిటోరియం ఏర్పాటు చేసుకున్నారు. చాలా ఫిలిం సొసైటీలకు గౌరవ అధ్యక్షులుగా ఆయా సొసైటీలున్న జిల్లాల కలెక్టర్లు ఉన్నారు. ప్రభుత్వం సహకారం లేకపోతే సొసైటీల మనుగడ కష్టమే. అంతేగాక 1990 దశకంలో వచ్చిన టెలివిజన్ 21వ శతాబ్దంలో వచ్చిన ఛానల్స్‌వల్ల ఫిలిం సొసైటీ ఉద్యమం బాగా వెనుక పట్టు పట్టినా కూడా ఈరోజుకు మంచి చిత్రాలు, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలలో ప్రదర్శించబడే చిత్రాలు (సిల్వర్ స్క్రీన్) మీద చూడటం తప్ప మరొక అవకాశం లేదు. ఇప్పుడు అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలు శాశ్వతంగా 'గోవా' లోనే ప్రదర్శించబడుతున్నాయి. గతంలో ఢిల్లీలో గాని లేదా ఏదైనా రాష్ట్ర రాజధాని నగరంలోగాని ప్రదర్శించబడేవి. ఆ విధంగా హైద్రాబాద్, చెన్నై, బెంగుళూరు, త్రివేండ్రం వేదికగా ఎన్నో చలన చిత్రోత్సవాలు ప్రదర్శించబడ్డాయి. ఉత్తమ, కళాత్మక, అంతర్జాతీయ చలన చిత్రోత్సవాలను వీక్షించుటకు ఫిలిం సొసైటీ తప్ప మరో మార్గం లేదు.

14. సమాంతర సినిమా; దశ - దిశ

- రఘురాం, విశాఖపట్నం ఫిల్మ్ సొసైటీ,
సెల్ : 9247890661

మంచి సినిమా గురించి ఏమ్మాట్లాడగలం? సినిమాకి కథ వుండొచ్చేమోగానీ అది తప్పనిసరనుకోవడం పెద్ద భ్రమ. మజీద్ మజిదీ చిత్రం "బరాన్" లో(ఇరాన్) కథేముంది 'ప్లెటోనిక్' ప్రేమ తప్ప. కానీ అదో ప్రేమకావ్యం. ఆయన చిత్రమే కలరాఫ్ 'పారడైస్'. అందులో గుర్రం కొట్టుకుపోవడం గురించి వర్ణించగలమా, కళ్ళులేని పిల్లవాడు ఈ ప్రపంచాన్ని స్పర్శించే తీరు వర్ణించగలమా! ఐనా అదో అద్భుత దృశ్య కావ్యం. కొరియన్ దర్శకుడు కిం-కి-డుక్ 'స్ప్రింగ్ సమ్మర్ ఫాల్ వింటర్' కథ చెప్పాలంటే నొట్లోంచి ఒక్క ముక్క రాదు. కానీ మనం కూడా చలికాలంలో గడ్డకట్టి వసంత కాలంలో నీరయ్యే ఆ కొలను గట్టున...మంచుపర్వతాల్లో కెళ్ళి అచ్చం ఆ ప్రకృతి పరిసరాల్లో వున్నట్లే ఎవరి ఆజ్ఞకూ లోబడకుండా...'మనిషి జీవితంలో వచ్చే దశలు ప్రకృతి దశల మాదిరిగా ఇంత బలీయంగా వుంటాయా' అనే ఆలోచనలో పడతాం. ఒక్క తుపాకీ కూడా పేలకుండా 'యుద్ధోన్మాదం...ఫాసిజం ఎంత దుర్మార్గమైంది!' అని రోజుల తరబడి మనచే ఆలోచింపచేసే చిత్రం 'బాయ్ విత్ స్ట్రైపుడ్ పైజమా'. సత్యజిత్ రే 'సద్గతి' చూసింతరువాత భారతదేశంలోని కులవివక్షత మనల్ని రోజుల తరబడి వెంటాడుతుంది. మొన్న మొన్న వచ్చిన 'పెరియారం పెరుమాళ్' కులవివక్షతకి శాస్త్రీయంగా అద్దం పట్టిన చిత్రం.

ఐతే ఇదంతా ఒక పార్శ్వం మాత్రమే. మన దేశంలో ప్రతి సంవత్సరం సుమారు 2000 దాకా సినిమాలు విడుదలవుతున్నాయి, సంవత్సరానికి రెండువందల ఇరవై కోట్ల సినిమా టికెట్లు అమ్ముడుపోతున్నాయి. ఓ మేధావి అభిప్రాయపడినట్లు, భారతదేశంలో ఎక్కువమంది జనాలు సినిమాహాళ్ళలోనూ రైళ్ళలోనూ వుంటారు. వేలకోట్ల హవాలా డబ్బు ఇప్పుడు సినిమా పరిశ్రమలో ప్రవహిస్తోంది. అందుకే మన హీరో రెండు కాళ్ళ మీదా నించోలేడు, హావభావాల మాట అటుంచండి, కెమేరా చూస్తూ నాలుగు ముక్కలు మాట్లాడలేడు. చూడటానికి పుల్లలాగున్నా మూడు కతిపోట్లు, ఆరు బుల్లెట్లు దిగినా సెలైన్ ఎక్కించుకొని హాస్పటల్లో వున్నా ఒక్క వుదుటున వచ్చి పదిమందిని చితక బాదేస్తాడు. కథానాయికకి బుర్రా వుండదు,

ఒక వ్యక్తిత్వమూ వుండదు. మొదట్లో కస్సుబుస్సులాడినా తరవాతి సీన్లో హీరోని ఆరాధించేస్తుంది. ఈయనగారు బాత్రూంలో సూటూ బూటుతో వుంటే ఆవిడ వంటింట్లో మోడరన్ డ్రెస్‌లో వుంటుంది. చిత్రంలోని కథా, మాటలూ, పాటలూ సమస్తమూ హీరో కోసమే తయారవుతాయి. అన్ని పాత్రలూ హీరో చుట్టే తిరుగుతాయి. అసలే పాత్రకీ ఔచిత్యం కానీ, వ్యక్తిత్వం కానీ వుండదు. విపరీతమైన హింస, ప్రేక్షకులను ఏ స్థాయికి తీసుకెళ్ళారంటే హీరో చేసే హింసను చూసి ఆనందించి చప్పట్లు కొట్టే స్థాయికి తీసుకెళ్తున్నారు. ఈ ఫాక్షనిజం సినిమాల వల్ల మన రాష్ట్రంలోని రాయలసీమ ప్రాంతం మొత్తాన్నీ ఫాక్షనిస్టులుగా ప్రజలు భావిస్తున్నారు. శృంగారాన్నీ, ప్రేమనీ, చావునీ హింసనీ, అన్యాయాన్నీ, మోసాన్నీ, చట్టాన్నీ, సమస్త మానవ ఉద్వేగాలనీ, భ్రమాన్విత లోకాలకి తీసుకెళ్ళి చూపిస్తున్నారు. ఈ జాడ్యం మన సినిమాలకే కాదు, మొత్తం భారతదేశంలోని అన్ని భాషా చిత్రాలకీ వుంది. ఆ మాటకొస్తే విదేశీ చిత్రాలలో కూడా ఇదే వరస. అన్ని సంస్కృతులలాగే మనకి ఈ నిష్ఫల భ్రమాన్విత చిత్రకళ కూడా అమెరికా, యూరోప్‌ల నుండే దిగుమతయింది. తరువాత మనదైన దేశీయ ముద్రలోకి మారింది.

కళంటే మనిషి అవ్యక్త భావాలను వ్యక్తీకరించే సువిశాల మాధ్యమం. అక్కడ ఒక స్పష్టతనేర్పరచుని తిరిగి తన స్పృహను పెంచుకొనే ప్రయత్నమే కళ. ఈ ప్రయాణంలో వినోదం, విషాదం, హాస్యం, దు:ఖం, విస్మయం, తపన, సౌందర్యం ఇలా ఎన్నిటినో దర్శిస్తాడు మనిషి. కానీ నేటి సినిమా కళ యువతకి ఒక భ్రమాన్వితమైన భవిష్యత్తును ప్రసాదిస్తోంది. సౌందర్యం, ప్రేమ, సాహసం, ఆరాధన, దయ, కరుణ జాలి, నేరం, శిక్ష ఇలా అన్ని వ్యవస్తీకృత అంశాల పట్ల భ్రమాన్వితమైన స్పృహను కల్పిస్తోంది. ఇది ఈనాటిది కాదు ప్రపంచీకరణలో భాగంగా ప్రపంచమంతటా హాలీవుడ్, యూరోప్ సినీ పరిశ్రమల నుండి దిగుమతైనదే! మొదటి ప్రపంచ యుద్ధం తరువాత ఫ్రాన్స్, ఇటలీ, జర్మనీ సినీ పరిశ్రమలు కుదేలయ్యాయి. అమెరికా, ఇంగ్లండ్ నుంచి వందల సినిమాలు వీళ్ళ సినిమాహాళ్ళను ముంచేశాయి. ప్రపంచ యుద్ధాలలో దేశాలే కాదు, ప్రజల జీవన శైలీ, సంస్కృతులూ స్తబ్ధతకి గురైయ్యాయి. అప్పటివరకూ వున్న కళలు యుద్ధం కోసం యుద్ధోన్మాదంతో నిండిపోయాయి, శవాల గుట్టలే చరిత్రపుటలయ్యాయి. సంగీతం, సాహిత్యం, నాటకాలు సమస్త కళలూ సంప్రదాయాలూ గిడసబారిపోయాయి. ఉప్పెనలో మునిగిన

పొలాలే మేటవేసిన ఒండ్రుమట్టిలో బంగారం పండినట్లు, లావా పొంగిన చోటే లవణ ధారలు ప్రవహించినట్టు, ఇటలీ, ఫ్రాన్స్, జర్మనీలలో ఈ వ్యవహారమ్మీద తీవ్ర దుమారం రేగింది. ఎన్నో శాస్త్రీయ ఆవిష్కరణలూ, మందులూ, అంటీబయోటిక్స్, రసాయనాలూ, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్, రవాణా ప్రసార సాధనాలూ, వాటి ఆవిష్కరణలూ ప్రపంచ యుద్ధాలలోనే జరిగినట్లు కళారంగంలోకూడా భావప్రకటన ఒక ఉద్యమంగానూ, తప్పనిసరి అవసరంగానూ ముందుకి వచ్చింది. అప్పటి కళారూపాలు అసంపూర్తిగా వ్యక్తీకరిస్తున్నాయా అనే సందేహాలు వ్యక్తమయ్యాయి, కొత్త ఆలోచనలకు ఇవి పొసగవేమోననే న్యూనతకీ లోనయ్యారు అందుకే ఈ భావప్రకటన ఉద్యమం కళారంగంలో ప్రతిశాఖనీ తుఫానులా తాకింది. కళారూపాలు దేవుణ్ణీ, దెయ్యాలనీ, రాజుల చరిత్రల్నీ, ఇతిహాసాల్నీ, భ్రమాన్వితమైన జగత్తునీ చిత్రించడమే కాకుండా, సామాజిక, ఆర్థిక పరిస్థితినీ, సంఘ జీవితాన్నీ, పౌర సమాజాన్నీ, భౌతిక వాస్తవాల్నీ అద్దం పట్టాలని భావించారు. ఆ భావనే కొత్త కళారూపాల అన్వేషణకి భౌతిక పునాదయింది. అందులో భాగమే గ్రీకు–రోమన్ ఆర్ట్, సర్రియలిజం (అధివాస్తవికత), హోలోకాస్ట్ శిల్పకళలాంటి ఎన్నో కళారూపాలు అభివృద్ధి చెందాయి. అన్నిటిలోనూ భావ వ్యక్తీకరణ ఒక ప్రధానాంశంగా, ప్రజాస్వామిక హక్కుగా ముందుకు వచ్చింది. ఈ మార్పు చిత్రపరిశ్రమని కూడా తాకింది. అందులో భాగమే నియోరియలిజం చిత్రాలు.

నియోరియలిజం (పేరలల్) కళాత్మక చిత్రాల చరిత్ర:

ఫాసిస్టు ముస్సోలినీ ఇదే అదనుగా భావించి ఇటలీ సినీ పరిశ్రమలో కాలు పెట్టాడు. ప్రభుత్వం సహాయం చేస్తుంది, దేశభక్తి, జాతీయత, యుద్ధావసరాల అంశాలమీద చిత్రాలు తీయాలని షరతు పెట్టింది. అలా 700 చిత్రాలకు పైగా తీయడం జరిగింది. మన మేధావంతులైన కళా ద్రష్టలు అంతటితో ఆగలేదు. దేశభక్తి, యుద్ధావసరాలూ చెపుతూనే దేశ ఆర్థిక పరిస్థితి దివాళా తీసిన పారిశ్రామిక రంగం గురించీ, రైతుల, శ్రామికుల దీన గాథలూ యుద్ధవినాశనం, ఛిద్రమైన సామాజిక సంబంధాలూ, ఇలా అనేక వాస్తవ సామాజిక అంశాల చిత్రీకరణలతో కథాంశాలను జోడించి చిత్రాలు నిర్మించారు. వాటిని ప్రేక్షకులు ఎంతగానో ఆదరించారు.

1935 లో వచ్చిన 'రెడ్ పాస్‌పోర్ట్' లో ఒక ఇటలీ రైతు వ్యవసాయాన్ని కోల్పోయి దేశదిమ్మరి అవుతాడు. చివరికి యుద్ధంలో చేరి మరణిస్తాడు. దీన్లో రైతుల కష్టాలూ, వ్యవసాయం ఎలా చితికిపోయిందీ లాంటి ఎన్నోవిషయాలను చిత్రీకరించారు, అంతా అవుట్ డోర్, నూతన నటీమణులే. చిత్రం విజయవంతంగా ఆడింది. దీన్ని మొదటి నియో రియలిస్టిక్ చిత్రంగా చెప్పుకుంటారు. అదే సమయంలో రష్యాలో, ఫ్రాన్స్ లో కూడా పేరలల్ చిత్రాలు వచ్చాయి కానీ ఇటలీ ప్రమాణాలతో సరితూగలేక పోయాయంటారు. నియో రియలిజాన్ని ఫాసిజానికి వ్యతిరేకంగా వచ్చిన వ్యక్తీకరణగా కూడా చెబుతుంటారు. ఇది కూడా రెండు శాఖలుగా వికసించింది. ఒకటి భావజాలపరంగా నియోరియలిజం అంటే సామాన్యుడి జీవనం, ప్రజాస్వామిక హక్కులూ భావాలూ, కార్మిక కర్షకుల వాస్తవ పరిస్థితులూ, పేదరికం, పౌర సమాజం మొదలైన ఇతివృత్తాలతో తీసే చిత్రాలు కాగా, రెండోది కేవలం శైలిలో అంటే పూర్తిగా అవుట్‌డోర్‌లో ప్రకృతిని చిత్రీకరిస్తూ డాక్యుమెంటరీ శైలిలో తీసే చిత్రాలు. 'రెడ్ పాస్‌పోర్ట్ (1935), 'రోం ఓపెన్ సిటీ' (1945), 'ఒసెషన్' (1943), 'లాటెరా ట్రామా'(1948), జర్మనీ 'ఇయూర్ జీరో'(1948) తో పాటు ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన 'బైసికిల్ థీవ్స్' (1948) లాంటి ఎన్నో చిత్రాలు మొదటి కోవకి చెందిన చిత్రాలే.

భారతదేశంలో పేరలల్ (సమాంతర) సినిమా:

దాదా సాహెబ్ ఫాల్కే భారతీయ సినిమా పితామహుడు. ఆలం ఆరా మొదటి టాకీ సినిమా ఇవన్నీ మనకి తెలిసినవే. మొదట్లో టాకీ లేకపోవడం వల్ల ప్రేక్షకులకి తేలికగా అర్థమయ్యే పురాణ ఇతిహాసాలనే కథా వస్తువుగా తీసుకుని చిత్రాలు తీసారు, ఎప్పుడైతే టాకీ వచ్చిందో ఇక నాటకరంగంలోని పద్యాలూ పాటలూ చిత్రరంగాన్ని ఆవరించేసాయి. సంగీత ప్రాధాన్యత పెరిగిపోయింది. కథ బాగోలేకపోయినా పాటల వల్ల హిట్ అయిన సినిమాలు కోకొల్లలు. 1932 లో 'అలం ఆరా' తరువాత వచ్చిన 'ఇంద్ర సభ' (ఉర్దూ) చిత్రంలో 72 పాటలతో 211 నిమిషాల నిడివితో ప్రేక్షకులను అలరించింది. తరవాత వచ్చిన సాంఘిక చిత్రాలలో కూడా పాటల ప్రాధాన్యత తగ్గలేదు. ఉదాహరణకి తెలుగులో 'మళ్ళీ పెళ్ళి', 'మాలపిల్ల', 'రైతు బిడ్డ' లాంటి తెలుగు క్లాసికల్ మూవీస్‌లో కూడా పాటలు పుష్కలంగా ఉన్నాయి. ఎంతో క్లిష్టమైన విషయాలను అతి తేలికగా అభూత కల్పనలను అలవోకగా

పాటలతో ముగించేసేవారు. దీంతో విసిగిపోయిన సినీ విమర్శకులకీ కళాకారులకీ నియోరియలిజం ఒక వరంలా ప్రాప్తించింది.

1949 లో 'జిన్ రెనోయర్' అనే ఫ్రెంచ్ దర్శకుడు, 'ది రివర్' చిత్రాన్ని తీయటానికి కలకత్తాకి వచ్చాడు. సత్యజిత్ రే అతనికెంతగానో సహాయపడ్డాడు. అప్పుడే రే "ఫథేర్ పాంచాలీ" గురించి చెబితే రెనోయర్ చాలా ప్రోత్సహించాడు. 1950 లో రే పనిచేస్తున్న అడ్వర్టైజింగ్ కంపెనీ అధిపతి డి.జె. కైమర్ రే ని ప్రాజెక్ట్ పనిమీద లండన్ పంపాడు. అక్కడ వున్న మూడు నెలలూ రే 99 సినిమాలు చూశాడు. దాంట్లో అధిక భాగం నియోరియలిజం సినిమాలే. ఆయన చూసిన సినిమాల్లో 1948 లో తీసిన ఇప్పటికీ గొప్ప చిత్రంగా కొనియాడబడుతున్న 'బైసికిల్ థీవ్స్' కూడా ఒకటి. ఈ సినిమాలన్నీ ఆయనపై ప్రగాఢమైన ముద్రను వేసాయి. ఆ ప్రేరణతోటే ఆయన పథేర్ పాంచాలీ తీశారు. ఆ రకంగా పథేర్ పాంచాలీ మొదటి నియో రియలిజం సినిమాగా చెప్పుకోవచ్చు. ఐతే ఇక్కడో చిన్న విషయం. పథేర్ పాంచాలీ 1952 లో మొదలై 1955 లో విడుదలైంది. కానీ 'రిత్విక్ ఘటక్" 1952 లోనే నియో రియలిజం పేరలల్ సినిమా, కళాత్మక విలువలు కలిగిన 'నాగరిక్' చిత్రాన్ని తీసారు కానీ అది అయన మరణానంతరం 1977 లో విడుదలైంది. మనదేశంలో వచ్చిన నియోరియలిజం సినిమాలలో కూడా మనిషే కేంద్ర బిందువు. ఆతని మానవ సంబంధాలూ, సామాజిక ఆర్థిక సంబంధాలూ, జీవన శైలీ, శ్రమ, పేదరికం, హావభావాలూ, సుఖం, సంతోషం, వ్యాకులత, జీవన విషాదం, నాగరికత, వాటి లోపాలూ, విలువలూ, వాటి అల్పత్వమూ, రైతులూ, శ్రామికుల కథలూ, ఇవన్నీ చిత్రానికి ప్రధాన వస్తువులు. అందుకే వీటిని సమాజం పట్ల ఒక బాధ్యతతో తీసిన చిత్రాలుగా అభివర్ణిస్తారు.

ఇలా మొదలైన ప్రత్యామ్నాయ లేదా కళాత్మక లేదా నియోరియలిజం చిత్రాలు 1970 తరువాత మరింత వేగం పుంజుకున్నాయి. శ్యాం బెనగల్, ఆదుర్తిగోపాలకృష్ణ, గుల్జార్, రాజేంద్ర సింగ్, గోవింద నిహలానీ, మృణాల్ సేన్ లాంటి మరెంతో మంది ప్రత్యామ్నాయ చిత్రాల నిర్మాణాన్ని కొనసాగించారు. శ్యాం బెనగల్ అంకుర్, మండీ ఎంతో పేరు ప్రఖ్యాతులు గడించాయి. బెంగాలీ, మలయాళం, మరాఠీ భాషలలో ఎన్నో గొప్ప చిత్రాలు వచ్చాయి. 1984 లో గౌతం ఘోష్ తీసిన 'పార్' రైతాంగ జీవితాలు పల్లెల్ని కోల్పోయి పట్టణీకరణలో ఎలా ఉక్కిరి

బిక్కిరి అవుతున్నారో చక్కగా తెలిపే చిత్రం. అలాగే 1989 లో మళయాలంలో తీసిన 'పిరవి' ఎమర్జెన్సీ దురాగతాలకు అద్దం పడుతుంది. ఇది మరో గొప్ప నియో రియలిజం చిత్రం. కొన్ని సినిమాలు ప్రత్యామ్నాయ లక్షణాలను కలిగి వుండి కూడా కమ్మర్షియల్ విజయాలను సాధిస్తాయి. అందుకు మంచి ఉదాహరణ బిమల్ రాయ్ తీసిన 'దో బీఘా జమీన్.' ఇలా 1955 నుంచీ 1990 దాకా ఎన్నో ప్రత్యామ్నాయ చిత్రాలను మనం దర్శించవచ్చు.

ఫిల్మ్ క్లబ్స్, ఫిల్మ్ సొసైటీల ఆవశ్యకత: మనం ఇందాక చెప్పుకున్నట్లు నియో రియలిజంకి పోటీగా ఫక్తు వ్యాపార దృక్పథం గల సినిమాలు 1920 నుంచి, అంటే మొదటి ప్రపంచ యుద్ధం తరువాత నుంచీ రావడం మొదలైంది. భారీ తారాగణంతో ఫైవ్ స్టార్ హోటళ్లలో భారీ సెట్టింగులతో పెద్ద పెద్ద స్టుడియోలలో చిత్రపరిశ్రమ కొత్తపుంతలు తొక్కింది, వీటినే వైట్ టెలిఫోన్ సినిమాలంటారు. వీటి ముందు ఆనాటి కాలంలో వచ్చిన మంచి సినిమాలూ, ఆర్ట్ సినిమాలూ నిలదొక్కుకోలేక పోయేవి. వాటిని సేకరించి భద్రపరచడానికి ఫిలింస్ ప్రదర్శించడానికి ఫిలింక్లబ్బులు అవసరమయ్యాయి. 1907 లో చలన చిత్రాలనూ, వాటి స్క్రిప్టునీ, ఇతర అంశాలనూ భద్రపరచడానికి పారిస్‌లో 'ఎడ్మండ్ బెనోయిట్ లెవీస్' అనే ఫిలిం క్లబ్ ఏర్పడినా, ప్రత్యామ్నాయ చిత్రాలను భద్రపరచి మెంబర్స్‌కి చూపాలనే కాంక్షతో 1921లో ఇటలీలో 'రిసిటో కానుడో' అనే ఇటాలియన్ చిత్రకళా సిద్ధాంతకర్తతో ఒక ఫిల్మ్ సొసైటీ ఏర్పడింది. తరవాత అనేక దేశాలలో ఇలాంటివే ఏర్పడగా వాటన్నిటినీ అనుసంధానం చేస్తూ 1947 లో ఫ్రాన్స్‌లోని కేన్స్‌లో ఫెడరేషన్ ఆఫ్ ఇంటర్నేషనల్ సినీ క్లబ్(ఎఫ్.ఐ.సి.సి.) ఏర్పడింది. అలాగే 1947 లో సత్యజిత్ రే ఆధ్వర్యంలో కలకత్తా ఫిలిం సొసైటీ ఏర్పడింది. 1959 లో ఫెడరేషన్ ఆఫ్ ఫిల్మ్ సొసైటీ ఆఫ్ ఇండియా ఏర్పడి ముంబై, మద్రాస్, కలకత్తా, ఢిల్లీ ఫిలిం సొసైటీలను కలుపుకుంది. ఇప్పుడు దేశంలో వున్న అన్ని ఫిలిం సొసైటీలు దీనికి అనుసంధానం చేసుకోవచ్చు. ఆ రోజుల్లో 1970 తరువాత నియోరియలిజం కొనసాగింపులో మంచి సినిమాలు రావడానికి ఈ ఫిలిం క్లబ్బులు వాటి మెంబర్ల బలగం ఎంతో దోహదపడింది. కానీ 1990 తరువాత నూతన ఆర్థిక విధానాల వల్ల గానీ, హవాలా అండర్ గ్రౌండ్ డబ్బు వల్ల గానీ, ముఖ్యంగా టెలివిజన్ వల్ల గానీ కళాత్మక చిత్రాల

సంఖ్య తగ్గిపోయింది. మళ్ళీ 2000 ల తరువాత ఈ డిజిటల్ చిత్రీకరణలో భాగంగా చిత్రవ్యయం బాగా తగ్గింది. అనేక ఎలక్ట్రానిక్, సోషల్ మీడియా మాధ్యమాల వల్ల తక్కువ ఖర్చుతో ప్రజలకి సినిమా చేరువవుతోంది (నియోరియలిజం సినిమాలకు కూడా అప్పట్లో ఖర్చు తక్కువగా వుండేది) అందుకే 'ట్రాఫిక్ సిగ్నల్', 'సమ్మర్ 2007 నుండి కోర్ట్, ఫాండ్రీ, సైరాత్, తమిళ్ భాషా చిత్రం విసారనై, మొన్న మొన్న వచ్చిన 'పెరియారం పిరుమాళ్', మళయాలం 'ఒరే కడల్', 'మెల్విలాసం', తెలుగు 'బంగారు తల్లి', 'మిణుగురులూ', 'కేరాఫ్ కంచరపాలెం' ఇలా ఎన్నో చిత్రాలు వస్తున్నాయి. కానీ అవి పట్టుమని పది రోజులు కూడా ఆడటం లేదు. వీటిని సేకరించి అభిరుచిగల ప్రేక్షకులకి చూపించవలసిన బాధ్యత ఫిలిం సొసైటీల మీద వుంది.

భారతీయ సినీ పరిశ్రమ అంతర్జాతీయ సినిమాలను ముఖ్యంగా హాలీవుడ్, బ్రిటీష్ సినిమాలను తట్టుకుని ప్రపంచవ్యాప్తంగా తన వ్యాపారాన్ని కొనసాగిస్తున్నది. కానీ నాణ్యత విషయంలో మనం ఎంతో వెనుకబడివున్నాం. మనకొచ్చిన ఆస్కార్లు కానీ కేన్స్ అవార్డులు కానీ వేళ్లమీద లెక్కపెట్టొచ్చు. ఈ దుస్థితి పోవాలంటే దేశంలో ప్రతి జిల్లాలో ఫిలిం సొసైటీలను పెట్టి ప్రజలను మెంబర్లుగా చేర్చి ప్రత్యామ్నాయ సినిమాల పట్ల, కళాత్మకమైన వాస్తవానికి దగ్గరగా వున్న విలువైన చిత్రాల పట్ల వారి అభిరుచిని పెంచాలి. అప్పుడే రాబోయే చిత్రాలకి ఆదరణ లభిస్తుంది. అప్పుడే మన చిత్ర కళకి సామాజిక స్పృహ తోడై అంతర్జాతీయంగా ఉన్నత ప్రమాణాలుగల చిత్రాలను రాశిలోనూ వాశిలోనూ నిర్మించగలం.

15. మంచి సినిమా నేటి అవసరం

– **వై. కరుణాకర్** , సినీ అభిమాని,
ఒంగోలు, సెల్ : 96187 62076

సాహిత్యం లాగే సినిమా కూడా ఒక కళ. ఏక కాలంలో బుద్ధినీ హృదయాన్నీ చేరుకోగల కళ. మంచి సాహిత్యం లాగే మంచి సినిమా కూడా భావోద్రేకాల ఉపశమన సాధనం కాదు. మన ఉద్రేకాలకు, వాంఛలకు ఊహాత్మక ముగింపు కాదు. కొత్త ఊహలకు ఆలోచనలకూ ఒక ఉద్వేగ భరిత ప్రారంభం. మంచి సినిమా మనల్ని భావోద్వేగాలమీదుగా వివేచనవైపు నడిపిస్తుంది. లేదా ఒక ఆలోచన ముందువెనుకల భావోద్వేగ ప్రపంచాన్ని ఆవిష్కరిస్తుంది. మంచి సినిమా ఎంత నిర్దిష్టమో అంత సార్వత్రికం. చూపిస్తున్నది ఒక స్థల కాలాలలోని జీవితమే అయినా అది అనుభవంలోకి తెచ్చే జీవన విలువలు మాత్రం సార్వత్రికం.

అయితే ఏది మంచి సినిమా? మంచిసినిమాకు ప్రమాణాలేంటి? చెప్పే మనిషిని బట్టి జవాబు మారిపోతుంది. మన దృక్పథాన్ని బట్టే మన నిర్వచనముంటుంది. ఈ ప్రపంచంతో మనకేమీ ఫిర్యాదు లేకపోతే అందమైన, హృద్యమైన పరిశీలనలతో మనసును మైమరపించేదే మంచి సినిమా అవుతుంది. అట్లా కాక ఈ ప్రపంచం అనేకానేక అసమానతలతోనూ, అణచివేతలతోనూ నడుస్తోందనీ ఇది మారవలసి ఉందనీ గనుక అనుకుంటే వీటిని పట్టించుకునేదే మంచి సినిమా అవుతుంది. నా వరకు నాకు ఈ రెండవ రకం సినిమానే మంచి సినిమా.

మంచి సినిమా ప్రపంచాన్నిపట్టించుకుంటుందన్నది నిజమే కానీ, ఈ ప్రపంచం గురించి మాట్లాడిన ప్రతి సినిమా మంచి సినిమా అవుతుందని గ్యారంటీ లేదు. మంచి సినిమాకు వాస్తవికతే పునాది. ఏ మాత్రం అతిశయము లేని వాస్తవ జీవన దర్పనమై ఉండాలి. బైసికిల్ థీవ్స్ నుండి కోర్టు సినిమా వరకు సినిమాను సజీవం చేసింది వాస్తవికతే. వాస్తవికత అన్నది సినిమా అంతటా అడుగడుగునా ప్రతిఫలించాలి. కథాంశం మాత్రమే కాదు. సంభాషణలూ, నటన, కెమెరా కదలికలూ అన్నీ సహజంగా ఉండాలి. సినిమా జీవితానికి తన సమీప ప్రపంచానికీ దగ్గరగా

ఉన్నపుడే ప్రేక్షకుడు అందులోకి నడచి వస్తాడు. అందులో భాగమవుతాడు. **మంచి సినిమా థియోటర్ లో ముగిసి ప్రేక్షకుల మనసులో కొనసాగుతుంది.** దీన్నే వాస్తవిక సినిమా అని సమాంతర సినిమా అని అంటున్నాం.

సినిమా పెట్టుబడితో ముడిపడి ఉన్నందున తక్షణ ఉద్వేగాలకు ప్రాధాన్యత వచ్చింది. ప్రేక్షకుడికి చివరలో ఒక సంతృప్తి కలిగించాల్సిన అవసరం వచ్చింది. ఈ క్రమంలోనే వ్యాపార చిత్రాలు ముందుకొచ్చాయి. కొంతకాలం ఒక ఉద్యమంగా నడిచిన సమాంతర సినిమాలు క్రమంగా ఆగిపోయాయి. అదే సమయంలో వ్యాపార చిత్రాల మూసఫార్ములాలు ప్రేక్షకులకు ఏమాత్రం ఆసక్తిని కలిగించలేకపోతున్నాయి. ఈ క్రమంలోనే వాస్తవిక సినిమాల శైలిని అనుకరిస్తూ వాణిజ్య చిత్రాలు తీయడం మొదలైంది. దక్షిణాదిన మణిరత్నంతో మొదలైన ఈ ధోరణి ఉత్తరాదికి పాకింది. సమాంతర సినిమా పూర్తిగా కనుమరుగయిన నేపథ్యంలో ప్రేక్షకులు వీటితోనే సంతృప్తి పడ్డారు. ఇప్పుడు ఎక్కువమంది మంచి సినిమాలు అంటున్నది వీటినే.

ఏదో ఒక సామాజికాంశం ఆధారంగా సినిమా తెస్తే సరిపోదు. కుల వివక్షత అనే అంశంమీద తీసిన ఒక సినిమా ఆ వివక్షపట్ల సమాజానికి ఒక సెన్సిబిలిటీ కలిగించాలి. దానిని పోగొట్టే దారిని సాధ్యమయ్యే పద్ధతిలో సూచించాలి. అందుకు ఎంతోకొంత భావజాల ప్రేరణ ఇవ్వాలి. అంతేకానీ ఎవరో ఒకరో చప్పట్ల కోసం నాలుగు డైలాగులు చెప్పి మానవమాత్రులకు సాధ్యంకాని శక్తులను ఉపయోగించి దానిని అంతం చేసినట్లు చూపిస్తే ఆ సినిమా ప్రయోజనాన్ని నెరవేర్చదు. సినిమా నమ్మశక్యంగా ఉండాలి. వాస్తవికత ముసుగేసుకున్న వాణిజ్య సినిమా ఈ ప్రయోజనాన్ని నెరవేర్చలేదు. ఎందుకంటే దానికి తక్షణ ప్రతిస్పందన కావాలి.

అందుకే వాస్తవిక సినిమా నిర్మాణం ఒక ఉద్యమంగా తిరిగి మొదలు కావాలి. కొత్త సౌకర్యాలూ, క్రౌడ్ ఫండింగ్ లాంటి కొత్త పద్ధతులూ ఉపయోగించుకుని సినిమాని ప్రజాపరం చెయ్యాలి. సినిమాను ఒక కళగా ఇష్ట పడేవాళ్ళు దానితో సామాజిక ప్రయోజనముందని నమ్మేవాళ్ళు దీనికి పూనుకోవాలి. అప్పుడే సినిమా ఒక ప్రజాకళగా మిగులుతుంది.

16. ఉత్తమ సినిమాలు సమకాలీన సమాజాన్ని ప్రతిబింబిస్తాయి.

– చెరుకుమల్లి సింగ, గుంటూరు ఫిల్మ్ సొసైటీ,
సెల్ : 9177174389

బాలల సంపూర్ణ మానసిక వికాసం కోసం, కళల పట్ల, సంస్కృతి, సంప్రదాయుల పట్ల ప్రజల్లో అవగాహన కలిగేందుకు చిత్రోత్సవాలు దోహదపడతాయి. మూఢాచారాలు రూపుమాపేందుకు ప్రజల్లో మానవతా విలువలు పెంపొందించేందుకు మంచి సినిమాలు ప్రయోజనకారిగా వుంటాయి. ప్రజల్లో, సమాజంలో మార్పుకు సినిమా మాధ్యమం ఉపయోగపడుతుంది. దేశ విదేశీ ఉత్తమ చిత్రాలు ప్రదర్శన వలన ఆయా దేశాల సంస్కృతులు ప్రజల నడవడిని – ఒకరినొకరు తెలుసుకుంటారు. మానవులంతా ఒక్కటే – తరతమ భేదాలు లేకుండా వుండేందుకు కూడా సినిమాల ప్రజల్లో మార్పు కొంతవరకైనా తీసుకువస్తుంది. **మానవీయ కళాత్మకత మనోభావాల్ని సంపన్నం చేస్తుంది. మనిషిలోని భావోద్వేగాలకు భరోసా ఇస్తుంది. తద్వారా జీవితంలో విలువల ఆధారంగా నడవడికను స్థిరీకరించుకోడానికి కృషి చేసేలా ప్రేక్షకుల్ని ప్రభావితం చేయడం మంచి కళ లక్షణం. సినిమా కూడా ఇందుకు అతీతం కాదు.** సంగీతం – సాహిత్యం జానపదం వివిధ కళలున్న సినిమాలు ప్రదర్శించడం వలన సంగీత సాహిత్య జానపద కళారూపాల శైలిని ఒకరికొకరు అర్థం చేసుకునేందుకు వీలవుతుంది. సమాజంలో మంచిని పెంచి, సమ సమాజ నిర్మాణం ధ్యేయంగా వున్న సినిమాలు వున్నాయి. వాటి ప్రదర్శన వలన ప్రజల్లో తప్పకుండా మార్పు కనిపిస్తుంది. పేద, ధనిక భేదాలు లేకుండా మనమంతా ఒక్కటే అనే ఆలోచనలు కలిగిన సినిమాలున్నాయి. వాటి వలన కూడా తప్పక సమాజంలో మార్పు వస్తుంది.

17. వ్యాపార సినిమా – పతన సంస్కృతి

– బి. సూర్యసాగర్, కళాసాంస్కృతిక విమర్శకులు
అనంతపురం, సెల్ : 9441146694

సంస్కృతి అన్నది ఒక సమాజపు నిర్దిష్ట జీవన విధానం. సామాజికోత్పత్తి, పంపిణీ, వినియోగము, మానవ సంబంధాలు ఆస్తి సంబంధాలు, భాష, భావాలు, సంప్రదాయాలు, రాజకీయాలు, విద్య, నీతి, న్యాయము, చట్టము, మత విశ్వాసాలు, కళలు, కుటుంబము, వివాహము – ఇలా సకల జీవన పార్శ్వాల సమ్మేళనమే సంస్కృతి. సంస్కృతిలో మంచీ చెడు వున్నాయి. అభివృద్ధికరమైనదీ, అభివృద్ధి నిరోధకమైనదీ కలసి వున్నాయి. ప్రజానుకూలమైనదీ వుంది. ప్రజా వ్యతిరేకమైనదీ వుంది. మౌఢ్యమూ వుంది. హేతువు వుంది. ప్రజాస్వామికమైనవీ, అప్రజాస్వామికమైనవీ వున్నాయి. సంప్రదాయమూ, మార్పు రెండూ కనిపిస్తాయి. ఏ స్థలకాల సందర్భంలో పరిశీలించిన సంస్కృతిలో గతము, వర్తమానము, భవితవ్యము కూడా గోచరిస్తాయి. గతాన్ని హేతుబద్ధంగా విలువకట్టడము, వర్తమానాన్ని సరిదిద్దుకోవడము, ఇంకా మెరుగైన భవిష్యత్తుకు దారులు నిర్మించడము సంస్కృతీ కర్తవ్యాలుగా వుంటాయి.

ఏ సమాజంలోనైనా సామాజికోత్పత్తి, పంపిణీ, వినియోగం ఆధారంగానే సకల సామాజిక సంబంధాలు, సంస్కృతీ నిర్మితమవుతాయి. భారతదేశం మౌలికంగా గ్రామీణ అర్ధ–భూస్వామ్య సమాజంగా వుంది. పారిశ్రామిక, ప్రజాస్వామిక, ఆధునిక సమాజంగా రూపొందడానికి ఇది అవరోధంగా వుంది. ఈ వెనుకబాటుతనం ఆధారంగా సామ్రాజ్యవాద పెట్టుబడి, దాని తోకగా స్వదేశీ దళారీ పెట్టుబడి, జాతీయ వ్యవసాయము, పరిశ్రమల అభివృద్ధిని అడ్డుకొని వక్రీకరిస్తున్నాయి. ఈ పరిస్థితి మూలంగా భూస్వామిక వెనుకబాటు సంస్కృతి ఒకవైపు, సామ్రాజ్యవాద అరాచక సంస్కృతి మరొకవైపు చుట్టుముట్టి సమాజాన్ని దిగజారుస్తున్నాయి. కావున, జాతీయ ప్రజాస్వామిక సంస్కృతిని నిర్మించుకోవడమన్నది ఆర్థిక – రాజకీయ సమస్య.

ఈ పరిస్థితుల్లో సాహిత్యము, కళలు సమాజాన్ని ముందడుగు వేయించగల సంస్కృతీ కర్తవ్యాల్ని చేపట్టాలి. సామాజిక మార్పుకోసం సాగుతున్న ప్రజాతంత్ర ఉద్యమాలకు, పోరాటాలకు విజయానికి తమ వంతు దోహదం చేయాలి. సాహిత్యం, అందునా ప్రగతిశీల సాహిత్యం, మనదేశపు 136 కోట్ల జనాభాలో అత్యల్ప సంఖ్యాక సమూహానికి మాత్రమే చేరుతున్నది. సగం జనాభా నిరక్షరాస్యులుగా వున్నారు.

అక్షరాస్యులనబడే వాళ్ళలో అత్యధికులు వార్తాపత్రికలు కూడా చదవరు. టెలివిజన్ ప్రసారాలే వాళ్ళ విజ్ఞాన సర్వస్వం. వార్తాపత్రికలు గాని, టి.వి. ప్రసారాలు గాని ఎంతటి అధ్వాన్నపు స్థితిలో వున్నాయో, అశేష సామాన్య ప్రజలు ప్రయోజనాలకు ఎంత హానికరంగా వున్నాయో చెప్పనవసరం లేదు. స్మార్ట్‌ఫోన్‌లు కలిగిన వారందరికి అదే విజ్ఞాన సర్వస్వం. అందులోని మంచిని మినహాయించి లేక ప్రసారాలను స్వీకరించడమే అత్యధికులు చేస్తున్న నిర్వాకం. ఈ ముప్పయ్యేళ్ళు సామ్రాజ్యవాద అరాచక అమానవీయ సంస్కృతి, వస్తు వినియోగ ఆరాటాలు పెచ్చరిల్లిపోయి మన మెదళ్ళ నుండి విమర్శనాత్మక వైఖరులను, మానవీయ సంస్పందనలను తొలచివేసాయి.

పాట, ఇతర ప్రజాకళారూపాలు, నాటకము నిరక్షరాస్యులను చేరగల ప్రక్రియలు. అన్ని ప్రజా ఉద్యమాల్లో అవి చైతన్య ప్రసార సాధనాలుగా గొప్పగా ఉపయోగితాలు. నేటి ప్రజా ఉద్యమాలు వాటిని తగినంతగా వినియోగించుకోవడం లేదు. తోలుబొమ్మలాటలే కాదు, నాటక ప్రదర్శనలు కూడా కనుమరుగవుతున్న పరిస్థితి ఏర్పడింది. **ఇవాళ అన్ని ప్రజాకళలు ప్రజలమధ్య నుండి అదృశ్యమైపోయి, వ్యాపార సంస్థలచే స్పాన్సర్ చేయబడి బుల్లితెరపై దర్శనమిస్తున్నాయి. ప్రజాకళలపై ద్రవ్య పెట్టుబడి సాధించిన విజయమిది.** కళలను, సంస్కృతిని ఉత్పత్తిచేసే శ్రామిక జన సమిష్టి జీవనం విధ్వంసానికి గురవుతున్న క్రమం యొక్క ఫలితమిది. ప్రజలు తాము సృజించిన కళలను తమ మధ్యనకాకుండా టెలివిజన్ మాధ్యమం ద్వారా ఆస్వాదించవలసి రావడం అర్ధభూస్వామ్య-అర్ధవలస చారిత్రక దశలో దారుణ వెనుకబాటుతనానికి, సామాజికార్థిక అసమానతలకు, సామ్రాజ్యవాద దోపిడీకి బలవుతున్న విషమ స్థితిని సూచిస్తుంది. **ప్రజాకళలు ప్రజల నుండి పరాయీకరించబడినాయి.**

ఇక ప్రజా కళా రూపం కాని సినిమా కళను గురించి ఏ విధంగా ప్రస్తావించుకోవాలి?

కళలు అన్నవి సామాజిక చైతన్య రూపముగా మానవ సమాజం పుట్టుక, పరిణామముతో పాటే పుట్టి పరిణమించినాయి. ఆటవిక దశలో కొండ గుహల్లో బండరాళ్ళపై చెక్కిన జంతువులు మోటు బొమ్మల నుండి డిజిటల్ సినిమా వరకు అది సాగింది. నాటి నుండి నేటి వరకు సమాజ పరిణామ వివిధ దశల్ని స్థూలంగాను అతి సూక్ష్మంగాను కళలు నమోదు చేసాయి.

సినిమా సాటిలేని అద్భుత కళాప్రక్రియ. అత్యంత ఆకర్షణీయమైన జనరంజక కళా మాధ్యమం. అది సకల కళల సమాహారం. అందుకే ఏ దృశ్యాన్నయినా, ఏ భావాన్నైనా, ఏ ఆదర్శాన్నయినా, ఏ సంఘర్షణనయినా అత్యంత ప్రభావశీలంగా చిత్రిస్తుంది. 19–20 శతాబ్దాల సరిహద్దుల్లో మొలకెత్తిన సినిమా కళారూపం దాని సాంకేతికతలో వచ్చిన విప్లవాత్మక ప్రగతి మూలంగా అపురూప ప్రసార మాధ్యమంగా రూపొందింది. మూకీ నుండి టాకీ దాకా, తెలుపు–నలుపు నుండి టెక్నికలర్ దాకా, చివరికి డిజిటల్ సాంకేతిక విప్లవంతో నమ్మశక్యం గాని అద్భుత కళా ప్రక్రియగా, ప్రసార మాధ్యమంగా అవతరించింది. దాదాసాహెబ్ ఫాల్కె మూకీ మూవీ రాజాహరిశ్చంద్ర (1913) నుండి జేమ్స్ కామెరాన్ సైన్స్ ఫిక్షన్ మూవీ అవతార్ (2009) వరకూ పరిశీలిస్తే సినిమా కళ విశ్వరూపం అవగతమవుతుంది.

సినిమా చరిత్ర ప్రాథమిక దశలో కూడా, అది ఎంత శక్తివంతమైనదో దాని నిర్మాణం అంత వ్యయప్రయాసలతో కూడినది. దాదాపు 1980ల వరకు కూడా సినిమా ప్రదర్శన కూడా పరిమితులను కలిగి వుండేది. సినిమా హాళ్ళు పరిమితంగా తాలుకా స్థాయి పట్టణాల వరకు మాత్రమే వుండేవి. ఇప్పటికీ సినిమా హాళ్ళు తాలూకా స్థాయి మించి విస్తరించలేదు. అయితే పట్టణాలు, నగరాల్లో వాటి సంఖ్య బాగా పెరిగింది. టెలివిజన్ ప్రసారాలు ముఖ్యంగా కేబుల్ టి.వి. ప్రసారాలు, డి.వి.డి. ప్లేయర్లు రాకతో సినిమా విస్తృతి జనాభాకు అందుబాటులోకి వచ్చింది. ఇక స్మార్ట్‌ఫోన్‌లు, మెమొరి కార్డులు రావటంతో ప్రపంచ సినిమా అరచేతుల్లోకి చేరింది. సినిమా హాళ్ళను బిజినెస్ మాల్స్‌గా మారుస్తున్న పరిస్థితి, మాల్స్‌లో మల్టీప్లెక్స్‌లు వెలుస్తున్న పరిస్థితి వచ్చాయి. సినిమాహాల్ ప్రవేశ టికెట్ ఒక అణా నుండి వందల రూపాయలకు చేరుకున్నా పైన పేర్కొన్న సాంకేతిక పరిణామాల మూలంగా సినిమా ప్రాచుర్యం పెరిగిందే గాని తగ్గలేదు. ఇల్లే సినిమా థియేటర్‌గా మారింది. మన చేతిలోనే ప్రపంచ సినిమా నర్తిస్తోంది.

ఫాల్కె నిర్మించిన రాజాహరిశ్చంద్ర మొదలుకొని ఈ వందేళ్ళలో మన దేశంలో యాభై వేలకు పైగా సినిమాలు వివిధ భాషల్లో వెలువడినాయి. నేడు ఏటా దాదాపు 1500 సినిమాలు విడుదలవుతున్నాయి. మన దేశంలో సినిమాకు గల ఆదరణను ఇది సూచిస్తుంది. దాదాపు వందకు పైగా దేశాల్లో భారతీయ సినిమాలు ప్రదర్శనకు నోచుకుంటున్నాయి. వివిధ రకాల కళాకారులు, సాంకేతిక నిపుణులు, ఉద్యోగస్తులు కార్మికులు రచయితలు, మరి, ఇంతటి ప్రాచుర్యం కలిగిన భారతీయ సినిమా సమాజంపై నెరపుతున్న సంస్కృతీ ప్రభావం ఏ విధంగా వుంది?

ఏ కళలో అయినా, కళాఖండములో అయినా రెండు అంశాలుంటాయి. అది సాహిత్య రచన, చిత్రము, శిల్పము, సంగీతము, నృత్యము, గానము, నాటకము, సినిమా – ఏదైనా కావచ్చు. ఏ కళాఖండము ఏమి చెబుతున్నది, ఏ విధంగా చెబుతున్నది అన్నవే ఆ రెండు అంశాలు. దీనినే కళాకృతిలోని సారం, రూపం అని ప్రస్తావిస్తాం. ఆ రెంటికి చక్కని సమన్వయం కుదిరినప్పుడు ఆ కళాకృతి ఫలప్రదమై ప్రభావశీలత కలిగి వుంటుంది. అయితే సారమే (విషయం) ప్రధానమైనది. చౌకబారు లేదా అసత్యమైనా విషయానికి ఎన్ని మెరుగులు (రూపం) అద్దినా అది గొప్ప కళ కాజాలదు. విషయ ఔన్నత్యం, రూప ఔన్నత్యం పొందినప్పుడు అది గొప్ప కళ అవుతుంది. అది ఒక జీవిత సత్యాన్ని కళాత్మకంగా వెల్లడి చేస్తుంది.

సినిమా కళకు కూడా పై సూత్రాలే వర్తిస్తాయి. ఈ వంద సంవత్సరాల్లో మనదేశంలో నిర్మితమైన దాదాపు యాభైవేల సినిమాల్లో గొప్ప సినిమాలు అనదగ్గవి యాభైకి మించి వుండకపోవచ్చు.

మన సామాజిక వ్యవస్థ అన్యాయము, అసమానతలు (కుల వివక్ష, జెండర్ వివక్ష, ఆర్థికం, మత వివక్ష మొ॥), దోపిడీ, పీడన, హింస, అవినీతి, మౌఢ్యము, మోసముతో కూడి వుంది. వీటిపట్ల నిరసన, వ్యతిరేకత, తిరుగుబాటును ప్రేక్షకుల చైతన్యంతో ఉద్దీపన చేయ ప్రయత్నించే సినిమాను గొప్ప సినిమాగా చెప్పవచ్చు.

1940-60 కాలాన్ని భారతీయ సినిమా స్వర్ణయుగం అని పేర్కొంటారు. వ్యాపార సినిమాకు భిన్నమైన ఆలోచనాత్మకమైన, విమర్శనాత్మకమైన సమాంతర సినిమా ప్రధానంగా బెంగాల్ సినిమా చూపిన ప్రత్యామ్నాయ బాటతో రూపొందిన కాలమది. రిత్విక్ ఘటక్ సినిమా నాగరిక్, బిమల్‌రాయ్ దోబిఘా జమీన్, సత్యజిత్ రే అపుట్రయాలజి, హిందీలో చేతన్ ఆనంద నీచానగర్ మొ॥. తెలుగులో మాలపిల్ల, రైతుబిడ్డ (గూడవల్లి రామబ్రహ్మం) వంటి అభ్యుదయకర సినిమాలు తెలుగుసినిమా చరిత్ర తొలిదశల్లోనే రావడం విశేషమైన అంశం. ప్రత్యామ్నాయ సినిమా అనదగిన సినిమాలు 1960 తరువాత కూడా గణనీయంగానే వచ్చాయి. శ్యాంబెనగల్ అంకుర్ (దక్కని) ఉమామహేశ్వరరావు అంకురం (తెలుగు), నరసింగరావు మాభూమి, దాసి (తెలుగు) పఠాభి సంస్కార (కన్నడ), చెమ్మీన్ (మళయాళం), సలాం బాంబె (హింది) చోమనదుడి (కన్నడ), పింక్ (హిందీ) తమస్ (హింది) ఇవి మచ్చుకు కొన్ని-

ది గ్రేట్ డిక్టేటర్, మోడరన్ టైమ్స్ (ఛార్లీ చాప్లిన్), బాటిల్‌షిప్ పొటిమ్కిన్ (ఇసెన్‌స్టయిన్) ప్రీస్ట్ (టార్కొవిస్కీ), షిండ్లర్స్ లిస్ట్ (స్టీవెన్ స్పీల్‌బర్గ్) సినిమా రంగంలో

వచ్చాయి. అక్కడి నేపధ్యము, చరిత్ర, సినీ సాంకేతిక, తాత్విక చింతన వాటిని సాధ్యం చేసాయి.

వ్యాపార సినిమా సంవిధానంతో– నెలకొని వున్న దోపిడీ అస్తవ్యస్థ వ్యవస్థ పరిధి లోపలే మధ్యతరగతి వాళ్ళు వెతుకులాడే సాధారణ కోరికల సాఫల్య వైఫల్యాలను నేచురలిస్టిక్ కళా పద్ధతిలో చిత్రించే సినిమాలు మంచి సినిమా పేరున వ్యాప్తితో వున్నాయి. వాళ్ళ అంతరాత్మలను ఇబ్బంది పెట్టని పద్ధతిలో, సమాజ యధాతధ స్థితిని కలవరపరచని రీతిలో అవి వుంటాయి. వ్యవస్థలోని కల్లోలాలను విస్మరింపజేసే కేవలం వినోదాత్మక సినిమాలు ప్రేక్షకులను వర్గాతీతంగా రంజింప జేసేది మరొకరకం సినిమా.

ఈ పరిస్థితిలో గొప్ప సినిమాను ఆశించడం అత్యాశే. ప్రజల పక్షాన ఆలోచించే నిర్మాతలు, దర్శకులు కష్టనష్టాలకు సిద్ధపడి అప్పుడప్పుడు గొప్ప సినిమా కోవలోకో, దాని దరిదాపుల్లోకో వచ్చే సినిమాలను నిర్మిస్తున్నారు. అంతే తప్ప సినిమా అంటే మన చైతన్యాన్ని మానవత్వాన్ని మొద్దుబార్చే వ్యాపార సినిమాగానే అర్థం చేసుకుంటున్నాం. అదొక పీడక శక్తిగా తయారయింది. దోపిడీ వ్యవస్థ రక్షణకు పెట్టని గోడగా వుంది.

ఏ వ్యాపారానికైనా లక్ష్యం లాభమే. లాభమే లక్ష్యమైనప్పుడు మంచి చెడు విచక్షణకు తావుండదు. సినిమా సంస్కృతిగా తయారయి ప్రజల మెదళ్ళను తొలిచివేస్తున్న స్థితి ఏర్పడింది. కింది తరగతి, మధ్యతరగతి కష్టజీవుల్ని కలలలోకంలోకి నడిపించి జీవిత వాస్తవికత నుండి దృష్టి మళ్ళింపజేయాలనే ప్రయత్నమే వ్యాపార సినిమా. ఎవరో చెబితే ఆ సినిమాలు అలా తీస్తున్నారని భావించకూడదు. దోపిడీ వ్యవస్థ కళా ప్రపంచమది. ఆ వ్యవస్థ యథాస్థితిని సమర్థించడం, రక్షించడం దాని పని.

వ్యాపార సినిమా ఏ ఒక్క జీవిత సత్యాన్నీ వెల్లడించదు. మహా కళావేత్త చెహోవ్ అన్నట్లు మానవునికి తాను వాస్తవంగా ఎలా వున్నదీ చూపెడితే అతడు బాగుపడడానికి అవకాశముంటుంది. వ్యాపార సినిమాకు ఇది చుక్కెదురు.

ఎక్కువ మాటలాడేవాడు ఏమీ చెప్పలేడని ఒక నానుడి వుంది. వ్యాపార సినిమాలో డొల్ల ఇతివృత్తానికి అసంగత హంగులు రంగులు జోడించడం వుంటుంది. అదే దాని ఫార్ములా, మతమూఢ విశ్వాసాలు క్షుద్ర శక్తుల ఆరాధన, ఆడంబర వస్తు వినియోగ సంస్కృతి, చట్ట విరుద్ధ గూండా చర్యలను ఆకర్షణీయం చేయడం, నాసిరకం

వ్యక్తులను హీరో హీరోయిన్‌లుగా ప్రదర్శించడం, స్త్రీలను భోగ వస్తువులుగా అబలలుగా చూపడం, కామాన్ని ప్రేమగా చిత్రించడం, పురుషాధిపత్యాన్ని అర్థరహిత హింసను గొప్ప చేయడం తదితర హీన ప్రవర్తనల మసాలా కూడలిగా వ్యాపార సినిమా ఊరేగుతున్నది. ఇక సినిమా హిరోల (నిజానికి జీరోల) అభిమాన సంఘాల వెర్రివేషాల బానిసబుద్ధి భారతదేశంలో మాదిరి ప్రపంచంలో బహుశా ఎక్కడా వుండదు. ఆ హీరోలు ఈ అండతో రాజకీయ రంగంలోకి ప్రవేశించి వీరంగం చేయడం కూడా చూస్తున్నాం. **వాస్తవ ప్రపంచమే ఒక అబ్సర్డ్ సినిమాలాగా వుందనిపిస్తుంది.**

ఉన్నవాళ్ళు, లేనివాళ్ళు, నిరక్షరాస్యులు, విద్యావంతులు అందరూ మసాలా వ్యాపార సినిమాను ఆదరిస్తున్నారంటే వాస్తవికతలోని మౌలిక వైరుధ్యాల్ని విస్మరింపజేసే లక్ష్యంలో అది విజయవంతమయిందని అర్థం. వ్యాపార సినిమా తనే ఒక దుష్ట సంస్కృతిగా మన నెత్తిన కూచున్న శోచనీయ పరిస్థితి వుంది. ఇది మారాలంటే, మనల్ని ఆలోచనాపరుల్ని చేసే, ఉన్నత మానవీయ, నైతిక విలువల్ని ప్రసారం చేసే, మాధ్యమంగా సినిమా రూపొందాలంటే సమాజంలో ఒక విప్లవం జరగాలి. ఆ విప్లవానికి చేయూతనిచ్చేది ప్రజా కళారూపాలు, వీధి నాటకాలే. **సినిమా ప్రజాకళ కాదు. అది కార్పొరేట్ కళ.** అయితే సినిమాను గొప్ప ఆదర్శాల ప్రకటనకు మాధ్యమం చేసుకొనే ప్రయత్నం గొప్ప నిర్మాతలు, దర్శకులు అడపాదడపా ప్రయత్నిస్తూనే చేస్తున్నప్పటికీ చాలా విలువైనవి.

'మా భూమి' నాటకం నిషేధానికి గురైంది. 'మాకొద్దీ తెల్ల దొరతనం' పాట నిషేధానికి గురైంది. సినిమా వినోద సాధనమే గాని, చైతన్య సాధనం కాదనీ, సినిమా వల్ల దోపిడీ వ్యవస్థకేమీ భంగం కలగదనీ పాలక వర్గాలు భావిస్తున్నాయి. అంత గొప్ప కళాప్రక్రియ ఈ విధంగా పరిణమించడం ఒక వైచిత్రి (పారడాక్స్) కాదా?

ఈ వైచిత్రిని విశ్లేషించవలసిన అవసరం ఉంది.

18. అవరోధాల మధ్య అస్తిత్వాన్ని నిలుపుకున్న ఫిలిం సొసైటీ ఉద్యమం

– వారాల ఆనంద్, కరీంనగర్ ఫిల్మ్ సొసైటీ, సెల్ : 9440501281

ఉత్తమ సినిమాల్ని జనసామాన్యంలోకి వ్యాపింపచేయడమూ, సామాజిక సమస్యలపైన బాధ్యతగా స్పందించడమే లక్ష్యాలుగా ఏడు దశాబ్దాల క్రితం ఫిలిం సొసైటీ ఉద్యమం ప్రారంభమైంది. తొలినాళ్ళలోనే సినిమా వ్యాపారమైపోయి సమాజం నుంచి, సామాజిక సమస్యల్నించి దూరమైపోతున్న నేపథ్యంలో సామాజిక దృక్పథం కల రచయితలు, చిత్రకారులు, డాక్యుమెంటరీ చిత్ర నిర్మాతలు ప్రధానంగా ఈ ఫిలిం సొసైటీ ఉద్యమానికి నాంది పలికారు. సినిమా మాధ్యమం నిర్వర్తించాల్సిన మౌలిక బాధ్యతని, దాని శక్తి సామర్థ్యాల్ని గుర్తెరిగినవారు సినిమాని ఒక శక్తివంతమైన సామాజిక మాధ్యమంగా రూపుదిద్దే క్రమంలో ఈ ఫిలిం సొసైటీ ఉద్యమానికి పాదులు వేశారు. అంతర్జాతీయంగా అనేక దేశాల్లో ఫిలిం క్లబ్బులుగా మొదలైన ఈ ఉద్యమం ఉత్తమ చిత్రాల నిర్మాణం, పంపిణీ, సాధికారమైన సినీ విమర్శలను అభివృద్ధి పరిచే దిశగా ముందుకు సాగింది. కొన్నిచోట్ల ఈ సినిమాల్ని ప్రదర్శించేందుకు థియేటర్లను నిర్మించే క్రమంలో కూడా ఈ ఫిలిం సొసైటీలు కృషి చేశాయి.

ఆ క్రమంలో మొట్టమొదటి ఫ్రెంచ్ సినీ క్లబ్ 1924లో ప్రారంభమైంది. తర్వాత 1925లో బ్రూనే తదితరుల చొరవతో లండన్‌లో ఫిలిం సొసైటీ ప్రారంభమైంది. దాదాపు అదే కాలంలో ఓస్టెండీ (బెల్జియం)లో హెన్రీస్టార్క్, అమ్‌స్టర్‌డామ్‌లో జోరిస్ ఇవన్స్ ఫిల్మ్ సొసైటీని ఆరంభించారు. ఇక జపాన్‌లో ప్రొలిటెరియన్ ఫిల్మ్ అండ్ ఫోటో లీగ్ 1930లో ప్రారంభించారు. ఇలా దాదాపు ఏకకాలంలోనే వివిధ దేశాల్లో ఏర్పాటైన ఫిలిం సొసైటీల నిర్వాహకులు డాక్యుమెంటరీ చిత్ర నిర్మాణ రంగంలో విశేషించి కృషి చేశారు. జాన్ గ్రేర్‌సన్ 'డ్రిస్టర్', వాల్టర్ రుటెమన్ 'బెర్లిన్ సింఫనీ ఆఫ్ గ్రేట్ సిటీ', జీన్‌విగో 'పోపస్ డె నైస్' హెన్రీ స్టార్క్' 'ఇమేజెస్ డీ ఓస్టండీ', జోరిస్ ఇవెన్స్ 'ది బ్రిడ్జి ఇలా ఎన్నో లఘు చిత్రాలు తొలి రోజుల్లో ఫిలిం సొసైటీల్ని నిర్వహించిన దర్శకులు నిర్మించారు.

ఇలా చిత్ర నిర్మాణ రంగంపైన కృషి చేస్తూనే ఫిలిం సొసైటీలు ఉత్తమ సినీ విమర్శపైన కూడా దృష్టి నిలిపారు. అయితే ఆ విమర్శ 'ప్రచార విమర్శకు' భిన్నంగా సర్వస్వతంత్రమైనదిగా ఎదిగి నిలిచింది. ఈ క్రమంలో ఫ్రెంచ్ ఫిలిం క్లబ్ ఆద్యుల్లో ఒకరైన లూయిస్ డిల్లూక్ ఉత్తమ విమర్శకుడిగా ఎదిగాడు. ఫ్రాన్స్‌లోని ఫిలిం సొసైటీల సమాఖ్య 'సినిమా' పేర జర్నల్‌ను వెలువరించింది. ఇక బ్రిటీష్ ఫిలిం ఇన్‌స్టిట్యూట్ వారి సైట్ అండ్ సౌండ్ జర్నల్ ప్రధానంగా ఇంగ్లాండ్‌లోని ఫిలిం సొసైటీ సభ్యులపైనే ఆధారపడి నడిచింది. అలాగే న్యూయార్కు ఫిలింలీగ్ 'ఫిల్మ్‌ఫ్రంట్'ని. ఆక్స్‌ఫర్డ్ ఫిల్మ్ సొసైటీ 'సీక్వెన్స్'ని. లింకన్ ఫిలిం సొసైటీ ఫిల్మ్ కామెంట్, బ్రిటిష్ ఫిలిం సొసైటీల సమాఖ్య 'ఫిల్మ్', స్వీడిష్ సమాఖ్య 'ఫిల్మ్ రుటన్' లను వెలువరించాయి. ఈ పత్రికలన్నీ అంతర్జాతీయ స్థాయిలో ఉత్తమ సినిమా విమర్శకు పాదులువేసి ప్రఖ్యాతి వహించాయి. ఇలా ప్రపంచవ్యాప్తంగా విలసిల్లుతున్న ఫిలిం సొసైటీల సంస్కృతి ప్రభావంతో మన దేశంలో మొట్టమొదటి ఫిలిం సొసైటీ 22 ఏప్రిల్ 1937లో 'అమెచ్యూర్ ఫిలిం సొసైటీ' పేర బాంబేలో ప్రారంభమైంది. అప్పటి ఇలస్ట్రేటెడ్ వీక్లీ సంపాదకులుగా వున్న డెరిక్ జెఫరిస్, స్టాన్లీ జెప్సన్, కళా విమర్శకుడు నాన్ లేడెన్, లఘు చలనచిత్రకారుడు డా. పి.వి. పతిలు ఈ సొసైటీ స్థాపనలో ప్రధాన భూమికను నిర్వహించారు. ఆ తర్వాత క్లెమెంట్ బాప్తిస్టా, విజయ్‌కర్, హాకిన్స్, జె.బి. హెచ్. వాడియాల నేతృత్వంలో 1942లో బాంబే ఫిలిం సొసైటీ ప్రారంభమైంది.

ఆ తర్వాత 1947లో సత్యజిత్ రే, చిదానంద్‌దాస్ గుప్తా, నిమాయ్ ఘోష్‌ల నేతృత్వంలో కలకత్తా ఫిలిం సొసైటీ మొదలైంది. ఈ సొసైటీ తమ కార్యక్రమాలతో భారతీయ నవ్య సినిమా ఉద్యమంపైన అద్వితీయమైన ప్రభావాన్ని చూపించింది. ఈ సొసైటీ వెలుగునుంచి సత్యజిత్‌రే, నిమాయ్ ఘోష్, మృణాల్‌సేన్, రిత్విక్‌ఘటక్ లాంటి మహా దర్శకులు, సుబ్రతోమిత్ర లాంటి ఛాయా చిత్రకారుడు, చిదానందదాస్ గుప్త లాంటి సినీ విమర్శకుడు ప్రభవించారు. ఈ సొసైటీ కార్యక్రమాల్లో రినోయర్ పొడొన్‌కిన్ లాంటి అంతర్జాతీయ ఖ్యాతి నార్జించిన దర్శకులు ఉపన్యాసాలిచ్చారు. కలకత్తా ఫిలిం సొసైటీ కార్యక్రమాల్నించి ఉత్తేజితులై అనంతర కాలంలో ఢిల్లీ, ఆగ్రా, బాంబే, మద్రాస్, కలకత్తా లాంటి నగరాల్లో మరిన్ని ఫిలిం సొసైటీలు

ప్రారంభించబడ్డాయి. 1952లో బొంబాయిలో మొట్టమొదటి భారతీయ అంతర్జాతీయ చలనచిత్రోత్సవం జరగడంతో మొత్తంగా భారతీయ చలనచిత్ర 'గతి' మారిపోయింది. దాని ప్రభావంతోటే 'చిన్నమ్మూల్', పథేర్‌పాంచాలి' లాంటి చిత్రాలు వచ్చాయి. 1956లో మెరీషెటన్ ఇంద్రపురి స్టూడియోలో చేసిన ప్రసంగ పరంపర ఆనాటి వర్ధమాన చలనచిత్ర ఉత్సాహకులకి గొప్ప ప్రేరణగా నిలిచింది. అలా వివిధ ప్రాంతాల్లో కార్యక్రమాలు నిర్వహిస్తున్న ఫిలిం సొసైటీల్ని సమన్వయం చేసేందుకుగాను ఏడు సొసైటీల ప్రతినిధులు 1959 డిసెంబర్‌లో న్యూఢిల్లీలోని కృష్ణకృపలాని ఇంట్లో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఫలితంగా ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీస్ ఆఫ్ ఇండియా ఏర్పాటైంది. ఆ సమాఖ్యకు సత్యజిత్‌రే అధ్యక్షుడిగా ఎన్నికై ఆజన్మాంతం అధ్యక్షుడుగానే కొనసాగారు. శ్రీమతి ఇందిరాగాంధీ ఉపాధ్యక్షురాలై 1967 వరకు సమాఖ్యతోనే ఉన్నారు. విజయామూలే, ఉషాబగత్, ఐ.కె. గుజ్రాల్‌లు ప్రధాన భూమికను పోషించారు. అనంతరం ఫెడరేషన్‌కి విజయామూలే అధ్యక్షులుగా వున్నారు. ఫిలిం సొసైటీల సమాఖ్య నేటికీ నూతనోత్తేజంతో పనిచేస్తూ దేశ విదేశీ చలనచిత్రాలు తన సభ్యత్వ సొసైటీలకు పంపిణీచేస్తూ విశేషకృషి నల్పుతోంది.

ఫెడరేషన్ తూర్పు, పశ్చిమ, ఉత్తర, దక్షిణ ప్రాంతాలుగా ఏర్పాటై ఫిలిం సొసైటీల్ని సమన్వయం చేస్తూ ముందుకు సాగుతున్నది. దక్షిణాది సమాఖ్య అనేక ఏళ్ళపాటు చెన్నై కేంద్రముగా కృషి చేయగా ఇటీవలే దాని కార్యాలయం హైదరాబాద్‌కు తరలివచ్చింది. ప్రస్తుతం బి.హెచ్.ఎస్.ఎస్. ప్రకాశ్‌రెడ్డి ప్రాంతీయ కార్యదర్శిగా పనిచేస్తున్నారు. కమిటీలో వారాల ఆనంద్, యువిఎస్ఆర్ ఆంజనేయులు, రాజశేఖర్‌రెడ్డి, కెఎస్ ఆనంద్ తదితరులు దక్షిణాది రాష్ట్రాల ప్రతినిధులుగా తమ సేవలు అందిస్తున్నారు. దీంతో ఫెడరేషన్‌లో ఆంధ్రప్రదేశ్ ప్రాముఖ్యత విశేషంగా పెరిగింది. అదలావుండగా ఫిలిం సొసైటీలు స్వంతంగా కొన్ని డాక్యుమెంటరీల్ని కూడా నిర్మించాయి. కలకత్తా ఫిలిం సొసైటీ చిదానంద్ దాస్ గుప్తా దర్శకత్వంలో 'పోర్ట్రయిట్ ఆఫ్ ఎ సిటీ' అన్న లఘు చిత్రాన్ని నిర్మించింది. ఇక కేరళలో త్రివేండ్రమ్‌కు చెందిన చిత్రలేఖ ఫిలిం సొసైటీ ఒక సహకార చిత్ర సొసైటీని ఏర్పాటు చేసుకుని చిత్రాలు నిర్మించింది. ఆ సంస్థ అదూరు గోపాలకృష్ణన్ దర్శకత్వంలో మొదట 'స్వయంవరం' నిర్మించింది. అది జాతీయ స్థాయిలో ఉత్తమ చిత్రం

అవార్డును అందుకోగా తర్వాత సంవత్సరం 'కొడియాట్టం' నిర్మించారు. ఇలా ఫిలిం సొసైటీ ఉద్యమం బెంగాల్, కేరళలో పుంజుకుని పనిచేస్తూ ఉండగా కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు, బాంబే, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో సైతం విశేషంగానే పనిచేస్తున్నాయి. ఫిలిం సొసైటీల సమాఖ్య కేంద్ర ప్రభుత్వంపైన వత్తిడి తెచ్చి ప్రపంచంలోని ఏ చిత్రమైనా సెన్సార్‌కు గురికాకుండా నేరుగా ఫిలిం సొసైటీలు ప్రదర్శించుకునేందుకు అనుమతిని సాధించిపెట్టింది. ఇంకా రాష్ట్రాల్లో ఫిలిం సొసైటీల ప్రదర్శనలకు వినోదపు పన్నును మినహాయించే పద్ధతిని కూడా ఫెడరేషన్ సాధించగలిగింది. చివరికి మన రాష్ట్రంలో వినోదపు పన్ను స్లాబ్‌కు మార్చినపుడు ఫిలిం సొసైటీల ప్రత్యేక ప్రదర్శనలకు పన్ను మినహాయింపును ప్రత్యేకంగా సాధించగలిగారు.

క్రమక్రమంగా విస్తృతిని సాధించుకున్న ఫిలిం సొసైటీ ఉద్యమం మన రాష్ట్రంలో కూడా 80వ దశకంలో ఉచ్ఛస్థాయిలో పనిచేసింది. ఆ రోజుల్లో మన రాష్ట్రంలో 70–80 సొసైటీలు పనిచేస్తుండగా మారుమూల ప్రాంతమైన కరీంనగర్ జిల్లాలోనే 8 సొసైటీలు పనిచేసేవి. అయితే రాష్ట్రంలో ప్రధానంగా హైదరాబాద్ ఫిలిం క్లబ్, విజయవాడ, విశాఖ, కరీంనగర్, వరంగల్ ఫిలిం సొసైటీలు ప్రధాన భూమికను పోషిస్తూ మిగతా సొసైటీలకు మార్గదర్శకంగా పనిచేశాయి. మన రాష్ట్రంలో 1963లో హైదరాబాద్ ఫిలిం సొసైటీ ప్రారంభమైంది. ఆ తర్వాత సినిమా సర్కిల్, ఆర్.ఆర్. లాబ్స్ ఫిలిం సొసైటీ లాంటివి వచ్చాయి. తర్వాత 1974లో హైదారాబాద్ ఫిలిం క్లబ్ ఏర్పాటై తన రజతోత్సవం నిర్వహించుకుంది. ఆంధ్ర ప్రాంతంలో విజయవాడ ఫిలిం సొసైటీ (1973), ఉత్తరాంధ్రలో విశాఖ ఫిలిం సొసైటీ, తెలంగాణలో వరంగల్ (1975), కరీంనగర్ (1978) ఫిలిం సొసైటీలు ఏర్పాటయ్యాయి.

హైదరాబాద్ ఫిలిం క్లబ్ మొదట్లో ఫిలిప్ కార్యదర్శిగా కొన్ని కార్యక్రమాలు నిర్వహించగా ఫిలిప్ దక్షిణ భారతీయ ఫిలిం సొసైటీల కార్యవర్గంలో పనిచేశారు. తర్వాత ఫిలిం క్లబ్ బి.హెచ్.ఎస్.ఎస్. ప్రకాశ్‌రెడ్డి ఆధ్వర్యంలో మొత్తం రాష్ట్రంలోనే మార్గదర్శకమైన ఫిలింక్లబ్‌గా రూపుదిద్దుకుంది. రే ఫిలిం ఫెస్టివల్, బిమల్‌రాయ్, కాసరవెల్లి తదితరుల ఫెస్టివల్స్‌తోపాటు వివిధ దేశాల సినిమాలతో ఎప్పటికప్పుడు ఉత్సవాలు నిర్వహిస్తూ ముందుకు సాగుతోంది. ప్రస్తుతం దర్శకులు బి. నరసింగరావు

అధ్యక్షుడిగా ఉన్న ఈ క్లబ్ తన 30 ఏళ్ళ జీవితంవైపు ఉరకలు వేస్తోంది. ఇక రెండు దశాబ్దాలపాటు అవిశ్రాంతంగా పనిచేసిన విజయవాడ ఫిలిం సొసైటీ ఐ.ఎస్.కె. దేవరాయలు, కృష్ణమోహన్, కృష్ణకిషోర్ తదితరుల నేతృత్వంలో జాతీయ అంతర్జాతీయ చలనచిత్రోత్సవాలు నిర్వహించి పేరుగడించింది. విశాఖలో 1973–74లో ప్రొఫెసర్ వేణుగోపాలరావు, పంకి, హన్మంతరెడ్డిల నేతృత్వంలో ఏర్పాటైన ఫిలిం సొసైటీ చాలా ఏళ్ళు విజయవంతంగా పనిచేసింది. తర్వాత బాపట్ల (1975), నరసారావుపేట (1978), కోనసీమ ఫిలిం సొసైటీ, అమలాపురం, నెల్లూరు ఫిలిం సొసైటీ, మచిలీపట్నం పట్టణంలో చైత్రిక, ఒంగోలులో సినీమనోభిరామం, ఇంకా చీరాల, గుంటూరు, గుడివాడ, కాకినాడ, భీమవరం, రాజమండ్రి, అనకాపల్లి, కావలి తదితరమైన చోట్ల ఫిలిం సొసైటీలు ఏర్పాటై కొంతకాలం పనిచేశాయి. తిరుపతి, తెనాలి, నెల్లూరు, కర్నూలు సొసైటీలు ప్రస్తుతం పనిచేస్తున్నాయి. ఇక తెలంగాణా జిల్లాలో వరంగల్ ఫిలిం సొసైటీ శ్రీనివాసరావు, శ్యాంసుందర్‌రావు, నవీన్, నాగభూషణంల నేతృత్వంలో విజయవంతంగా పనిచేస్తుంది. కరీంనగర్ ఫిలిం సొసైటీ నవీన్, డి. నరసింహారావుల నేతృత్వంలో మొదలై ఎన్. శ్రీనివాస్, గోపు లింగారెడ్డి, ఆర్. రాములు తదితరుల నేతృత్వంలో ముందుకు సాగింది.. అనంతరం ఎడమ నారాయణరెడ్డి, టి. రాజమౌళి, వి. రామేశం, కె. రామచంద్రారెడ్డి, సి.హెచ్. వేణుగోపాల్, రావికంటి మురళి తదితరుల సారధ్యంలో కొనసాగింది. గ్రామీణ చలనచిత్రోత్సవం, బాలల చిత్రోత్సవాలు, అప్రిసియేషన్ కోర్సులు తదితరమైన వాటితో అవిరళ కృషి సల్పుతోంది. ఇంకా వేములవాడ, సిరిసిల్ల, గోదావరి ఖని, హుజురాబాద్, ఎల్లారెడ్డిపేట తదితరచోట్ల ఫిలిం సొసైటీలు ఏర్పాటై కొంతకాలం పనిచేశాయి. ఇలా కేవలం మన రాష్ట్రంలోనే కాకుండా కేరళ, తమిళనాడు తదితరమైన అనేక రాష్ట్రాల్లో 80వ దశకం చివరి వరకు ఫిలిం సొసైటీల ఏర్పాటు నిర్వహణ ఉధృతంగా సాగింది. ఉత్తమ సినిమాను ప్రజల్లోకి తీసుకెళ్ళే 'సమాంతర పంపిణీ వ్యవస్థ'గా రూపుదిద్దుకునే క్రమంలో అది రూపొందింది. కాని 90ల తర్వాత సొసైటీలు క్రమంగా వెనకడుగు వేయడం లేదా మూతబడడం ప్రారంభమైంది. **'మన జాతీయ సంస్కృతిలో ఇవి అంతర్భాగం'** అని సతీష్ బహదూర్ విశ్లేషించి చెప్పిన ఈ ఉద్యమం ప్రధానంగా మంచి చిత్రాలు ఎక్కువగా అందుబాటులో లేకపోవడం, శాటిలైట్ టీవీ నట్టింట్లో తిష్టవేసి కూర్చోవడం, తమ సభ్యులకు చిత్రాల్ని ప్రదర్శించేందుకు

అనువైన సినిమా హాళ్లు లభించకపోవడం వీటన్నింటిని మించి సినిమాల్లో సీరియస్‌నెస్‌ని, కళాత్మకతని అభినందించే తత్వం సభ్యుల్లో కొరవడ్డం లాంటి కారణాల వల్ల కుంటుపడిందని తోస్తోంది. మంచి చిత్రాల నిర్మాణం, ఫిలిం సొసైటీ ఉద్యమం రెండూ సమాంతరంగా సాగాల్సిన అంశాలు. రే, మృణాల్‌సేన్, అదూర్, జాన్ అబ్రహాం లాంటి అనేకమంది దర్శకులు ఫిలిం సొసైటీల నుంచే ఎదిగినప్పటికీ అలాంటి వారి చిత్రాల సంఖ్య తక్కువగా వుండడం ఒకటీ ఆరా వచ్చినా అవి అందుబాటులో లేకపోవడం సొసైటీ నిర్వహణకు తీవ్రమైన ఆటంకంగా తయారైంది. మంచి చిత్రాలకు ఫైనాన్స్ చేయాల్సిన ఎన్.ఎఫ్.డి.సి. లాంటి జాతీయ సంస్థలు శుద్ధ వ్యాపార సంస్థలుగా మారిపోయి 300–500 రూపాయలకు లభించే చిత్రాల రెంటల్స్ ప్రస్తుతం 1500కు పెరగడం గ్రామీణ ప్రాంతాల్లోని ఫిలిం సొసైటీలకు ఆశనిపాతంలా తయారైందని సొసైటీ నిర్వాహకులు వాపోతున్నారు. టి.వి. ప్రభావం ఎంతగా ఉందంటే సభ్యుల్ని సినిమా హాళ్ళకు రప్పించడమే గగనమైపోతోందని ఫిలిం సొసైటీ నిర్వాహకులు అంటున్నారు.

అయితే చిత్రాల ప్రదర్శనకు ఫిలిం సొసైటీలు కమర్షియల్ థియేటర్లపైన ఆధారపడి ఉండడం మరో ప్రధాన అవరోధంగా ఉంది. సొసైటీల చిత్ర ప్రదర్శనలకు మినీ థియేటర్ల అవసరం ఎంతైనా ఉంది. ఈ సమస్యలిలా ఉండగా ఫిలిం సొసైటీలు అధిక శాతం చిత్రాల్ని ప్రదర్శించి చేతులు దులుపుకొంటున్నాయి. వాటిపైన రెగ్యులర్ చర్చలు, సెమినార్లు నిర్వహించకపోవడంతో సభ్యుల్లో ఫిలిం అప్రిసియేషన్ పెరగడం లేదు. ఫలితంగా వారిలో అవగాహన కొరవడి ఉత్సాహం నెమ్మదిస్తోంది. ఇంకా అధిక శాతం సొసైటీల కార్యక్రమాలు మధ్య, ఉన్నత తరగతి మేధావులకే పరిమితం కావడంతో అది మేధావుల వినోదంలా తయారైంది. సొసైటీల చిత్ర ప్రదర్శన సామాజిక బాధ్యతగానూ, ఒక సోషల్ ప్రొటెస్ట్ దిశగానూ మరలితే పరిస్థితి మరింత మెరుగయ్యే అవకాశం ఉంది. మొత్తంమీద ఫిలిం సొసైటీల కార్యక్రమాలు మరింత విస్తృతమై అత్యధిక ప్రజల వద్దకు చేరగలిగినపుడే నూరు పూవులై వికసిస్తాయి.

(24 ఫ్రేమ్స్ నుంచి)

19. బాల్యంపై మంచి సినిమాల ప్రభావం అవశరం

– పాకం కృష్ణమూర్తి, చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ, తిరుపతి
సెల్ : 9700262666

మాది రీల్స్ అనే స్వచ్ఛంద సంస్థ. గత కొద్ది సంవత్సరాలుగా తిరుపతి కేంద్రంగా పిల్లలకి ఫిల్మ్ ఫెస్టివల్స్ నిర్వహిస్తున్నాం. అంతర్జాతీయ పిల్లల సినిమా ఇంటర్నేషనల్ చిల్డ్రన్ ఫిల్మ్ సొసైటీ ఉభయ తెలుగు రాష్ట్రాల్లో కమిటీ సభ్యత్వం మాకొక్కరికే ఉంది. హైదరాబాద్‌లో జరిగే పిల్లల చలన చిత్రోత్సవాల్లో మేమూ భాగస్వాములం. మంచి సినిమాలు చిన్నారులపై ఆశాజనక ప్రభావం చూపుతాయనేది మా అభిప్రాయం. మార్పనేది హృద్యంగా వ్యక్తీకరించే అనుభూతుల ద్వారా పసి హృదయాల్లో రావాల్సిన పరిమితే కాని, హఠాత్తుగా సంభవించేది కాదు. పిల్లల మనస్సులు చాలా స్వచ్ఛంగా ఉంటాయి. బాల్యంలోనే వారికి మంచి సినిమాల ద్వారా మంచి విషయాన్ని బోధిస్తే జీవితాంతం ఆ విలువలతో జీవించడానికి ఎంతోకొంత ప్రయత్నిస్తారనే ఆశతో కృషి చేయాల్సిన అవసరం ఉంది. అందులో భాగంగా, మంచి సందేశాత్మక భావోద్వేగాల్ని మానవీయ కోణంలో స్పృశించే భిన్న భాషా సినిమాలని పసిహృదయాల దరికి చేర్చగలగాలి. ప్రభుత్వం సహకారంతో చిత్తూరు, కడప, అనంతపురం జిల్లాల్లోని గ్రామాల్లోనూ, మండల కేంద్రాల్లోనూ అనేక పాఠశాలలు, హైస్కూళ్ళలో మంచి చిత్రాలని ప్రదర్శిస్తుంటాం. ఎన్.జి.వో.గా ఇంకా వివిధ కార్యక్రమాలలో భాగస్వాములౌతాం. పర్యావరణం, విద్య, స్వయం సహాయక సంగాలు, మానవ హక్కులు, గ్రామీణాభివృద్ధి వంటి రకరకాల అంశాల్లో కృషి చేయడం జరుగుతోంది. మంచి సినిమాలు మరిన్ని నిర్మితమవ్వాలని, పిల్లల్ని దృష్టిలో పెట్టుకుని సినిమాలు తీయాలని మేం కోరుకుంటున్నాం.

20. అవును - మళ్ళీ కావాలి ఫిల్మ్ సొసైటీలు

- కొత్తపల్లి రవిబాబు, జనసాహితి
సెల్ : 9490196890

లూమియర్ సోదరులు 1895 డిశంబరులో పారిస్‌లో మొట్టమొదటిసారిగా కదిలే బొమ్మలను చూపించారు. ఆ తర్వాత 25 ఏళ్ళకు, 1920లో పారిస్‌లోనే ప్రపంచంలోనే మొట్టమొదటి ఫిల్మ్‌క్లబ్బును ఏర్పాటు చేశారు. మూడేళ్ళ కాలంలో 20 ఫిల్మ్‌సొసైటీలు ఫ్రాన్స్‌లో పనిచేయడం ప్రారంభించాయి. 1925 అక్టోబర్ 25న లండన్లో మొదటి ఫిల్మ్‌సొసైటీ అవతరించింది. హెచ్.జి.వెల్స్, బెర్నార్డ్‌షాలు కూడా దీనిలో సభ్యులుగా చేరారు. రెండవ ప్రపంచ యుద్ధ కాలంలో 1939 నుండి 1944 వరకు ఫిల్మ్ సొసైటీలు పనిచేయలేదు. 1945లో ఫ్రాన్స్‌లో ఫిల్మ్‌సొసైటీల సమాఖ్య ఏర్పడింది. ఇండియాలో 1959లో ఇటువంటి సమాఖ్య ప్రారంభమైంది. అయితే మొదట ఫిల్మ్‌సొసైటీ మనదేశంలో 1937లో ముంబాయిలో ఏర్పడింది. దీని సభ్యత్వ రుసుం ఏడాదికి పన్నెండు రూపాయలు. 1947లో కలకత్తా ఫిల్మ్ సొసైటీ ప్రారంభమైంది. ఫిల్మ్ సొసైటీ ఉద్యమాన్ని ముందుకు తీసుకువెళ్ళిన వారిలో ముఖ్యులు సత్యజిత్‌రాయ్. దేశంలో రిజిష్టరైన ఫిల్మ్ సొసైటీలతో భారత్ ఫిల్మ్ సొసైటీల సమాఖ్య ఏర్పడి, పారిస్‌లోని అంతర్జాతీయ సమాఖ్య సభ్యురాలుగా చేరింది. ఈ అంతర్జాతీయ సంస్థ యు.ఎన్.ఓ.కు చెందిన యునెస్కోకు అనుబంధంగా వుంది.

1960-80లలో తెలుగునాట చాలా పట్టణాలలో ఫిల్మ్ సొసైటీలు ఏర్పడ్డాయి. వీటిలో కరీంనగర్ ఫిల్మ్‌సొసైటీ సొంత ఆడిటోరియం నిర్మించుకొని ఈనాటికీ చురుకుగా పనిచేస్తోంది. 1965 నాటికే బరంపురం ఫిల్మ్‌సొసైటీ 27 లక్షల ఖర్చుతో రిత్విక్ సదన్ ఆడిటోరియాన్ని నిర్మించుకొని పనిచేస్తోంది!

చురుకుగా పనిచేసిన విశాఖపట్టణం, విజయవాడ, తెనాలి, కాకినాడ, రేపల్లె మొదలైన సొసైటీలు క్రమంగా కార్యక్రమాల నిర్వహణలో వెనుకపట్టు పట్టాయి. కారణాలు అనేకం. సభ్యుల వద్ద రుసుం వసూలు చేయడంలో వచ్చే ఇబ్బందులు, సరైన సమయంలో ఉచితంగా సినిమాలు దొరక్కపోవడం, టి.వి., వి.సి.ఆర్., విసిడిలు రావడంతో సభ్యులలో ఆసక్తి తగ్గడం లాంటి కారణాలు ఎన్నో ఉన్నాయి.

ఫిల్మ్ సొసైటీల త్రిముఖ కర్తవ్యాలు చూద్దాం. 1. అంతర్జాతీయంగా ప్రసిద్ధి చెందిన సినిమాలను సభ్యులకు చూపించడం, 2. కార్యశాలలు (వర్క్‌షాప్) ద్వారా చలనచిత్రాల విశ్లేషణ నేర్చుకోవడం. 3. భారతీయ చలన చిత్రాలను సంపాదించి ప్రదర్శించడం. పూనా ఫిల్మ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఫిల్మ్ అప్రీసియేషన్ కోర్స్ వుంది. అంటే చలన చిత్రాలను ఏ విధంగా బేరీజు వేయాలి అనేదానిని నేర్పే చదువన్నమాట. గత సంవత్సరంలో మరణించిన నందగోపాల్ ఆ కోర్సుకు హాజరై, రేపల్లెలో మా మిత్ర బృందానికి ఆ విశేషాలు చెప్పేవారు.

థియేటర్లలో సినిమా చూడటానికీ, ఫిల్మ్ సొసైటీలో ప్రదర్శించే సినిమాలు చూడటానికీ ఒక మౌలికమైన తేడా వుంది. థియేటర్‌లో ప్రేక్షకులు ఎవరికి వారే వ్యక్తిగతంగా చిత్రాన్ని చూస్తారు. ఫిల్మ్ సొసైటీలో సినిమా చూడటమనేది ఒక సామూహిక కార్యక్రమం. చూసిన తర్వాత ఏర్పాటు చేసే సమీక్ష సమావేశంలో ఆ చిత్రంపై చర్చోపచర్చలు, నిశిత పరిశీలనా, సమీక్షలు, విమర్శలు వుంటాయి. ఫిల్మ్ సొసైటీ కార్యక్రమాల్లో ఈ అంశం ప్రధానమైంది. ఈ చర్చల వల్ల సభ్యులు ఏ ఇతర సినిమా చూసినా, విశ్లేషణాత్మకంగా చూడటం జరుగుతుంది.

కొన్ని ఫిల్మ్ సొసైటీలు సినిమా థియేటర్లపై ఆధారపడకుండా, 16 ఎమ్‌ఎమ్ ప్రొజెక్టర్లను ఉపయోగించి సభ్యులకు సినిమాలను చూపించేవి. ఆ తర్వాత సెల్‌ఫోన్‌లోనూ, కంప్యూటర్లలోనూ సినిమాలు చూడగల్గే అవకాశం వచ్చిన తర్వాత థియేటర్లకు వెళ్ళే ప్రేక్షకులు గణనీయంగా తగ్గిపోయారు. ఇక ఫిల్మ్ సొసైటీలకు ఎవరు వస్తారు. ఫలితం ఫిల్మ్ సొసైటీలన్నీ మూసివేసుకోవడం. ఇదిగో ఇప్పుడు మన స్థితి ఇది.

ఇప్పుడు ఫిల్మ్ సొసైటీల పునరుద్ధరణ, వాటిలో నూతనంగా జవం, జీవం నింపడం మొదలైన విషయాలు మనముందు నిలుస్తాయి. కేవలం సినిమాలు చూడటమే ధ్యేయమైతే సెల్‌ఫోన్‌లోనో, కంప్యూటర్లోనో, చూడవచ్చు. కానీ విశ్లేషణాత్మకంగా సినిమాను చూడటమనేది ఇప్పుడు సొసైటీల ద్వారా మాత్రమే సాధ్యమౌతుంది.

ఇప్పుడు ఎల్.సి.డి. ప్రొజెక్టర్లను ఫిల్మ్‌సొసైటీలు వాడుకొని, మారుమూల ప్రాంతాల్లో కూడా చిత్రాలను ప్రదర్శించే అవకాశం వుంది. సందేశాత్మకమైన లఘు చిత్రాల ప్రదర్శన సాధారణ థియేటర్లలో సాధ్యం కాదు. అయితే గతంలో తక్కువ బడ్జెట్‌తో సందేశాత్మకంగా తీసిన సినిమాలను ఆదివారం ఉదయం మాత్రం

ప్రదర్శించేవారు. ఇప్పుడు థియేటర్లు ఆ సదుపాయం ఇవ్వడం లేదు. వ్యాపార చిత్రాలే ఎన్ని షోలైనా వేసుకుంటున్నాయి.

70 లలో చైనా రాయబార కార్యాలయం సౌజన్యంతో చైనాలో నిర్మించిన ఫీచర్ ఫిల్మ్‌లను డా॥ కోట్నీస్ మెమోరియల్ కమిటీ ద్వారా తెలుగునాట సినిమాలను ప్రదర్శించారు. ఆ సందర్భంగా ముందుగానే కరపత్రాలుగా ముద్రించి పంచి పెట్టేవారు. అప్పుడు ప్రేక్షకులకు భాష ఒక అడ్డంకిగా లేకుండా పోయింది. కొన్ని ఫిల్మ్ సొసైటీలు (ఉదా: విశాఖ, విజయవాడ మొ॥) నెలకొక బులెటిన్‌ను ప్రచురిస్తూ తాము ప్రదర్శించబోయే చిత్రాలను పరిచయం చేస్తుండేవి. ఇప్పుడు బులెటన్లు కాకపోయినా, ఆయా చిత్రాల గురించి సాధ్యమైనంత వివరాలు ముందుగా సభ్యులకు, ప్రేక్షకులకు అందించడం అత్యవసరం.

సందేశాత్మకమైన, అభ్యుదయకరమైన, ప్రగతి శీలమైన చలన చిత్రాలను, లఘు చిత్రాలను ఆయా విద్యాసంస్థల అనుమతితో కళాశాలల్లోనూ, విశ్వ విద్యాలయాల్లోనూ ఆయా ప్రాంతాలకు ఫిల్మ్‌సొసైటీలు ప్రదర్శించే కార్యక్రమాలు తీసుకోవాలి. ఈనాటి యువతరంలో ఉన్నత ఆదర్శాలను, త్యాగపూరిత దీక్షను పెంపొందించడం అత్యవసరం. యువతరాన్ని ఫేస్‌బుక్, వాట్సప్‌లు లోని పనికిరాని కార్యక్రమాల వ్యామోహాన్నించి బయట పడేయాలి. ఫేస్‌బుక్, వాట్సప్‌లలో కూడా ప్రయోజనకరమైన విషయాలు లోడ్ అయ్యేట్లు చూడటం అవసరం. **మొత్తంమీద గ్రంథాలయాలకు తరలండి అనే కార్యక్రమంలాగా, ఫిల్మ్ సొసైటీలను అభివృద్ధి చేయండి అనే కార్యక్రమం కూడా చేబట్టడం ఈనాటి ఆలోచనా పరుల కర్తవ్యం.**

ప్రజానుకూల సాంస్కృతికోద్యమం గతంలో పాత జానపద కళారూపాలలో సమకాలీన వస్తువులను చొప్పించి ప్రజలను చైతన్యపరచింది. భారత, రామాయణ, భాగవత కథాంశాలతో నిండిన బుర్రకథలను, హరికథలను, యక్షగానాలను రైతాంగ, కార్మిక, దళిత సమస్యలు కథాంశాలుగా మార్చి ఆ కళారూపాలను ప్రజాపరం చేసాయి. నిజానికి ప్రజాకళారూపాలలో (జానపద కళారూపాలు) ప్రజల సమస్యలే వస్తువుగా వుండాలి. కాని వాటిలో దేవుళ్ళను, రాక్షసులను, రాజులను, రాణీలను, శృంగారాన్ని నింపిప్రజలను మాయపరచిన గతం మన ముందు వుంది. అయితే ఈ ప్రజాసాంస్కృతికోద్యమంలో చలనచిత్ర సంఘాల పాత్ర ఎలా వుండాలన్నది చర్చనీయాంశం.

వ్యాపార చలన చిత్రాలకు ప్రత్యామ్నాయంగా ప్రత్యామ్నాయ సినిమాలు వస్తున్నాయి. కాని అవి చాలా తక్కువ. కారణం ఆర్థికమే. అదే సమయంలో సమాంతర చలన చిత్రాలు వస్తున్నాయి. సాధారణంగా ఈ లఘు చిత్రాలు ప్రజల సమస్యలను పట్టించుకొనేవిగానూ, ప్రజల చైతన్యాన్ని చిత్రించనివిగానూ, ఉదాత్తమైన మానవ విలువలను కళాత్మకంగా ప్రబోధించేవి గానూ, అన్యాయాలను, అక్రమాలను ప్రతిఘటించే చైతన్యాన్ని చిత్రించేవిగానూ, ప్రభుత్వాలు చేపట్టే ప్రజా వ్యతిరేక కార్యక్రమాలను చిత్రించేవిగానూ వుంటాయి. ఈనాడు ప్రజాకళారూపాల ద్వారా ప్రజల వద్దకు వెళ్ళి, ప్రదర్శనలిచ్చి చైతన్యపరచడం అంత సులభమైన పని కాదు. అస్తిత్వవాదాల ప్రభావంతో ప్రజా కళాకారులు, రచయితలు విడివిడిగా కృషి చేయడం ప్రారంభమైన ఫలితంగా ఒక సుసంఘటితమైన, బలమైన ప్రజా సాంస్కృతిక ఉద్యమం రూపుదిద్దుకోలేదు. ఈ పరిస్థితుల్లో మన చేతుల్లో ఉన్న బలమైన సాధనం చిన్న సినిమాల నిర్మాణం – ప్రదర్శన. లాటిన్ అమెరికన్ దేశాల్లో ప్రతిఘటన సినిమాలను గ్రామాలలో రహస్యంగా ప్రదర్శించి ప్రజలను చైతన్యపరచిన వాస్తవం మన కళ్ళముందు వుంది. అలాగే వివిధ సమస్యలపై, ప్రభుత్వ విధానాలపై, పాలకుల అకృత్యాలపై, అగ్రవర్ణుల ధాష్టీకంపై, కులమతోన్మాదాలపై, భాష, ప్రాంతం విభేదాలపై ప్రజానుకూలంగా నిర్మింపబడిన చిత్రాలను స్వల్ప వ్యాఖ్యానాలతో విద్యార్థులలో, గ్రామాలలో ప్రదర్శించే కార్యక్రమాన్ని ఫిల్మ్ సొసైటీలు స్వీకరించాలి. ఇప్పుడు ఎల్.సి.డి. ప్రొజెక్టర్లు అందుబాటులోకి వచ్చాయి కనుక, వాటి ద్వారా ఫిల్మ్‌సొసైటీలు ప్రజల్లోని వివిధ వర్గాల వారి వద్దకు సులభంగా వెళ్ళవచ్చు. ప్రతి ఊరికీ విద్యుచ్ఛక్తి వుంది. గనుక వీటిని వీధుల్లోనే తెల్లటి పంచె తెరగా కట్టి ప్రదర్శించవచ్చు. ఈ కార్యక్రమాలు ఇప్పటికే చేపట్టిన ప్రజాసాహిత్య సాంస్కృతికోద్యమ సంస్థలకు ఫిల్మ్ సొసైటీలు తమ సహకారాన్ని అందించవచ్చు.

సాధ్యమైతే, ఫిల్మ్ సొసైటీలు ఆర్థికంగా బలపడితే కొన్ని సమస్యలపై సమాంతర సినిమాలను నిర్మించి ప్రదర్శించవచ్చు. ప్రజా సాంస్కృతికోద్యమం తాను రూపొందించుకున్న ఆధునిక కళారూప ప్రదర్శనే గాకుండా, ఈ చలన చిత్రాల ప్రదర్శన కూడా ఒక కార్యక్రమంగా చేపట్టాల్సిన అవసరం కనబడుతోంది.

21. కళాత్మక సాధనంగా సమాంతర సినిమా

– కట్టా కృష్ణారావు, కళా విమర్శకులు, సెల్ : 9490186602

ప్రపంచంలో కోటానుకోట్లమంది ప్రజల్ని ప్రభావితం చేసే శక్తివంతమైన మాధ్యమం, వినోదం పేరిట సాగుతున్న మాధ్యమం సినిమా... ఈ అద్భుత మానవ విజయం శాస్త్రీయ, సాంకేతిక ప్రగతి నిదర్శనం.

వినోదం పంచే ఈ చలన చిత్రం ప్రారంభం కాకముందు దేశదేశాల్లో ఆయా జాతుల్లో భిన్న సంస్కృతులు తెలియజేసే జానపద కళారూపాలు, వినోదం, విజ్ఞానం అందించాయి. ఆ తరువాత వచ్చిన నృత్యం, గానం, నాటకం మొదలైనవి వినోదం పెంచితే... సినిమా అనేది ప్రారంభమైనాక ఈ కళలన్నీ సమాహారంగా ప్రదర్శించబడే శక్తివంతమైన ఆయుధంగా వైజ్ఞానిక ఋషులు సృష్టించి తీర్చిదిద్దారు.

లలిత కళల ప్రధాన ఉద్దేశ్యం వినోదప్రధానంగా ఉండాలనేది, వ్యక్తి మానసిక వికాసానికి, విజ్ఞానానికి దోహదం చేయాలనేది మానవత్వం ఉన్న విజ్ఞుల ఆకాంక్ష. చలనచిత్రమాధ్యమం సైన్సు, టెక్నాలజీల అభివృద్ధితోబాటు ఊహాతీతంగా విస్తృతంగా ఎదిగి ఆధునిక కాలంలో జనజీవనంలో ప్రధమ భాగంగా మారిపోయింది.

నిజమే.... మనిషి భౌతిక జీవనం అవసరాలు తీర్చే వస్తు సంపద ఇస్తే మానసిక జీవనం... అనుభూతి... ఆనందం.... ఉత్తేజాన్ని కలిగించే రసజ్ఞత కళారూపాలు తీరుస్తాయ్. అందుకనే సినిమా మానసిక రసైక జీవనానికి పెద్ద పీట వేసేలా మారిపోయింది. ప్రపంచాన్ని ఒక గొప్ప మలుపు తిప్పింది. వినోదం పేర దృశ్యమానం చేసే ఈ కళాప్రక్రియ ఒక వరం. ఇది మానవ నాగరికతను వేగవంతం చేసిందనడంలో సందేహం లేదు.

సెకనుకు 18 ఫ్రేములు నడిస్తే కదులుతున్న దృశ్యం మారిపోతుందని ఫిల్ములో బంధించిన ప్రపంచాన్ని ఆశ్చర్యపర్చారు లూమియన్ సోదరులు. సెకనుకు 18 ఫ్రేములు కన్నా సంఖ్య తగ్గిస్తే వేగం పెరిగిపోతుందని.... లేదా 24,... 26 ఫ్రేములు తిప్పితే స్లోమోషన్‌గా మారిపోతుందని తరువాత వచ్చిన సాంకేతిక విజయం బహుకోణాల్లోంచి విస్తృతంగా అభివృద్ధి సాధించారు. నేడు యానిమేషన్, డిజిటల్, గ్రాఫిక్స్‌తో ఊహలకు పరిమితులు చెరిపేసి విశ్వమంత విస్తృతంగా వ్యాపించి పోతోంది.

తొలి రోజుల్లో సినిమా ఆశ్చర్యకర వినోదంగా ప్రపంచ మానవాళిని ఆకట్టుకొంటే... ఆ సృజనాత్మక కళ ద్వారా బాగా సంపాదించవచ్చు అనే వ్యాపార వర్గాలు రంగప్రవేశం చేసాయి. తొలి రోజుల్లో సినిమా కళాత్మక వ్యాపారంగా ప్రారంభమైంది... నేడు... వ్యాపారాత్మక కళగా మార్చేసారు. మానవ బలహీనతల్ని కేష్ చేసుకోవడం ఎలా? అని ప్రారంభించి మనిషితనాన్ని చంపేసి... నీతినియమాలకి సామాజిక బాధ్యతలకు ఉచ్ఛనీచాలకు నీళ్ళొదిలి.. మషాలాలు గుప్పించడం... మితిమీరిన హింసను ప్రోత్సహించడం. సెక్స్.... జుగుప్స అర్థనగ్న.... బూతును విశృంఖలంగా వ్యాపింపచేస్తున్నారు. నూటికి తొంభై సినిమాలు చౌకబారుగా మారి ద్వందార్థాలు, బహుళార్థాల పాటలు మాటలు రోతపుట్టించే స్థాయికి దిగజార్చారు. కామ కవాత కృత్యాలుగా వస్త్రధారణ పీలికల్లోకి మార్చేసారు. సామాజికులు ప్రశ్నిస్తే ప్రేక్షకులు కోరుతున్నారు కాబట్టి మేం చేస్తున్నాం అని బుకాయిస్తున్నారు. వ్యాపారం కొనసాగిస్తున్నారు. మానవత్వాన్ని భ్రష్టుపట్టిస్టున్నారని విజ్ఞుల ఆవేదన... రోదనే మరి.

ఈ బలమైన మాధ్యమం వ్యాపార సూత్రాల్లోకి ఈడ్చబడడం వల్ల ప్రేక్షకులకు అనారోగ్య, అనైతిక భావాలు పొందిపొర్లిస్తూ సినిమా టైమ్‌పాస్ సాధనంగా మార్చారు. ఇది జీవితాన్ని... ప్రవర్తనల్ని, ఆలోచనలన్నీ ప్రభావంచేసే ఆయుధం.

శాస్త్ర సాంకేతిక నిపుణత ఉపయోగించగల శక్తి సామర్థ్యాలు పెంపొందించుకొని, హృద్యంగా చెప్పగల నేర్పు కూర్పు కళాతత్వ నిపుణత ఉన్న దర్శకులు, మనిషిని, కుటుంబాన్ని, సమాజాన్ని, ప్రాంతాన్ని, లక్ష్యాల్ని, మానవత్వాన్ని రసావిష్కరణ చేయగలిగే కళాపిపాసువులు పెరిగితే మంచి సమాజాన్ని నిర్మించడానికి తోడ్పడుతుంది.

ఎవరో వ్యంగ్యంగా జోక్‌చేసినట్టు మన దేశంలో గ్రామాలు రాజకీయ నాయకునికి బాలెట్ బాక్సుల్లా కనిపిస్తున్నాయి. శాస్త్రవేత్తలకు అనాగరిక వాసాలుగా కనిపిస్తూన్నాయి, మేధావులకి నిరక్షర కూపాలుగా కనిపిస్తున్నాయి. సాంప్రదాయ వాదులకి జన్మజన్మల పాపాల కూపాలుగా కనిపిస్తున్నాయి అని. ఎవరి దృష్టిని బట్టి వారి అవగాహన.

కొద్దిమంది మానవతావాదులు, విజ్ఞులకు గ్రామాలు కష్టజీవుల నిలయాలుగా, నైతిక విలువల ఆలయాలుగా, కవులు, కధకులు, చిత్రకారులు, చిత్ర దర్శకులకు గ్రామీణ భారతం అనే భారతదేశపు ఆత్మ పల్లెటూరుల్లోనే ఉందని విశ్వసిస్తున్నారు.

అందుచేత అసంతగ, కల్పిత ఊహాతీత వ్యాపార చిత్రాలకు ధీటుగా సమాంతర సినిమా... నిజాయితీగా, చిత్తశుద్ధితో మన గ్రామీణ జీవన విలువల్ని, సున్నితత్వాన్ని, అమాయకత్వాన్ని, సహజత్వాన్నీ, సంపదను, మానవ సంబంధాలను హృద్యంగా వెండితెరకెక్కించాలి. వాటిని ప్రేక్షకులకు చేరువ చేయగలగాలంటే ఫిల్మ్ సొసైటీలాంటివి ఏర్పడి.. వాటి గొప్పదనాన్ని ప్రేక్షకులు ప్రజలు అర్థం చేసుకొనేలా ఎడ్యుకేట్ చేయాలి. కలకత్తాలోని ఫిల్మ్‌సొసైటీ చిదానందదాస్ గుప్తా దర్శకత్వంలో "ఎ ప్రోట్రేట్ ఆఫ్ సొసైటీ" రూపొంది దేశాన్ని ఆకట్టుకుంది. దేశమంతటా మేధావులు, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, చలనచిత్ర రంగానికి చెందిన ప్రముఖ దర్శకులు, సాంకేతికులు, ప్రేక్షకుల్ని తయారుచేసుకోవాలని గుర్తించారు.

అలాగే మన తెలుగులో కూడ ఎన్నో మంచి చిత్రాలు తీసిన దర్శకులు, నిర్మాతలు ఉన్నారు. కాని నూటికి 90% వ్యాపార ప్రవాహంలోపడి కొట్టుకుపోతూ మూసలో పోసిన సినిమాలు, అసభ్య, అవాంఛిత, అసహ్యకర, జుగుప్సాకర, సెక్స్, క్రైం, హింస, విడనాడి మంచి చిత్రాల నిర్మాణం వైపు రావాలని మనం కోరుకోవాలి. మన సమాజం మహోన్నతంగా ప్రపంచంలో ఎదగాలని కోరుకోవాలి. కోరుకుంటే మనం కూడ సమాంతర సినిమాను ఆహ్వానించాలి, ఆదరించాలి. అది జరగాలంటే ఫిల్మ్ సొసైటీలు స్థాపించి మంచి సినిమాలు ప్రదర్శించి, ప్రేక్షకుల్ని ఎడ్యుకేట్ చేసుకోవాల్సిందే –

అలా అని సమాంతర సినిమా పేర, రసహీనంగా వాస్తవికత పేర శిల్పీకరణ విడిచిపెడితే అది శిలే అవుతుంది. వాస్తవమనే శిలని తీసుకొని శిల్పీకరిస్తేనే ప్రేక్షకుడు రససిద్ధిని పొందగలడు – అందుచేత సమాంతర సినిమాలో వాస్తవికతతో బాటు వినోదం, విజ్ఞానం ఉండాలి. ఏది ఉత్తమ కళ అంటే.. రస సిద్ధిని కలిగించి ఆనందాన్నివ్వడంలో అసలైన కళతోపాటు నైతిక విలువలతో సామాజిక ప్రయోజనం సిద్ధించేదే, అందులో సందేహం లేదు. అందుకే ఈ కల్పనా లోకాల, వినోదాత్మక సినిమాలతో బాటు, సమాజానికి అద్దంపట్టే, మానవ సంబంధాలను ఉన్నతపరచే ఉత్తమ సమాంతర సినిమాల్ని ఆహ్వానిద్దాం, ఆదరిద్దాం.

22. సినిమా రంగంలో సిసలైన మార్పు

– **కె. శాంతారావు,** సాంస్కృతికోద్యమకారులు
సెల్ : 9959745723

కట్.. టేక్.. షాట్

– చలన చిత్ర నిర్మాణ భాష ఇది.

ప్రతి టేక్‌కు కట్‌కు మధ్య ఓ షాట్ ఉంటుంది.

ఆ షాట్‌లో వ్యక్తియొక్క బాహ్యచలనం (కదలిక) ఉంటుంది. అలాగే అంతఃచలనం (భావోద్వేగాలు వ్యక్తపరిచేతీరు) కూడా ఉంటుంది.

నటీనటులు అభినయం ద్వారా, ప్రాకృతీ సామాజిక ప్రతీకల ద్వారా, శబ్ద గ్రహణ పద్ధతుల ద్వారా ఇది వ్యక్తం అవుతుంది.

వ్యక్తి నుండి కుటుంబం – సమూహం – సమాజం – దేశం – యావత్ విశ్వాన్ని కూడా ఈ షాట్‌లో బంధించవచ్చు.

ఎప్పుడెప్పుడు ఎలా ఎలా, ఏయే రేంజ్ (స్థాయి)లో ఈ షాట్‌ల నిర్మాణం చేయాలనేది, దృశ్యంలో బంధించే దర్శకుని ప్రతిభపై ఆధారపడి ఉంటుంది. ఈ షాట్‌ల సమాహారమే ఒక సంఘటనగాను, ఒక సన్నివేశంగాను, వెరసి ఒక చిత్రంగా రూపాంతరించేది. ప్రేక్షకుల ముందరకొచ్చి హృదయాలపై చెరగని ముద్రవేస్తుంది.

అంటే దర్శకుని కన్ను ఇక్కడ కెమెరా కన్నై మొత్తం చిత్రాన్ని నిర్దేశిస్తుంది.

ప్రతి షాట్‌కు కొంత వ్యవధి ఉంటుంది. కొన్ని మీటర్‌ల ఫిల్మ్ ఉంటుంది. ఆ ఫిల్మ్ తోరణంలో ప్రతి అంగుళం – అంగుళం ఫిల్మ్ మధ్యన కూడా ప్రేక్షకుడు ఉంటాడనే స్పృహ జాగరూకత ఉత్తమ దర్శకులైన ప్రతివారికి ఉంటుందనేది విమర్శకుల ఉవాచ.

ప్రేక్షకుడు అంటే ఇక్కడ సమాజం. అంటే ఆ సమాజాన్ని కేంద్రంగా తీసుకునే చలన చిత్ర నిర్మాణం జరుగుతుందని, జరగాలనే భావన, బాధ్యత ఇందులో ద్యోతకమవుతుంది.

అది అలా ఉంచితే ఇప్పుడు డిజిటల్ యుగంలో చిత్ర నిర్మాణం జరుగుతున్నది. సాంకేతికంగా అద్భుతమైన కెమెరాలు వచ్చాయి. చిత్ర నిర్మాణం వందలకోట్ల స్థాయికి చేరుకుంది. ఇప్పుడు సినిమా వ్యాపారం విశ్వమార్కెట్ అయింది..

ఈ నేపథ్యంలో వాస్తవాలను ప్రతిబింబిస్తూ, మానవీయ విలువలను ప్రతిఫలిస్తూ, హృదయ సౌందర్యాన్ని ఆవిష్కరించి, వికసింపజేసే చిత్రాలు ఎన్ని వస్తున్నాయి? ఆ వస్తున్న అతికొద్ది చిత్రాలు కూడా ప్రజలకు అందుబాటులో రాకపోవడానికి గల కారణాలు ఏమిటి? ఆ ఆటంకాలను అధిగమించగలమా? – ఇదో ముఖ్య ప్రశ్న.

తక్కువ ఖర్చుతో ప్రగతిశీల, సృజనశీల చిత్రాలు నిర్మించడం ఒక ఎత్తు అయితే, వాటిని ప్రజలకు అందుబాటులోకి తీసుకురావడం మరో ఎత్తు.

ఇందుకోసమే సమాంతర చిత్ర ఉద్యమం పుట్టింది. ఫిల్మ్ క్లబ్‌ల ద్వారా వ్యాప్తి చెందీ అక్కడక్కడా పనిచేస్తున్నది. మంచి చిత్రాలను ప్రేక్షకులకు చూపించి వారి ఆలోచనలు అనుభూతులను రసాత్మకంగా ఉద్దీపన గావించాలనే తపన ఈ ఉద్యమ కార్యకర్తలలో ఉంటుంది. ఎందుకంటే ఇదో సాంస్కృతిక నిర్మాణ బాధ్యత.

ప్రపంచీకరణ నేపథ్యంలో ఆశ్రిత పెట్టుబడి అన్ని రంగాలను శాసిస్తున్నట్టే సినిమా రంగాన్ని శాసిస్తూన్నది. తత్ఫలితంగా మానవ సంస్కృతి విషసంస్కృతిగా క్షీణదశకు చేరుకుంటుంది.

ఇక్కడ వ్యక్తి ఆలోచనారహితుడై రసహీనుడుగా మారుతున్నాడు. కేవలం డబ్బు వెనుక పరిగెట్టే యంత్రంగా మారిపోతున్నాడు. భౌతిక సుఖాలకే పరిమితం అవుతూ ఆత్మ సౌందర్యాన్ని విడనాడుకుంటున్నాడు. పశువుగానో, మృగంగానో వెనక్కి నడుస్తున్నాడు. ఒక విధంగా ఇది ఆత్మహత్యా సదృశ్యమే. ఇదో పరాయికరణ దశ.

దీనిని ఛేదించేది ప్రజా సంస్కృతే. నిర్మించేది శ్రమైక జీవులు, నడిపించేది వివేకం కల మేధావులు, కళాకారులు, సృజనశీలురు.

సినిమా అనేది వీరి అద్భుత దృష్టి. అందుకే లెనిన్ మహాశయుడు అన్నాడు,

20వ శతాబ్దంలో మానవుడు సాధించిన అద్భుత విజయాల్లో సినిమా ఒకటి.

స్థలకాలాదులకు అతీతంగా సినిమా నేడు విశ్వమంతటా విస్తరించింది. విజ్ఞానాన్ని, వినోదాన్ని దృశ్యమాధ్యమంగా ఏకకాలంలో ఇది ప్రపంచానికంతా అందించగలదు.

యుద్ధాలు కావచ్చు, పరిశోధనలు కావచ్చు, ఉద్యమాలు కావచ్చు. అంతా దృశ్యరూపమై వెండితెరపై కదలాడుతూ మానవ మస్తిష్కాలపై హృదయాలపై ప్రభావం చూపుతుంది. వర్తమానాన్నే కాదు భూత భవిష్యత్ కాలాల ఘటనలను కూడా రసరమ్యంగా కళ్ళకు కడుతుంది.

సినిమా రాక మునుపు మనకు ఉన్న ఏకైక సజీవ మాధ్యమం నాటకం.

కథలే పాత్రలు. తెరపై కదులుతూ మాట్లాడుతూ వాస్తవం – భ్రమ అని కాకుండా భ్రమ – వాస్తవం అనే దశకు సినిమా తీసుకువచ్చింది. అందుకే కళలన్నింటిలోను మనకు, ముఖ్యంగా అందుబాటులో ఉన్న మధ్య తరగతి ప్రజానీకానికి సినిమా అత్యంత ప్రాధాన్యమైనదయింది.

సినిమాకి ఉన్న సమ్మోహన శక్తితో ఎప్పటికప్పుడు లాభాలు దండుకోవచ్చని, పెట్టుబడిదారులు, నిర్మాతలు కలలు కంటున్నారు. అశ్లీల, అసభ్య, హింసా, చౌకబారు దృశ్యాలతో కొందరు అప్పుడప్పుడు నెట్టుకు రావచ్చు. కానీ ఎల్లకాలమూ అది సాధ్యం కాదు.

నేల విడచి సాము చేయడం కుదరదు. ఎందుకంటే **ఏ కళకయినా మానవ జీవితమే ప్రమాణము.** ఆయా దేశకాల పరిస్థితులకు అనుగుణంగా ఆ ప్రాంత జీవన శైలి ఉంటుంది. సాంస్కృతిక స్థాయి ఉంటుంది. సమస్యలు ఉంటాయి. తదనుగుణంగా కళలు, సినిమాలు ఉంటాయి. ఇది కార్యకారణ బంధం.

సమస్యలను కళాత్మక దృశ్యకావ్యంగా మలచి, ప్రజల చైతన్య పరిధిని విస్తృత పర్చడానికి ప్రజా సమస్యలకు దర్పణ పట్టడానికి సినిమా దోహదం చేస్తుందని మార్క్సిస్టు మేధావులు 20వ శతాబ్దంలోనే తెలుసుకున్నారు.

సామాజిక స్పృహతో కూడుకున్న చిత్రాలు ప్రజలను రంజిప చేయడమే కాదు, సామాజిక పరివర్తనకు తోడ్పడతాయి అని నమ్మారు. తమ సృజనశీలతతో ఆ విధంగా చిత్రాలు తీసి నిరూపించారు కూడా.

1943లో బొంబాయిలో ఇండియన్ పీపుల్స్ థియేటర్ అసోసియేషన్ (ఇప్టా) అవతరించింది. అప్పటికే సోవియట్ రష్యా సోషలిస్టు విధానాలతో పయనిస్తున్నది.

శ్రమజీవుల కేతనం అరుణ పతాకం. సంకేతం కత్తి – సుత్తి. విశ్వవ్యాప్తమై అన్ని రంగాల్లో ఓ ప్రత్యామ్నాయం చూపిస్తున్నవి. భారతీయ సినిమాల్లో కూడా 'ఇప్టా వేదికగా అలాంటి చిత్రాలు నిర్మితమయ్యాయి. బలరాజ్ సహాని, పృథ్వీరాజ్ కపూర్,మహబూబ్‌ఖాన్ వంటివారు ఆ ప్రత్యామ్నాయ మార్గానికి ఎంతో ప్రభావితులయ్యారు. ఆంధ్రా నుండి మన డా॥ గరికిపాటి రాజారావు కూడా.

మహబూబ్ ఖాన్ సొక్షాత్తు 'కత్తి–సుత్తి' బ్యానర్ పెట్టుకునే 1940–50 దశకాల్లో, హుమయూన్, ఆన్, అమర్, మదర్ ఇండియా వంటి చిత్రాలు తీశారు. అలాగే అలాంటి బ్యానర్ లేకపోయినా శాంతి, సమభావం, సమిష్టి క్షేమం కాంక్షించే ఎన్నో సాంఘిక చిత్రాలు వచ్చిన విషయం మనకు తెలిసిందే.

చలనచిత్రాల్లో ఎక్కడైనా సరే సామాజిక అభ్యుదయం కన్పించేది అంటే అది అప్పటి కమ్యూనిస్టు ప్రభావం అని చెప్పక తప్పదు. ఇదే పెద్ద మార్పు. సినిమా రంగంలో సిసలైన మార్పు. ఈ వారసత్వాన్ని ఎంతగా కొనసాగిస్తే అంతగా సినిమా లోకానికే కాదు, యావత్ మానవ లోకానికి జయం చేకూరుతుంది.

23. నేటి సినిమాల తీరూ తెన్నూ

– డా॥ మలయశ్రీ, శతాధిక గ్రంథకర్త,
కరీంనగర్, సెల్ : 98665 46220

సినిమా 20వ శతాబ్ది ఆరంభంలో పుట్టి, ప్రజల్ని ఎంతో ప్రభావితం చేస్తున్న బలమైన మీడియా. క్రమంగా ఎదిగి ఇది ప్రపంచ వ్యాప్తంగా చాల పెద్ద వ్యాపార రంగమైంది. నటీనటులు, దర్శకులు, కళాకారులు, రచయితలు, నిర్మాతలు, టెక్నీషియన్లు, పంపిణీదారులు, ప్రదర్శకులు, పనివాళ్ళు, ప్రచారకులు చాలామందికి ఉపాధి కల్పించి వేల లక్షల కుటుంబాలను పోషిస్తున్నది. ఇది వచ్చి ఇంచుమించు వందేండ్లు. సాంకేతికంగా చాలా ఎదిగి చలనచిత్రం సంచలన విచిత్ర రంగమైంది. మొదట టాకీసుల్లోనే సినిమాల ప్రదర్శన ఉండేది. ఇప్పుడు ఓ 20, 30 ఏండ్లుగా టివీల ప్రసారాలు కారణంగా, చూచి కదలకుండా 24 గం.లు చలనచిత్రాల చూసే వీలుంది.

అయితే, నేటి మన సినిమాలు ఎట్లున్నవి? ఎట్లుండాలి! అనే విషయం మనం ఆలోచించవల్సి ఉంది. మొదట మతభక్తి, జానపద గాధలకే ప్రముఖస్తానం. ఆ తర్వాత సాంఘిక ఇతివృత్తాల చలనచిత్రాలు వచ్చి వాటిని వెనుకకు తోసినై, ఇప్పుడు సామాజిక చిత్రాలదే కాలం. ఇక, సైన్సు ఫిక్షన్లు వచ్చి పాత మాయల మంత్రాల కథల సినిమాల తలపిస్తున్నవి.

కథల విషయానికి వస్తే – దేవుళ్ళు, రాజుల చరిత్ర కాదు. ప్రేమ కథలకే పెద్ద పీట. కొన్ని సంఘ సంస్కర్త కథలు. యుద్ధాలు సరే సరి. దోపిడీ వ్యతిరేక కథలు, కొన్ని అపరాధ పరిశోధనలు, తన్నులాటలు, హింస, చంపుడు లేని సినిమా (ఇంగ్లీష్, తెలుగు) ఉంటూ లేదు.

ఆర్థిక వ్యత్యాసాల కారణంగా కూలీలు, పనివాళ్ళు ధనికులపై భూస్వాములపై తిరుగబడే కథలు వచ్చినై. సామ్యవాదం ఊపులో ఫ్యాక్టరీల యజమానులపై కార్మికుల పోరాటగాధలు వచ్చినై – మంచిదే. కుటుంబ గాధలు – ఉమ్మడి కుటుంబాల సాధక బాధకాలు, పనిదొంగలు, కుట్రలు కుతంత్రాలు, అపార్థాలు, ఆత్మహత్యలు, హత్యలు, త్యాగాలు, విడాకులూ పంచాయితీలు, కోర్టులు – తీర్పులు, హితబోధలు, దుష్టుల పరివర్తనలు ఎన్నో రకాల కథలు వచ్చినై.

సామాజిక సమస్యలు సరే, మన దేశ కుల వ్యవస్థ, ఉచ్చనీచ భావాలు, అస్పృశ్యత ప్రపంచంలో ఏ దేశంలోనూ లేనిది ఉంటే వర్ణ (రంగు), జాతి (దేశ)

అభిమాన విద్వేషాలున్నవి. మనది మహా విచిత్ర పరిస్థితి. కులవృత్తి వదలినా కులముద్ర వివక్ష పోతూ లేదు.

ఈ సినిమాల్లో పంతాలు, పగలు, హత్యలు, దోపిడీలు, విధ్వంసాలు, సమాజాన్ని ముఖ్యంగ యువతరాన్ని ఎంత తప్పుదారి పట్టిస్తున్నవో కొంత నిదానంగా ఆలోచించండి – నిజం తెలుస్తుంది.

ఈ మధ్య హిట్ సినిమాల జోరు. ఏ ఆదర్శమూలేని కథలు, భారీ బడ్జెట్టే చిత్రీకరణ. వంద కోట్ల వసూళ్ళట! మరి, అంతర్జాతీయంగా చూడండి – అభూత కల్పనలో, అద్భుత సన్నివేశాలు, అతీంద్రియ శక్తులు, పునర్జన్మలు, పరకాయ ప్రవేశాలు, మారువేషాలు, ప్లాస్టిక్ సర్జరీలు – ఏమిటేమిటో అందీ పొందనివి. అయినా – గ్రాఫిక్ మాయం ఆవురావురు మన్నా వాటిని చూసే ప్రేక్షక మహాశయులు. ఒక్కడు హీరో వందల మందిని తన్ని పడేయగలడు. పదుల సంఖ్యలో అందాల భామలతో శృంగార లీలల నృత్యగానాలతో అలరించగలడు. ప్రేక్షకులమై మరపించే చిత్రీకరణలు. ఔచిత్యం? అవసరం లేదు, మనవాళ్ళు నీతులకు శ్రీరామచంద్రులు, చేతలకు శ్రీకృష్ణమూర్తులు!

భారతీయ సినిమా ఇప్పుడు పాశ్చాత్య సినిమాకు అనుకరణే. అనుకరణలో మనవాళ్ళు అగ్రగణ్యులు. తెలుగువాళ్ళు మరీ. ఇట్లయితే మన అస్తిత్వమేది? అన్నింటా అంతే. మన సినిమాల్లో మన సమస్యలు – పరిష్కారాలు, మన సంస్కృతి జీవితం ఈనాడు ఎంతవరకు ప్రతిఫలిస్తున్నవి? అంటే, జవాబు శూన్యమే కదా. ఎందుకిట్లా? ఎన్నాళ్ళిలా! వెకిలి భాష – ముతక హాస్యం.

ఇల్లా రాస్తూపోతే నేటి మన మేటి సినిమా పనికిమాలిన చచ్చు పుచ్చు కథల, సన్నివేశాల చిత్రీకరణ గురించి ఎంతైనా రాయవచ్చు. నిజమైన సంగతులే. ఎంచి చూసిన మన నేటి సినిమాల్లో మంచి యన్నది కొంచెమే.

నేను కోరేది ఒక్కటే – **సినీరంగ ప్రక్షాళన జరగాలి**. మన సినీరంగ ప్రముఖులు కాలంతో మనం అని సమర్థించుకోవచ్చు. కానీ, అది సరియైన పద్ధతి కాదు. సినిమాలు మనకు అత్యవసరం కాదు. అవసరం అంతే. అయితే అవి కేవలం వినోద సాధనాలు మాత్రమే కావు. విజ్ఞాన ప్రధాన దృశ్యకావ్యాలు కూడా. వీలైనంతగా సంఘాన్ని సంస్కరించాలె తప్ప, దిగజార్చకూడదు. తస్మాత్ జాగ్రత్త. నేను చెప్పింది కొంతే, మిగతా బాగోగుల గుర్తించి మీరే ఆలోచించండి. చెప్పటమే నా వంతు – ఆచరణ మీ వంతే.

సెలవిప్పటికి, స్నేహమెప్పటికీ.

24. తెలుగు సినిమా వాస్తవిక దృక్పథం

– సి. ఉమామహేశ్వరరావు, దర్శకులు, వైస్ ఛైర్మన్,
దాదాసాహెబ్ ఫాల్కే స్కూల్ ఆఫ్ ఫిల్మ్ స్టడీస్, సెల్ : 9000745555

తెలుగు సినిమా వాస్తవికంగా ఎలా వుంది అన్న పరిశీలనతోనే (రియలిజం) వాస్తవికతా తత్వం అనే అంశం తెలుగు సినిమాలో వుందా? ఉంటే ఏమేరకు వుంది. లేకపోతే ఆ అంశాన్ని కనిపించకుండా చేసే కారణాలు ఏమైయుంటాయి? పొగమంచులో గడ్డకట్టుకుపోయి చేతులు కాళ్ళు ఆడక కళ్ళు కనిపించని స్థితిలో వున్న **మంచి తెలుగు సినిమా**ను అవి ఎలా బందీ చేసాయి? చైతన్యంతో ముందుకు ఎలా సాగుతుంది? ఆలోచిస్తే ఇది పెద్ద బరువుని మూపుమీద పెట్టుకొని కొండ ఎక్కే ప్రయత్నమే. ఇది మేధోమథనంగా తెలుగునాట సాగాలి.

ఒక మిత్రుడు – అతను విప్లవ భావాలున్నవాడే. కమ్యూనిస్టే. సినిమాలు చూసేవాడే. ఒక మాట అన్నాడు. "సినిమానా? అందులో వాస్తవికత ఏమిటి? దానికి సామాజిక దృక్పథం ఏమిటి? అది చెప్పొచ్చే దేమిటి – మనం వినేదేమిటి?" అని నిరసనగా అన్నాడు. అదే విషయాన్ని యింకో మిత్రుడు మరో విధంగా అన్నాడు.. "భలే చెప్తావులే.. ఆఖరికి సినిమా యిచ్చే ఆ రెండు గంటల ఆనందాన్ని కూడా మాకు దూరం చేస్తావా? ఏదో ఈ గందరగోళం నుంచి ఈ జీవితంలోంచి బయటపడాలనే కదా ఆ రెండు గంటల సినిమాకు వెళ్ళేది."

అంటే మొదటి మిత్రుడు సినిమాను అంటే తెలుగు సినిమాని జీవితానికి ప్రతిబింబాత్మకంగా అసలు భావించడం లేదు. అంటే ఈ పాపం నాది కాదని చేతులు కడిగేసుకున్నాడు. అయితే రెండో మిత్రుడు జీవితానికి ముడిపెట్టకుండా సినిమాని ఓ గారడీ మోళీయే అనుకున్నాడు. జీవితానికి సంబంధంలేని పాత్రలు, వాళ్ళ అర్థం పర్థంలేని కబుర్లు, వాళ్ళ ఏడ్పులు, నవ్వులు, పాత్రల మధ్య ఘర్షణలు, కొట్లాటలు వాళ్ళ ఉత్సాహ విజయాలు – యిలాంటి వాట్లో దాక్కుంటాడు. జీవితం నుంచి దూరంగా.. అఫ్‌కోర్స్ – రెండు గంటలే అనుకోండి. సారా, వేరే మత్తు పదార్థాలు చేసేది అదే పని కదా...

ఇవ్వాళ చలనచిత్ర సాంకేతిక పరిజ్ఞానం మనకి చాలా దగ్గరికొచ్చేసింది. ఒకప్పుడు ట్రక్కులతోనే మోసుకెళ్ళే పెద్ద పెద్ద లైట్లు చిన్నవై వేళ్ళతో మోసేట్లుగా

తయారయ్యాయి. డిజిటల్ కెమెరాలు, ఆడియో రికార్డింగ్ మన సంచుల్లో ఇముడుతున్నాయి. అయినా సినిమా ధనిక మాధ్యమంగా ఎందుకు కొనసాగుతుంది? జన సముదాయాల కోపరేటివ్స్ మధ్యకి రాకపోవడానికి మన అలసత్వం ఎంతవరకు కారణం? నెట్‌లోను, హోటళ్ళల్లోను, క్లాస్ రూముల్లోను, వీధి చివర కిళ్ళీకొట్లలోను ఈ మహేష్‌బాబులు, చిరంజీవుల మీద చర్చలు / మన సామాజిక వాస్తవికతల, అభిప్రాయాల చర్చగా మార్చటానికి మనం ప్రయత్నించాలి.

మనిషితోపాటు నడిచేది కళ. ఆ విషయాన్ని మానవ చరిత్ర చెప్తోంది. కళ ఎదుగుదల మానవ మేధస్సు ఎదుగుదలతో ముడిపడి వుంది. అందుకనే కళ ఏ రూపేణ వున్నా అంటే సినిమా రూపంలో వున్నా అది సమయాన్ని మింగేసే భూతం కాదు. మత్తులో ముంచేది కాదు. వ్యక్తి జీవనంతో ముడిపడి వుంది. సమూహ బృందాలతో ముడిపడి వుంది. అందుకనే అభూతకల్పనలకి దూరంగా కళ వుండాలి. అందుకే వాస్తవికత అవసరమైంది. వాస్తవికత కళతో తాదాత్మ్యం చెందింది. సృజనాత్మక కళని అంచనా వెయ్యడానికి రియలిజం ఒక లిట్మస్ గా నిలబడుతుంది.

నిజమైన కళకి ముఖ్యావసరం వాస్తవం. ఇందులో ఏ మినహాయింపు లేదు. అయితే కేవలం వాస్తవాన్ని చూపించటం వరకే వాస్తవికత కుదించబడదు.

కళలు అధికార వర్గాల వ్యక్తీకరణలుగానే సహజంగా ఉంటాయి. ఆ వ్యక్తీకరణలు చారిత్రక సంఘటనలను భౌతిక దృష్టితో విశ్లేషించి, వాటి లోతుల్ని తార్కిక దృష్టితో ఆలోచించి, అభివృద్ధి పథంలో భవిష్యత్తుని చూపే ఒక వైజ్ఞానిక ధోరణి వాస్తవికత. ఈ వాస్తవికత మాత్రమే నిజమైన సినిమాని ఆవిష్కరిస్తుంది.

తనని తాను అర్థం చేసుకోవటానికి ప్రకృతిని అర్థం చేసుకోవాల్సిన సామాజిక అభివృద్ధిని అర్థం చేసుకోవాల్సిన పరిస్థితులు మనిషికేర్పడతాయి. దానిలోంచి వచ్చిందే వాస్తవికత. అంటే వాస్తవికత ఓ చారిత్రక ధోరణికూడా.

పందొమ్మిది వందల ముప్ఫైయవ దశకంలో చాలా సంఘటనలు జరిగాయి. సమాజాన్ని కుదిపేసాయి. ఆంగ్లేయాధికార, దుర్మార్గ ఫలితంగా జలియన్ వాలాబాగ్‌లో నెత్తురు ఏరై పారింది. గాంధీ నాయకత్వాన దేశమంతా సహాయ నిరాకరణోద్యమం పెద్ద కెరటంలా లేచింది. ప్రపంచాన్ని ముంచిన ఆర్థిక సంక్షోభం మధ్య తరగతి వెన్ను విరిచింది. అయినా ఈ ఛాయలేమీ తెలుగు ఛాయాచిత్రాల

మీద పడలేదు. పురాణ కథలతో తెలుగు సినిమా మునిగిపోయింది. వాస్తవికత దాన్ని అంటలేదు.

ఆ సమయంలో 1938లో ఓ తెలుగు చిత్రం, సాంఘిక చిత్రం 'వాస్తవం' జెండా పట్టుకొని వచ్చింది. అది 'మాలపిల్ల'. దర్శకుడు గూడవల్లి రామబ్రహ్మం, ఉన్నవలక్ష్మీ నారాయణ బోల్షివిక్ భావరచన 'మాలపల్లె' నవల స్ఫూర్తితో గుడిపాటి వెంకటాచలం కథ తాపీ ధర్మారావు మాటల రచనతో జనం ముందుకొచ్చింది.

"కర్మ.. బాపనోడిదెపుడు సుకంగా తిని కూసుండే కర్మ... మాలోళ్లది ఎప్పుడు బువ్వలేక మలమల లాడే ఖర్మ... కర్మని బోధించి నమ్మించి మత్తెక్కించి పాలించారు సాగినన్నాళ్ళు... హు! ఆ దినాలు యింక ఆఖరయినాయండోయ్... పోనీ పోనీ అని సూత్తన్నాం కాని మేం పూనుకున్నామా రేప్పొద్దున్నకీ కర్మలు తారుమారవుతాయి. ఆ దేవుడి గోడంతా బాపనోడి పొట్ట నింపటానికే... మాలోళ్ళకెందుకిస్తారు? సుకంగా గుళ్ళల్లో కూర్చుని పెసాదాలు మింగమరిగిన దేవుడు మురికి మాలపల్లెలోకి వచ్చి మాకట్టాలు తీరుత్తాడా? ఒక్కసారి మామాలగూడెంలో వూరేగి మారోదనావిని మాదయిద్రం కళ్ళారా చూసాడా గుడ్లు పేలి చస్తారు..."

1938లో ఓ ప్రజాస్వామ్య చింతనకి ప్రతీకగా నిలిచిన చిత్రం మాలపిల్ల. "కూలీలందరు ఏకము కావలెరా.." అనే పాట. ప్రపంచంలో అప్పుడు సాగుతున్న వాస్తవికతకు అభ్యుదయానికి అద్దం పట్టింది. ఈ సినిమాలో గాంధీ కన్పిస్తాడు. వీరేశలింగం కన్పిస్తాడు. కవిరాజు కన్పిస్తాడు. జస్టిస్ పార్టీ కన్పిస్తుంది.

గూడవల్లి రామబ్రహ్మం మరుసటి సంవత్సరమే 1937లో 'రైతుబిడ్డ'ను జనానిముందుకు తెచ్చారు. ఆయనే దర్శకుడు తాపీ ధర్మారావువి మాటలు. శాశ్వతశిస్తు నిర్ణయింపబడటం. దానిద్వారా జమీందారులకు సంక్రమించిన హక్కులు రక్షణలను ఈ రైతుబిడ్డ చిత్రం ప్రశ్నిస్తుంది. జమీందారులు పోలీసు, రెవెన్యూ అధికారులపై తమ పలుకుబడిని ఎలా ప్రయోగించేవారో ఈ చిత్రం చెప్తుంది. ఏ జమీందారులైతే ఈయన చిత్ర వ్యాపారానికి దన్నుగా నిలిచారో వాళ్ళకి ఈ చిత్రం కోపాన్ని తెప్పించింది. వెంకటగిరి జమీందారు వ్యాజ్యం వల్ల ఈ చిత్రం నిషేధింపబడింది. ఈ సందర్భంలో పెట్టుబడికి అనుకూలమైన అధికారం సినిమాలను, వాటి భావజాలాన్ని ఎలా నియంత్రిస్తుందో అర్థమౌతుంది.

దీనితోపాటు తెలుగు సినిమాల్లో సామాజిక వాస్తవికతా తత్వం వెనుకడుగు వేసింది.

తర్వాత వచ్చిన సినిమాల్లో లెస్ మిజరబుల్స్ ఆధారంగా తియ్యబడ్డ 1950 బీదలపాట్లులోగాని, షావుకారులో గాని వాస్తవం, మెలో డ్రామా చాటున స్టైలైజేషన్ చాటున మరుగున పడింది.

భక్త ప్రహ్లాద (1971) మొదలుగా వచ్చిన పౌరాణికాలు, జానపదాలు తెలుగు సినిమా మీద ఒక పెద్ద ముద్ర వేసాయి. అవి భూస్వామ్యవ్యవస్థ అవలక్షణాలను స్థిరీకరించాయి – ముఖ్యంగా స్త్రీ పురుష సంబంధాల్లో ఆ లక్షణాలనే ఆఖరికి సాంఘిక సినిమాల్లో కొనసాగించాయి. వాస్తవికత మరుగున పడటం వల్ల భవిష్యత్తుని సినిమాలు చూపించలేక పోయాయి. **తెలుగు జన జీవితం కంటె తెలుగు సినిమా వెనకబడింది.** అందువల్లనే నా మొదటి మిత్రుడి లాంటి వాళ్ళ నిరసనకు గురైంది.

మొదటి పాతికేళ్ళలో తెలుగు సినిమా జనానికి మోయమని ఇచ్చిన సాంప్రదాయవాదులకి పితృస్వామ్య వ్యవస్థీకృత సంఘానికిచ్చిన ఒక కత్తి. సతీ సావిత్రులు, సతీ అనసూయలు సాంఘిక చిత్రాల్లో స్థిరపడ్డారు. స్త్రీ ముందంజ వేయటానికి లక్ష్మణరేఖలొచ్చి అడ్డుపడ్డాయి. ఆఖరికి అభ్యుదయ దర్శకుడు ప్రత్యగాత్మ చిత్రం భార్యాభర్తలు కూడా ఈ భావజాల ఎద్దడి నుంచి తప్పించుకోలేక పోయింది.

పౌరాణిక చిత్రాల్లో దేవుడొక్కడే కడగళ్ళని తీరుస్తాడు. లేకపోతే అతని అనుయాయి మనిషి రూపంలోనికీ, గుర్రంగానో, పులిగానో పాముగానో కష్టాలను తీర్చే బాధ్యతను వహిస్తాడు జానపద సినిమాల్లో. అలాగే అబ్బురపరిచే సాహసాలు చేస్తూ ప్రియురాల్ని, భార్యని, కుటుంబాన్ని, రాజ్యాన్ని బలహీనుల్ని రక్షిస్తాడు. త్యాగం అతని లక్షణం. అదే హీరోయిజమ్. ఈనాటికీ రకరకాలుగా జెండా ఎగరేస్తుంది. అనేకరకాలుగా ఈ హీరోయిజమ్ వాస్తవికతను ఖూనీ చేసింది తెలుగు సినిమాలో.

గృహలక్ష్మి నుంచి ఇంటి కష్టాలకు కారణం భర్తకాడు. అతను మంచివాడే. తాగుడే దానిక్కారణం. తన కష్టాలకి నిర్లక్ష్యానికి కారణం భర్తకాడు. సాని కారణం, తన కష్టాలకి తోటి స్త్రీ కారణం. ఇంటి ఆరళ్ళకి అత్త కారణం. ఎన్నో కష్టాలకి ఓర్చి తన పతివ్రతామహిమతో తన భర్తను రక్షించుకోవాలి. ఇల్లు కాపాడుకోవాలి.

1950లో బి.ఎ. సుబ్బారావు దర్శకత్వంలో పల్లెటూరి పిల్ల వచ్చింది. నాగేశ్వర్రావు ప్రేమిస్తాడు. కాని ఆ పిల్ల దొంగని ఎన్.టి. రామారావుని ప్రేమిస్తుంది. బిడ్డను కంటుంది. కాని రామారావు పనిచేసిన దొంగల నాయకుడు అతన్ని, బిడ్డని ఎత్తుకు పోతాడు. అంజలి నాగేశ్వర్రావుని నిందిస్తుంది. నాగేశ్వర్రావు త్యాగనిరతతో రామారావుని బిడ్డని రక్షించటంలో తన ప్రాణాలు పోగొట్టుకుంటాడు. ఇలాంటి త్యాగాలు అనేక మలుపులు తిరిగి డాక్టర్ చక్రవర్తి వరకు సాగాయి. అదే అంశం ఇద్దరు అమ్మాయిలు ఒక అబ్బాయి, ఒక అమ్మాయి ఇద్దరు అబ్బాయిలతో త్యాగం ఆత్మార్పణలతో మూడుపువ్వులు ఆరుకాయలుగా సాగింది.

జోరుగా హుషారుగా షికారుకెళ్ళే మగవాడు తెలుగు సినిమాని అలరించాడు. వాడికున్న దుర్గుణాలని సైతం తప్పించి అతని వ్యక్తిత్వాన్ని కాపాడే దిశలో ఎవరో కావాలి నీ హృదయం కరిగించాల'ని వేడుకునే స్త్రీ తన పత్నిత్వ భావజాల కార్యక్రమంలో భాగంగా బాధ్యతను నిర్వర్తించింది.

అంటే మనువు స్త్రీకిచ్చిన నిర్దేశనలను తెలుగు సినిమాల్లో యువతులు సాగించారు. విషయం కూడా ఏమిటంటే ఈ సినిమాలకు స్త్రీ ప్రేక్షకులే అధికం. అంటే స్త్రీలని జడత్వంలో ముంచి ఆరేసిన ఘనత మన పితృస్వామ్య వ్యవస్థదే.

సమానంగా స్త్రీ ముందుకు నడిపిస్తుందని గాని సామూహిక చర్య సమాజాన్ని తీర్చిదిద్దుతుందని గాని చెప్పే వాస్తవికత లక్షణాలతో సినిమాలు రాకపోవటం ఒక పెద్ద లోటు.

తర్వాత జనానికి ఓ సామూహిక జీవితానుభవం వచ్చింది. అది వ్యక్తిగత ఆస్తిపై ఆధారపడటం. జీవితానుభవంలో జమీందారులు ఈ ప్రక్రియకు దాసోహమన్నారు. వారి డబ్బులు వడ్డీ వ్యాపారస్తుల చేతుల్లోకి, బాంక్‌ల చేతుల్లోకి వెళ్ళాయి. ఈ అంశంలో వున్న సాంఘిక ఆర్థిక పరిస్థితుల వాస్తవ బేరీజు వెయ్యకుండా డ్రామాని అగ్రస్థానంలో నిలపటానికి ధర్మదాత, సితార చిత్రాలు ప్రయత్నించాయి.

మానవ సంబంధాలు ప్రజాస్వామ్య తర్క పరిధిలోకి రాకుండా తెలుగు సినిమాలు ప్రయత్నించాయి. కారణభూతమైన ఆర్థిక పరిస్థితులు ఓ అస్పష్ట (ఆబ్‌స్ట్రాక్ట్) ఫాం లోకి నెట్టబడ్డాయి.

ఆఖరికి యజమాని కార్మిక సంబంధాల వ్యవహారం ఎల్.వి. ప్రసాద్ ఇల్లరికం, దాసరి నారాయణరావు సీతారాములు సినిమాల్లోలాగా భార్యాభర్తల సంబంధంగా మారిపోయింది.

పేదలు పేదలుగా కష్టాలు పడటం తెలుగు సినిమాకి నచ్చలేదు. వ్యవస్థ వ్యవహారంగా కాకుండా మోసంతో డబ్బు పోగొట్టుకుని మేడలు విడిచి మురికివాడల్లో వారుపడే కష్టాలతో తెలుగు సినిమాలు నిండిపోయాయి. ఆఖరికి తులాభారం మలయాళచిత్రం ఆధారంగా తెలుగు నిర్మించిన మనుషులు మారాలి చిత్రంలో కూడా శారద మాతృకకి భిన్నంగా అయినింటి అమ్మాయి. పేదింటి పిల్ల కాదు. కార్మిక నాయకుడ్ని పెళ్ళిచేసుకొని అతని మరణంతో పిల్లల్ని పెంచలేక వాళ్ళని చంపి బోనెక్కి భోరుమంటుంది.

వాస్తవికత తెలుగు సినిమాల్లో బ్యూటీ, మసోచిస్మ్‌ల వల్ల మసకబారింది. దోబిఘాజమీన్‌లో రిక్షా తొక్కేవాడికి, కండలు తిరిగి ఎద ఎగదోసి జయమ్ము నిశ్చయమ్మురా అని పాడే శభాష్ రాముడికి సంబంధం లేదు. కొత్తనగరపు మురికి జీవితం, అనారోగ్యం కుంగదీసే వాస్తవ రిక్షాకార్మికుడు కనిపించడు. ఒక క్లాసిక్ హీరో, మేఘాల మీద ఎగిరే రాకుమారుడే కన్పిస్తాడు.

అలానే చిరంజీవిగాని, నాగార్జున కాని స్టూవర్ట్‌పురం దొంగగా వేస్తే ఓ అమెరికన్ కౌబాయ్ స్టూవర్ట్‌పురంలో అవతరిస్తాడు. వలసవాదులు దొంగగా వేసిన ముద్ర, వేర్పాటు, ఈ పరిస్థితులని పోలీసులు, పెత్తందార్లు రాబడిగా మార్చుకోవటం, దొంగతనాన్నే బలవంతపు జీవన విధానంగా మార్చే దౌష్ట్యంలో ఊపిరాడని స్టూవర్ట్‌పురం కనిపించదు.

ఒకప్పుడు తను ప్రేమించే మనిషిని జంగ్లీలా వెంటాడుతూ ఏప్రిల్‌ఫూల్‌ని చేస్తూ పడవల్లో కూడా ఎగిరి గంతేసేవారు హిందీ సినిమాల్లో షమ్మీకపూర్, జాయ్‌ముఖర్జీ లాంటి వాళ్లు. అది అనుకరించటంతో ప్రారంభమైన తెలుగు సినిమాల్లో నటులకి నృత్యం వస్తే చాలు, నటన అక్కర్లేదు, గాత్రం అక్కర్లేదు, వీటి మధ్య సాపత్యం అక్కర్లేదని దర్శకులు తాతినేని రామారావు, రాఘవేంద్రరావు మొదలుకొని అందరూ తేల్చేసారు. ఇష్టమున్నా లేకపోయినా అమ్మాయిల్ని వేధించటం ప్రారంభమైంది.

ఈ మధ్య ఒక సినిమాలో ఒక యువతీ యువకుల జంట ప్రేమించుకుంటూ వుంటారు. ఇప్పుడు ఒక సత్రకాయ ఆ అమ్మాయికి అడ్డుపడ్డాడు. నువ్వు అతన్ని ప్రేమించు, ఫరవాలేదు. అయినా నేను నిన్ను ప్రేమిస్తున్నానని మాటిమాటికి సతాయిస్తాడు. ఇది ఖచ్చితమైన ఆబ్సెనిటి. ఆఖరికి ఆ అమ్మాయి తను తీసుకున్న నిర్ణయం సరికాదని ఈ సతాయించే సత్రకాయకి దగ్గరౌతుంది. అంటే అమ్మాయిలది నిలకడలేని మనసని, తెలివితక్కువ నిర్ణయాలు తీసుకుంటుందని, అసలు నిర్ణాయక శక్తే వాళ్ళకి లేదని ఈ చిత్రం చెప్తుంది. ఇంతకంటె దుర్మార్గం అవాస్తవికత ఉంటుందా? ఆ చిత్రం ఆర్య.

డెబ్భైయవ దశకం చివరిలో వచ్చిన కొన్ని సినిమాలు స్త్రీ వ్యక్తిత్వాన్ని బలంగా చాటటానికి ప్రయత్నించాయి. వాటిలో ముఖ్యంగా చెప్పుకోతగింది 'స్త్రీ' చిత్రం. ప్రత్యగాత్మ దీని దర్శకుడు. నిండు చూలాలైన తన కూతుర్ని అమానుషంగా హింసకి గురిచేస్తున్న అల్లుడి గుండెని తుపాకి గుండుతో కూల్చేసింది – ఆ స్త్రీ. చంద్రకళ ఆ పాత్రలో నటించింది.

అలానే ప్రతిఘటన సినిమాలో భర్తను పోగొట్టుకున్న ఓ లెక్చరర్ విజయశాంతి అవకాశం కలిగించుకుని రౌడినీ అడ్డంగా నరికింది.

అయితే ఈ సినిమాల్లోని స్త్రీ చైతన్యాన్ని మెలోడ్రామా హరిస్తుంది.

దేవదాసు మొదలుకొని ప్లాటోనిక్ లవ్ తెలుగు సినిమాల్లో ఒక ముఖ్యాంశం అయింది – శంకరాభరణం, సాగర సంగమం, మేఘ సందేశం యిలాంటి చిత్రాలన్ని ఈ ప్లాటోనిక్ లవ్‌కి నీరాజనాలు పట్టాయి.

వాస్తవికతకి దూరంగా, ప్రచారమే వెర్రిగా, మార్క్సీయ కళాతత్త్వశాస్త్ర నియమాలకే విరుద్ధంగా కొన్ని సినిమాలు వచ్చాయి. తెలుగు సినిమాల్లో సాయిబాబాని అమ్ముతారు. అలానే మార్క్స్ కూడా. శ్రామిక – అణగారిన వర్గాల్ని నమ్మలేని వీరత్వంతో రంగరించిన సినిమాలవి. దాన్ని ఒక ఉద్యమంగా ముందుకు తీసుకొచ్చినవాడు మాదాల రంగారావు. విప్లవశంఖం, ఎర్రమల్లెలు, మహాప్రస్థానం లాంటి సినిమాలతో తర్వాత ఆర్. నారాయణమూర్తి ఎర్ర సైన్యం, పోరు తెలంగానా లాంటి సినిమాలతో అదే పద్ధతిలో తీసారు. సంజీవి తెలుగోడు సినిమా తీసి ఈ సినిమాల్లో అసహజత్వం పూర్తిగా ప్రతికూల శక్తుల దౌష్ట్యం. ఒకటికి పదింతలుగా చూపబడుతుండటం. వాస్తవంగా ఆ శక్తులు ఆ సినిమాల్లో కంటె బయట కొంచెం

ఉదాత్తంగా కన్పిస్తాయి. అందువల్ల ప్రేక్షకులు ఆ సినిమాలోని పాత్రలమీద ఆవేశపడుతారేమో కాని నిజజీవితంలో అవే పాత్రల మీద అంతకుముందుకంటె కొంచెం సన్నిహితమౌతారు.

సాధించవలసిన వర్గ స్పృహ అవాస్తవికతవల్ల గాలిలో కలిసిపోతుంది. ఈ సినిమాలేవీ ఆర్థికాంశాలు చాపకింద నీరులా వ్యక్తుల తీరుతెన్నుల్ని, వ్యక్తుల మధ్య సంబంధాలని ఎలా నియంత్రిస్తున్నాయో చెప్పవు. అంతకు ముందు సాంప్రదాయ వాదులు ఉపయోగించుకున్న పరికరాలు – అర్థంపర్థంలేని కల్పనలు, శృతిమించిన నాటకీయ పెడధోరణులు, వ్యక్తి ఆరాధన, నేలవిడిచిన సాములు, సాహసాలు, వైయక్తిక ధోరణులు ఇలాంటివి చేపట్టటం ఈ ప్రయోక్తలు చేసిన తప్పులు. నేటి భారతం, దేవాలయం, ప్రతిఘటన లాంటి సినిమాలు తీసిన టి. కృష్ణ తన చెప్పే అంశాలను భావ ప్రపంచానికి (మోనాటిసిజం) ఎక్కువ ముడిపెట్టారు.

ఓ చారిత్రక అంశాన్ని, ఒక వ్యక్తి చేసిన ప్రయాణాన్ని ఘర్షణ చోటుచేసుకున్న నేపథ్యంలో వాస్తవికతతో అదీ సామాజిక వాస్తవికతతో ఒక గొప్ప సినిమా మనముందుంచాడు, గౌతమ్ ఘోష్, 'మా భూమి' సినిమా 1979. నాకైతే ఈ చిత్రం సామాజిక వాస్తవికతను అధ్యయనం చేసేవాళ్లకు ఒక హాండ్‌బుక్ అని అనిపిస్తుంది.

చిన్న చిన్న సర్దుబాట్లున్నా కె.బి. తిలక్ 1974 చిత్రం భూమికోసం, 1978 చలిచీమలు, ప్రత్యూష లాంటి సినిమాలు విమర్శనాత్మక వాస్తవికతను ప్రతిబింబించాయి.

సినిమాల్లో డ్రామా పేరున వాస్తవికతను హత్యచేసే సంఘటనలు కోకొల్లలు.

రాచకొండ విశ్వనాధశాస్త్రి గొప్ప నాటకం 'నిజం'. దేవదాసు కనకాల కనుసన్నల్లో జంధ్యాల నోటిమాటల్తో సినిమాగా తయారైంది. ఆ సినిమా 'నిజం' నిజంగా నిలబడకుండా అబద్దంగా మారింది. అర్థవిహీనమైన మార్పులు చేయటానికి ఈ నాటకం ఎందుకు తీసుకున్నారో అర్థం కాదు.

అలానే సంస్కరణ దిశగా సాగిన రంగనాయకమ్మ నవల బలిపీఠం. అందర్నీ అలరించిన నవల. దాసరి నారాయణరావు చిత్రం బలిపీఠం మీద ఆ నవలాంశాలు అడ్డంగా నరకబడ్డాయి. దానివలన ఆ సినిమా అదనంగా సాధించిందేమీ లేదు.

ఉదాత్తమైన అంశంతో వుల్ఫ్‌గేంగ్ బేకర్ దర్శకత్వంలో 2003లో గుడ్ బై లెనిన్ ముందుకొచ్చింది. తూర్పు జర్మనీ ప్రజ సోషలిస్టు వ్యవస్థని పోగొట్టుకొని గోడతో పాటు ఛిద్రమైన జీవితం గురించి చెప్తుంది. ఈ సినిమాలోని అంశాన్ని చాలా అన్యాయంగా ఉపయోగించుకోవటం శ్రీనువైట్ల తీసిన 'దూకుడు' చిత్రంలో చూస్తాం.

అలానే 2004లో వాల్టర్ సల్లెస్ చేగువేరా తన డాక్టరీ ముగించుకొని తన మిత్రుడితో చేసిన దక్షిణ అమెరికా ప్రయాణాన్ని మోటర్ సైకిల్ డైరీస్‌గా తీసాడు, ఓ మెలోడ్రామాటిక్ ఎలిమెంట్‌గా ఆ చిత్రాన్ని సాఫ్ట్‌వేర్ ఇంజనీర్స్‌లలో ప్రస్తుత ఉదాసీనతలు ఉదాత్తత్తని చాటే ఓ చెత్త చిత్రంగా క్రిష్ 'గమ్యం' తీసాడు.

లంపెన్ కారెక్టర్స్‌తో ఫోర్స్‌డ్ డ్రామాని సృష్టించి అదంతా ఓ సంచిలో కుక్కేసిన, సినిమా వేదం. దాన్ని కూడా క్రిష్ తీసాడు.

నిన్నటికంటె ఈ రోజు వాస్తవం అర్థం చేసుకోవటం చాలా క్లిష్టమైంది. గ్లోబలైజేషన్ నేపధ్యంలో కార్పొరేట్ల అధికారం మరింత బలంగా తయారైంది. ఎన్నో సంవత్సరాలు కార్మికులు సాధించుకున్న హక్కులు ఈ గాలికి కొట్టుకుపోయాయి. ఆఖరికి ప్రకృతి మానవుడుకి ప్రసాదించిన నేల, నీరు, గాలి లాక్కోబడుతున్నాయి. మన పిల్లలు సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లై మెటీరియల్ ఫెటిసిజంలో భాగమై సమస్యల మూలాల్లోకి వెళ్ళటానికి నిరాకరిస్తున్నారు. వారి భావాలకి అనుగుణమైన సర్వీస్‌తో చాలా ఎన్జీవోలు ముందుకొస్తారు. ప్రజా ఉద్యమాలపై వ్యతిరేకత, చేజిక్కించుకోవడం. ఎన్నో విషయాలు సినిమాలకి వస్తువు. కాని పాలక వర్గాల్ని కార్పోరేట్లు చే మనం పరాయీకరణ చెందే అంశాల మూలాలని అన్వేషిస్తూ వాటిని అధిగమించే అవకాశాలను వాస్తవంగా సమీక్షించే వాస్తవికత మన సినిమాల్లో చోటు చేసుకోవాలి. దానికి తార్కిక ఆశావాదం చుక్కాని కావాలి. అప్పుడు మాత్రమే తెలుగు సినిమా జనం సినిమా అవుతుంది.

25. భావజాల మాధ్యమంగా సినిమా

- యస్. జీవన్ కుమార్

వరంగల్ ఫిల్మ్ సొసైటీ, సెల్ : 9848986286

సినిమాను ఒక కళగా అంగీకరించడానికి చాలామంది ఆలోచనా పరులు తటపాయిస్తూంటారు. సినిమాను ఒక జనరంజక కల్పనలాగానే చూస్తున్నారు. సినిమాలో మల్టీ డైమెన్షనల్ కళలు మిళితమై ఉన్నాయనేది వాస్తవం. కళ్ళకు కనిపించే దృశ్యాలు, వినిపించే సంభాషణలు, హావభావాలు, నృత్యం, చిత్రకళ, హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలన్ని మిళితమై ఉంటాయి. సాహిత్యంలాగా మన ఆలోచనల్ని రేకెత్తిస్తుంది, మనల్ని ప్రశ్నిస్తుంది. ఉల్లాసాన్ని కలిగిస్తుంది. దృశ్యంలో శ్రవణం, నాటకీయత ఉండడం వల్ల వీక్షకుడు కొంతసేపు దాంట్లో లీనమై పోతాడు. ఒక కథనో, నవలనో చదువుతున్నప్పుడు కూడా పాఠకుడు లీనమౌతాడు. కొంతసమయం ఇచ్చి పాఠకుడు పఠనాన్ని కొనసాగిస్తాడు. కాని సినిమాలో ఏకబిగిన వీక్షకుడు సన్నివేశంలో మమేకం అయిపోతాడు. ఇవన్ని అంశాలు ఉన్నప్పటికీ సినిమా మాధ్యమం ఎక్కువగా వినోద ప్రచార సాధనంగానే చెలామణి అవుతుంది. ఒక సీరియస్ కళగా పరిగణించడానికి రకరకాల అభిప్రాయాలు వ్యక్తపరచి నిరాకరిస్తున్నారు. ఇది ఒక జనరంజకమైన కళారూపాల, సాంకేతిక సంకలనమని, ఇది ఒక ఇండస్ట్రీ అని, ఇందులో పెట్టుబడి పాత్ర చాలా ఉందని, అందువల్ల బాగా డబ్బున్న వాళ్ళ చెప్పుచేతుల్లో బందీగా ఉండి, అసలు సిసలైన కళకు ఉండే అటానమీ, స్వతంత్రత, స్వేచ్ఛ లేకుండా పోయింది అని ఒక వాదన.

సినిమా ఒక శక్తివంతమైన కళ. అభివృద్ధి చెందుతున్న సాంకేతిక పరిజ్ఞానంతో కళలన్నింటిని సమన్వయం చేసుకోగల శక్తి ఒక సినిమాకు మాత్రమే ఉందనేది వాస్తవం. అయితే సినిమా సమాజంలో సంస్కృతి రంగాన్ని పెద్దగా ప్రభావితం చేసినట్టు ప్రపంచ దేశాల్లో ఎక్కడా మనకు కనబడదు. సమాజంలోని పరిస్థితులను ప్రతిబింబించి, సందేశాన్ని వీక్షకులకు అందించేందుకు ఎక్కువగా దోహద పడ్డట్టుగా మనకు కనిపిస్తుంది. నాటకాలు, యక్షగానాలు, తోలుబొమ్మలాటలు మన దేశంలో, ఇంకా రకరకాల నటనా కళాకృతులు ఇతర దేశాల్లో ప్రజలకు అనుభవంలో ఉన్నాయి. తెరవెనుక కాంతి, మాటలు అందించి ప్రామ్‌టింగ్, సూత్రధారి, సంగీతం, నేపధ్య సంగీతం నాటకాలలో, ఇతర ప్రక్రియల్లో ప్రజలు వీక్షించారు. దీనికి పునాదిగా

తెరమీద బొమ్మలు చూడటం ప్రేక్షకులకు అలవాటైంది. అన్నీ మిళితమైన ప్రక్రియ కాబట్టి సినిమాకు చాలా ఆదరణ లభించింది.

రష్యాలో లెనిన్ నాయకత్వంలో నడిచిన రష్యా విప్లవం అన్ని రకాల ప్రజలను ఒక తాటి మీదికి తీసుకొచ్చింది. ప్రజా బాహుళ్యంలో ఉన్న ఎన్నో కళారూపాలు, వాటిని సృష్టించి, కళాకారులు విప్లవంలో పాలుపంచుకున్నారు. నాటకం, చిత్రకళ, సాహిత్యం, సంగీతం లాంటి ఎన్నో కళలు ఉబికి వస్తున్న కొత్త ప్రజాచైతన్యాన్ని తమలోకి మిళితం చేసుకున్నాయి. అలాగే రష్యాలో విప్లవం భావంగా ప్రజలను ప్రభావితం చేసింది. సినిమా రంగంలోకి అనేక సంస్కృత రంగాల నుంచి చాలామంది ప్రవేశించడం జరిగింది. సినిమా కళారూపాన్ని ఒక భావ ప్రచార సాధనంగా ఉపయోగించడం జరిగింది. 1895లో మేరీ బ్రదర్స్ పారిస్‌లో మొదటి సినిమా ప్రదర్శించిన విషయం మనకు తెలిసిందే. 1896లో బడెస్సా న్యూస్ అనే పత్రికలో సైన్సుకీ ప్రజల పురోభివృద్ధికి సినిమా చేసే మేలు గురించి మొదటిసారి ఒక వ్యాసం ప్రచురితమైంది. మొదటిసారి సినిమా ప్రదర్శన చూసి వచ్చిన తరువాత ప్రముఖ నవలాకారుడు టాల్‌స్టాయ్ "సినిమాలోని చిత్రీకరణ వేగాన్ని, హావభావ వ్యక్తీకరణల్ని నేను సాహిత్యంలో రాయలేకపోయాను" అని చాలా వ్యధ చెందాడట. 1905లో రష్యా విప్లవం సమయంలో జరిగిన ఒక ప్రజల భారీ ఊరేగింపును కెమెరామన్ చాలా ప్రభావితంగా చిత్రీకరించాడు. జార్ ప్రభుత్వ పోలీసులు దాన్ని స్వాధీనం చేసుకొని ప్రదర్శించకుండా అడ్డుకున్నారు. కొద్దికాలం తర్వాత సామాజిక విషయం సబ్జెక్ట్‌గా రావడం మొదలైంది. అంతకు ముందు ప్రేక్షకులు సినిమాల్లో, ఇతర కళారూపాలలో పాలకవర్గ భావజాలాన్ని మాత్రమే చూసేవారు. క్రమక్రమంగా ప్రజల ఉద్యమాలు, ఉద్యమ సంఘటనలు చూడటం మొదలైంది. జార్ ప్రభుత్వ పాలనలో ఉన్న పరిస్థితుల వల్ల రష్యన్ సినిమా చాలా ఇబ్బందులు ఎదుర్కొనవలసి వచ్చింది. కొత్తగా ప్రారంభమయిన వినోదం కలిగించే సినిమాల వల్ల అభ్యుదయ సినిమా రంగం రష్యాలో చాలా ఆటంకాలు ఎదుర్కొంది. అయినా ఈ ప్రాథమిక దశలో కూడా కొన్ని మంచి చిత్రాలు రష్యాలో నిర్మించబడ్డాయి. మ్యాక్జిమ్ గోర్కి, మయకొవస్కీ లాంటి ప్రముఖ రచయితలు కూడా సినిమా కళపై ఎంతో ఆసక్తి చూపెట్టారు.

చైనాలో మొదటి చిత్రం "వర్కర్స్ లివింగ్ ది పార్టీ, 1895లో విడుదలయింది. కొంతకాలం తర్వాత జపాన్, అమెరికా కంపెనీల సహకారంతో పూర్తి వినోద

చిత్రాల నిర్మాణం జరిగింది. 1931లో సినిమా పూర్తిగా కమ్యూనిస్టు పార్టీ సానుభూతిపరుల చేతుల్లోకి వచ్చింది. అప్పటి నుండి అభ్యుదయకర చిత్రాలు చేయడం ప్రారంభం అయింది. కొమిటాంగ్ రియాక్షన్ రీలు రంగంలోకి వచ్చిన తర్వాత సినిమాపై చాలా నిర్బంధం పెరిగింది. సెన్సారు నిబంధనలు కఠినతరం చేసారు. ఈ సమయంలో సినిమాలు దాదాపుగా రహస్యంగా నిర్మితమైనాయి. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో ఇంగ్లాండు, ఫ్రాన్స్, జర్మనీ దేశాలేకాకుండా తటస్థంగా ఉన్న అమెరికా కూడా సినిమా కళని తమ అవసరాలకనుగుణంగా ప్రచారం కోసం వాడారు. 1930 దశకంలో అమెరికాలో కార్మికుల సమస్యలపై చిత్రాలు తీయబడ్డాయి. అప్పటికే హాలివుడ్ చిత్రాల ఒరవడిని నిరసిస్తూ కొంతకాలం కార్మికుల సమస్యలు, వాళ్ళ జీవితాలపై సినిమాలు చేసారు. రెండవ ప్రపంచ యుద్ధం కాలంలో నిర్మించిన సినిమాలన్ని యుద్ధ విధ్వంసం ఇతివృత్తంగా నిర్మితమైనాయి. ప్రపంచ వ్యాప్తంగా చిత్ర నిర్మాణం శరవేగంగా పెరగడానికి రెండవ ప్రపంచ యుద్ధం చాలా ప్రేరణ ఇచ్చింది. క్యూబా నుండి మొదలుకొని చాలా ల్యాటిన్ అమెరికన్ దేశాలలో సమాజ మార్పు కోసం పోరాటాలు జరిగాయి. ఈ దేశాలలో సినిమా దాదాపుగా ప్రజలను విప్లవోన్ముఖులను చేయడానికి ఒక సాధనంగా వాడబడింది. అర్జెంటీనా, బ్రెజిల్, బొలివియా తదితర దేశాల్లో సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా డాక్యుమెంటరీ సినిమాలు ప్రాచుర్యం పొందాయి. ఘటనల్ని ప్రధానంగా చేసుకొని వార్తాచిత్రాలు నిర్మించారు. ఈ దేశాలలో చాలా డాక్యుమెంటరీలు నిషేధింపబడ్డాయి. చిత్ర నిర్మాణం దాదాపుగా రహస్యంగా జరిగేది. చిత్ర ప్రదర్శనలు కూడా ఒక విప్లవ కార్యక్రమంగా రహస్యంగా ప్రదర్శింపబడుతుండేవి.

భారతదేశంలో సినిమా కళ చాలా మార్పులకు లోనౌతూ వచ్చి, ఇప్పుడున్న పరిస్థితుల్లో దాదాపుగా వినోద ప్రధానమైనదిగా కొనసాగుతుంది. 1913వ సంవత్సరంలో దాదాసాహెబ్ పాల్కే నిర్మించిన 'రాజా హరిశ్చంద్ర' మొదటి చిత్రం. తర్వాత 1931లో అర్దేశిర్ నిర్మించిన 'ఆలమ్ అరా' మొదటి టాకీ చిత్రంగా చరిత్ర చెప్పుతుంది. పౌరాణిక గాధలతో ప్రారంభమైన భారతీయ సినిమా క్రమక్రమంగా చారిత్రక, కుటుంబ సమస్యల, నవలల ఆధార సినిమాలుగా చలామణిలోకి వచ్చింది. పెట్టుబడి సినిమా నిర్మాణంలో మౌళికమైన అంశం కాబట్టి, అభ్యుదయ సినిమాలు గాని పెట్టుబడిదార్ల, భూస్వామ్య వ్యవస్థను మార్చడానికి జరిగే ఆందోళన గురించి ఎక్కువగా సినిమాలు రాలేదు. 1947లో ఆధునిక సినిమా బెంగాళీ దర్శకుడు

సత్యజిత్‌రాయ్ నిర్మించిన 'పథేర్ పాంచాలి'తో పాటలు, డాన్సులు, హాస్యంలేని సామాజిక వాస్తవాలకు దగ్గరగా ఉండే సమాంతర సినిమా నిర్మాణం ప్రారంభం అయింది. అదే సమయంలో చేతన్ ఆనంద్, దేవకీబోస్, ఎస్.వి. వాసన్, నితిన్‌బోస్ సినిమా కథావస్తువుల్లో సామాజిక వాస్తవికత ప్రతిబింబించే చిత్రాల నిర్మాణం కోసం కృషి చేసారు. బిమల్ రాయ్ సామాజిక రుగ్మతల అంశాలపై బ్రహ్మాండమైన సినిమాలు తీసారు. కొన్ని ప్రేమకథలు వస్తువులుగా సినిమాలు తీసినా, మృణాల్ సేన్, రుత్విక్ ఘటక్, ఎమ్.ఎస్. సత్యులాంటి వాళ్ళు కొన్ని సీరియస్ సినిమాలు తీసారు. సినిమా మాధ్యమాన్ని, సామాజిక పరిస్థితులను ప్రభావ వంతంగా వాడటానికి చాలా కృషి చేసి విజయం సాధించారు. ఈ సినిమాలు ప్రజాస్వామిక వాదుల్ని, ఆలోచనా పరులను కదిలించాయి. సినిమా మాధ్యమం గురించి చర్చ కూడా ప్రారంభం అయింది. ఈ పరంపర కన్నడ, మళయాళం సినిమా రంగంలో కూడా కొనసాగింది. గిరీశ్ కాసరవల్లి, గిరీష్‌కర్నాడ్, అరవిందన్, జి.వి. అయ్యర్, గోవింద్ నిహలాని, అదూర్ గోపాలకృష్ణలాంటి వాళ్ళు సినిమాను ఒక క్రియాశీలక కళగా, మాధ్యమంగా పరిగణించి ప్రయోగాలు చేసి చూపెట్టారు.

ఆంధ్రప్రదేశ్‌లో తెలుగు సినిమా పురాణాలు, భక్తి, ఇతిహాసాలు కథావస్తువుగా మొదలై చాలా నెమ్మదిగా రూపాంతరం చెందింది. మొదటి దశకంలో నిర్మాతలుగా వారంతా దాదాపు భూస్వామ్య, ధనిక వర్గానికి చెందినవారు కావడంలో సినిమాను ఒక వ్యాపారంగానే భావించారు. 'రైతుబిడ్డ' లాంటి సినిమాలు కొన్ని మినహాయిస్తే, సినిమా ఒక మనోరంజక మాధ్యమంగానే భావించారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో గాంధీజీ హరిజనోద్యమం, రాజారామ్మోహన్‌రాయ్ సంస్కరణోద్యమాల ప్రభావం సినిమా కథావస్తువును ప్రభావితం చేసింది. ఆ సమయంలో 'మాలపిల్ల' 'మళ్ళీ పెళ్ళి' 'పెద్ద మనుషులు', 'కన్యాశుల్కం' లాంటి సినిమాల నిర్మాణం జరిగింది. సినిమా రంగం క్రమక్రమంగా ఒక ఇండస్ట్రీగా తయారయింది. ప్రొడక్షన్ డిస్ట్రిబ్యూషన్, ఎగ్జిబిషన్ ప్రధాన అంశాలైనాయి. రెడీమేడ్ కథలు, కుటుంబ చిత్రాలు, భావోద్వేగాలకు అప్పీల్ చేసే సినిమాలు ప్రాచుర్యంలోకి వచ్చాయి. 1965 కల్లా "మసాలా" సినిమాల నిర్మాణం ప్రారంభం అయింది. కళపైన ఎటువంటి అవగాహన లేని నిర్మాతలు, దర్శకులు 'క్విక్‌మనీ'ని మాత్రమే దృష్టిలో పెట్టి దృశ్య, శ్రవణంలో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉద్రేకతలు, మానసిక ఆనందాన్ని కలిగించే మాధ్యమంగా తయారుచేసి, ఇప్పటికి అదే ధోరణిలో సినిమాలు తీస్తున్నారు.

అయితే తెలుగు చిత్రసీమలో సందేశాత్మక చిత్రాలతో బాటు సమాంతర ఆర్ట్ సినిమాలు తీసే ప్రయత్నం జరిగింది. మాభూమి, రంగుల కల, సిటీ, అంకూర్, ఉపకార్, హరిజన్ లాంటి సినిమాలు వచ్చాయి. గానం, నృత్యం, భీకర సన్నివేశాలు, ఫైటింగ్ లాంటి అన్ని అంశాలు మిళితం చేసి 'ప్రజా సినిమా'గా మాదాల రంగారావు, దాసరి, నారాయణమూర్తి సినిమాలు కూడా వచ్చాయి. నారాయణ మూర్తి నిజాయితీగా సామాజిక అంశాలు కథావస్తువులుగా తీసుకున్నప్పటికి, ఆ సినిమాలు పెద్దగా ప్రజల్లోకి వెళ్ళలేదు. సామాజిక వాస్తవాలను ప్రతిబింబించి, ఒక సందేశాన్ని, కర్తవ్యాన్ని సూచించే సినిమాలు ప్రపంచవ్యాప్తంగా నిర్బంధానికి గురైనాయి. కొన్నింటికి సెన్సార్ సర్టిఫికెట్లు లభించలేదు. కొన్ని నిషేధానికి గురైనాయి. ఎక్కువగా మొదటి ప్రపంచయుద్ధ సమయంలో, రష్యాలో విప్లవం సమయంలో, హిట్లర్ విజృంభించి మారణహోమం కొనసాగిస్తున్న కాలంలో చాలా సినిమాలు నిషేధింపబడ్డాయి.

సినిమా మాధ్యమం ఇంత ప్రభావవంతం కావడం, పరిస్థితులను ప్రభావవంతం చేసే శక్తి ఉన్నదానిగా గుర్తించిన ఆలోచనాపరుల, మేధావంతుల, వామపక్ష భావజాలం గలవాళ్ళు, సున్నితత్వం గలిగిన రచయితలు ఈ మాధ్యమం గురించి ఆలోచించడం చర్చించడం ప్రారంభం అయింది. దీంట్లో భాగంగానే లండన్‌లో 1935లో 'ఫిలిం సొసైటీ' ప్రారంభం అయింది. హెచ్.డి.వెల్స్, జార్జ్‌బెర్నార్డ్‌షా, ఆంటోని ఆస్కిన్, సిడ్నీ బర్‌చెస్టన్, ఎవర్‌మాంటిగ్ లాంటి ప్రముఖ రచయితలు మేధావులు సొసైటీ వ్యవస్థాపక సభ్యులుగా ఉన్నారు. రష్యానుంచి నిషేధింపబడ్డ, సెన్సారు బారిన పడిన సినిమలను తెప్పించుకొని ప్రదర్శించేవారు. సినిమా చర్చలు జరిగేవి. పత్రికల్లో వ్యాసాలు రాసేవారు. కొద్దికాలంలోనే ఇంగ్లాండ్‌లోని పలు నగరాల్లో 'ఫిలిం క్లబ్బులు' ప్రారంభించబడి, బ్రిటిష్ ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీస్ ఏర్పడింది. సమాంతర సినిమా మాధ్యమంపై, సినిమాను కళగా వీక్షించేవాళ్ళ అభిప్రాయాలతో ఈ సొసైటీలు చిన్న చిన్న పత్రికలు కూడా నడపడం ప్రారంభించాయి. 1939లో రెండవ ప్రపంచ యుద్ధకాలంలో వీటి కార్యక్రమాలు ఆగిపోయాయి. యుద్ధం ముగియగానే ప్రపంచ వ్యాప్తంగా ఫిలిం సొసైటీలు పెద్ద ఎత్తున ప్రారంభం అయ్యాయి. స్పెయిన్, అమెరికా, ఫ్రాన్స్, హంగరీ, జర్మనీ, కెనడా, కొలంబియా, పోలాండ్ దేశాలలో ఫిలిం సొసైటీలు ప్రారంభం అయ్యాయి. కథా రీత్యా సామాజిక అంశాలను ప్రస్తావించే, టెక్నిక్ రీత్యా

ప్రయోగాత్మకంగా తయారయ్యే సినిమాలను ప్రదర్శించడం, చర్చించడం చేస్తుండేవారు. సినిమా అప్రిషియేషన్ కార్యక్రమాలు కూడా నిర్వహించేవారు.

మన దేశంలో సత్యజిత్‌రాయ్ కలకత్తాలో తొలి ఫిలిం సొసైటీ స్థాపించాడు. ఆయన అప్పటికే విక్టోరియా డిసికా నిర్మించిన 'బైసికిల్ తీవ్స్' చూసిన ప్రేరణతో పధేర్ పంచాలి సినిమా నిర్మిస్తున్నాడట. త్వరలో ఢిల్లీ, బాంబే, పూనా, మద్రాస్ పట్టణాలల్లో ఫిలిం సొసైటీలు ప్రారంభం అయినాయి. ఈ సొసైటీలలో సభ్యత్వం ఉన్న వాళ్ళను ఈ సొసైటీలు ప్రదర్శించే ప్రత్యేకమైన సినిమాలకు అనుమతించేవారు. 1959లో "ఫెడరేషన్ ఆఫ్ ఫిలిం సొసైటీస్ ఆఫ్ ఇండియా" ఏర్పడింది. దేశంలోని అన్ని సొసైటీలకు అనుసంధానకర్తగా ఫెడరేషన్ ఉంటూ పనిచేయడం ప్రారంభించింది. ఫిలిం సొసైటీలు ప్రదర్శించే సినిమాలను వినోదపు పన్ను నుంచి మినహాయింపు కోసం ఫెడరేషన్ ప్రయత్నించి సాధించింది. ఫిలిం ఆర్కైవ్స్ ఏర్పాటుకు కృషిచేసి, ప్రభుత్వంచే బడ్జెట్ కేటాయింపులు చేయించింది. ప్రధాని నెహ్రూ కూడా ఈ సంస్త కార్యక్రమాల పట్ల సానుభూతితో వ్యవహరించి ఫిలిం డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటుకు దోహదపడ్డారని అంటారు. ఫిలిం సొసైటీ ఒక ఉద్యమంగా భావించి సత్యజిత్ రేయ్‌తో సహా మృణాల్‌సేన్, ఎమ్. సమ్యా, గోవింద్ నిహలానీ, శ్యాంబెనగల్, అరవిందన్ లాంటి ప్రముఖులు ఎందరో ఈ ఉద్యమంలో పాలు పంచుకుని స్ఫూర్తినిచ్చారు. 1965లో అదూరి గోపాలకృష్ణ నేతృత్వంలో కేరళ ఫిలిం సొసైటీలు చిన్న నిడివిగల డాక్యుమెంటరీలు, తక్కువ బడ్జెట్‌లో కొన్ని చిత్రాలు కూడా నిర్మించాయి.

1975లో వరంగల్‌లో కొందరు ప్రజాస్వామిక వాదులు, మేధావులతో కలసి **వరంగల్ ఫిలిం సొసైటీ** ప్రారంభించా. అంతకు మూడు సంవత్సరాల క్రితం ప్రారంభం అయిన 'విజయవాడ ఫిలిం' సొసైటీని స్ఫూర్తిగా తీసుకొని వరంగల్‌లో ప్రారంభించాం. అప్పుడు వరంగల్‌లో ఉన్న ప్రజాస్వామిక వాతావరణం సామాజిక మార్పుకోసం జరుగుతున్న నక్సలైట్ ఉద్యమ కార్యకలాపాల వల్ల ఫిలిం సొసైటీ ఉద్యమం బాగా ప్రాచుర్యం పొందింది. నేను ఆ సమయంలో పౌరహక్కుల సంఘం కార్యదర్శిగా, సొసైటీకి కూడా కార్యదర్శిగా ఉండటం వల్ల సొసైటీపై పోలీసుల నిఘా ఉండేది. రహస్య జీవితంలో ఉన్న కార్యకర్తలు కూడా మేం ప్రదర్శించే సినిమాలకు వస్తారని పోలీసులు అనుమానించి నిఘా పెట్టేవారు. ఫిలిం సొసైటీ

సమాచారం విధిగా కలెక్టర్‌కు, ఎస్.పి.కి పంపవలసి ఉండేది. కొస్తాగవరీస్ నిర్మించిన 'జెడ్' అనే అల్జీరియా సినిమాతో సహా దాదాపు రెండుసార్లు ఫిలిం అప్రిషియేషన్ కోర్సులు, సత్యజిత్ రాయ్ ఫిలిం ఫెస్టివల్, చార్లీ చాప్లిన్ ఫిలిం ఫెస్టివల్‌లు నిర్వహించింది. అప్పటికి ప్రపంచంలో చాలా గొప్పవిగా చెప్పబడే 40 చిత్రాలలో 22 చిత్రాలు ప్రదర్శించింది. 'చిత్రరీతి' అనే పేరులో ఒక మాసపత్రిక నడిపింది. సినిమాలు ప్రదర్శించే సమయంలో రామానంద సాగర్ 'రామాయణ', తర్వాత 'మహాభారత్' సినిమాలు టివిలలో ప్రసారం, కలర్ టివిలు, డివిడిలు, సిడీలు మార్కెట్లో రావడం, ఇంకా ఇతర సమస్యలతో ఫిలిం సొసైటీ కార్యక్రమాలు తగ్గుముఖం పట్టాయి. ఇప్పటికి సొసైటీ వుంది. ఎప్పుడైనా ప్రొజెక్టర్ సహాయంతో డాక్యుమెంటరీల ప్రదర్శన జరుగుతుంది.

ఇప్పుడు డబ్బు లేనిదే సినిమా లేదు. లాభాల కోసమే సినిమాలు ప్రారంభించినాక క్రమక్రమంగా వ్యాపార ధోరణి పెరుగుతూ కళా, సాహిత్య విలువలు తగ్గాయి. సాంకేతిక పరిజ్ఞానం బాగా అందుబాటులోకి వచ్చిన తర్వాత అవాస్తవ కథాచిత్రాలైన ఫాంటసీలు ప్రాచుర్యం పొందాయి. మూడు గంటలు ప్రేక్షకులను మాయా ప్రపంచంలో కూర్చోబెట్టడమే ఇప్పుడు సినిమాలు చేస్తున్న పని. అయితే సాంస్కృతిక ఉద్యమంలోకి సినిమా చొచ్చుకుపోవాలంటే చాలా కృషి జరగవలసి ఉంటుంది. సహకార సొసైటీలు ఏర్పరచుకొని తక్కువ డబ్బుతో చిత్రాల నిర్మాణానికి కృషి జరగాలి. డాక్యుమెంటరీ చిత్రం ప్రక్కకు పోయింది. దాన్ని మళ్ళీ తెరమీదకు తేవాలి. **సామాజిక విలువల ఆధారిత సినిమా రావాలి.** సినిమా పూర్తిగా వినోద సాధనం మాత్రమే కాదు అనే విషయాన్ని పటాపంచలు చేస్తూ ఒక ప్రత్యామ్నాయ సినిమాను చూపెట్టగలిగినప్పుడు సామాజిక, సాంస్కృతిక రంగంలో సినిమా తన పాత్రను నిరూపించుకొనగలదేమో.

26. మంచి సినిమా అంటే?

– డా॥ సి.ఎ. ప్రసాద్, సింగరాయకొండ
ప్రజా సైన్స్‌వేదిక రాష్ట్ర అధ్యక్షులు, సెల్ : 9030162177

మంచి సినిమా అంటే? అసలు సినిమా మన జీవితంలో ఒక ముఖ్య భాగంగా మారిపోవడం గమనిస్తున్నామా? సినిమా ఫీల్డుకు ఎందుకు ఇంత ప్రాధాన్యత? ఈ విషయం గూర్చి ఆలోచించడం, చర్చించడం అవసరం. 1930 తర్వాత మొదలయిన తెలుగు సినిమా ప్రధానంగా ఆనాటి విలువలు, వాతావరణాన్ని తనలో ఇముడ్చుకుంది. నాటి సామాజిక సమస్యలు, వాటికి ఆనాటికి ఆలోచించుకున్న పరిష్కారాల వెలుగులో వెండితెర కొనసాగేది. తర్వాత రోజుల్లో కూడా ఒకవైపున వ్యాపారపరమయిన మసాలాల్ని కలుపుకుంటూనే, మరోవైపున సమాజంలో ఉన్న కట్టుబాట్లు, విలువలు, ప్రేమ, త్యాగం వంటి వాటిని కథలో భాగంగా సున్నితంగా చెప్పడం గమనించవచ్చు. సామాజిక చైతన్యం, వ్యాపారపు విలువలు కలిపి సినిమా తీసిన రోజులవి. మనిషిలోని మంచితనాన్ని, సానుకూల మనస్తత్వాన్ని పెంచడానికి ఎంతో కొంత కృషి ఆనాటి సినిమా రంగం చేసింది. హిందీలో శాంతారాం, బెంగాలీలో సత్యజిత్‌రే వంటి ప్రముఖులు తెలుగులో గూడవల్లి రామబ్రహ్మం వంటి ఎందరో ఈ రంగాన్ని విలువలతో కూడిన సినిమాలతో అలంకరించారు. ఆ తర్వాతి రోజుల్లో కొంచెం వ్యాపార ధోరణి పెరిగినా ఆదర్శాలను, ఆశయాలను ఏదో విధంగా సినిమాల్లో చూపించే ప్రయత్నాలు జరిగాయనేది వాస్తవం. వ్యాపారపరమయిన నిబద్ధత ఉన్నప్పటికీ సామాజిక బాధ్యతతో సినిమాలు తీసిన దర్శక నిర్మాతలు, రచయితలు, సంగీతకారుల్ని మనం అభినందించాలి. తర్వాత కాలంలో ప్రపంచవ్యాప్తంగా వచ్చిన మార్పులు అన్ని సామాజిక రంగాలలో లాగానే సినిమా మీద కూడా విపరీత ప్రభావం చూపాయి. ఏ విలువలతోనూ పనిలేదనీ, పక్కవాడ్ని తోసి నువ్వు పరుగులు పెట్టాలనీ మనకోసం, మన బతుకు కోసం ఏమైనా చేయొచ్చనే భావం సినిమాల్లో ఎక్కువైంది. విపరీతమయిన హింస, సెక్స్ వంటివి ఎంత ఎక్కువయితే అంత బాగా సినిమాలు ఆడతాయనే నమ్మకం మొదలైంది. ప్రశ్నించడాన్నీ, తర్కించడాన్నీ నిలువరించి ఆలోచించడాన్ని నిర్వీర్యం చేస్తున్న ఇలాంటి విజువల్ మీడియాకి ప్రతిగా ప్రశ్నించే తత్వాన్ని రేకెత్తించడానికి, ఆలోచించే స్వేచ్ఛను అభివృద్ధి చేయడానికీ, ఆరోగ్యకరమయిన విలువల్ని గూర్చి చూపించడానికి, ఆశావాద దృక్పథంతో కూడిన ఆచరణ నేర్పించడానికి నేటి సినిమా ఓ ముఖ్యమయిన భూమిక కావాలి. అలా **మార్పుకి సారథ్యం వహించేదే మంచి సినిమా.**

అందుకే మంచి సినిమా వంటి గ్రూప్స్ చాలా అవశరమని నా నమ్మకం.

అనుబంధం – 1

సినిమా ఒక సామాజిక కార్యాచరణ

(మంచి సినిమా వాట్సప్‌గ్రూపులోని కొద్దిమంది మిత్రులు, సభ్యులు సినిమా సొసైటీల గురించి కొన్ని ప్రశ్నలడిగారు. అప్పటికప్పుడే వాటికి జవాబులు ఇచ్చాను. పాఠకులకి ఉపయుక్తంగా ఉంటుందని వాటినిలా అనుబంధంగా చేర్చడం జరిగింది)

ప్ర) **మంచి సినిమాలు అందరికీ అందుబాటులో లేని రోజుల్లో సొసైటీల అవశరం ఉండేది. ఇప్పుడు సినిమాలన్నీ నెట్‌లోనే దొరుకుతున్నాయ్. అలాంటి కాలం చెల్లిన సొసైటీల అవసరం ఈ రోజు ఏముంది?**

జ) సినిమాలు చూడ్డానికీ – చూపించడానికీ అయితే సొసైటీలు అవసరం లేదు. మాల్సు, హాల్సు, నెట్లూ ఆ పని చేస్తున్నాయి. కానీ సినిమాను కేవలం వ్యక్తిగత వినోదం కోసం ఆశ్రయించే వాణిజ్య పరికరంగా కాక సమిష్టిగా వ్యక్తమయ్యే సామాజిక మాధ్యమంగా భావించేవారు అలాంటి కలెక్టివ్ ప్రయత్నాలు చేయడం మంచిదని నా అభిప్రాయం. మానవీయ స్పృహను విస్తృతపర్చే యత్నాలు సమాజంలో ఎప్పటికప్పుడు జరుగుతూనే ఉండాలి. కాలం చెల్లిందని ప్రచారం చేయబడుతోన్న సాహిత్యాన్ని గురించీ బుక్ క్లబ్‌లు, లైబ్రరీలు కళల్ని గురించి నాటక సమాజాలు ఎంత అవసరమో మంచి సినిమాల గురించి ప్రచారం చేసే సొసైటీలు, కలెక్టివ్‌లు అంతే అవసరం.

మానవాళి అలవర్చుకోవాల్సిన సమున్నత విలువల వెలుగులో ఇలాంటి ప్రయత్నాలన్నీ భావితరాల ఆలోచనాపరులకి మరింత స్ఫూర్తినిచ్చేలా మన ఆదర్శాలు, ఆచరణ ఉండాలే కానీ నిర్లిప్తతను పెంచేలాగానో, నిద్ర పుచ్చేలాగానో కాదని నా అవగాహన. అందుకు ఎవరి పరిమితుల్లో వారు చేయదగిన పని, అదేదైనా సమాజానికి ఆ మేరకు ప్రయోజనం చేకూర్చేదేననుకుంటాన్నేను.

ప్ర) **సినిమాల్లో హీరో, హీరోయిన్స్ ఫ్యామిలీ అంతా మందు తాగే సీన్స్ ఎక్కువగా ఉంటున్నాయ్. మందు తాగడం కామన్ అనే ఫీలింగ్ కల్గించేలా యువతపై ప్రభావం ఉంటోంది. ఏదో మొక్కుబడిగా పొగాకు, మద్యం హానికరమని కిందన చూపిస్తున్నారు?**

జ) నిజమే. ఒక్క మద్యపానమనే కాదు మితిమీరిన హింసోన్మాదం, మానవ సంబంధాలకి సంబంధించిన సున్నితత్వంపై ఏ మాత్రం గౌరవ భావం లేని పాత్రల్ని సృష్టించడం వంటి వెకిలి చేష్టలు చాలా చేస్తున్నారు. అయితే అలాంటి సినిమాల్ని తిడుతూ కూర్చోడం కంటే మానవీయ కోణంలో మూస చిత్రాలకి భిన్నంగా నిర్మించబడిన ప్రత్యామ్నాయ సినిమాలను స్వాగతించే, ప్రోత్సహించే

ఆరోగ్యకరమయిన సాంస్కృతిక వాతావరణాన్ని ఏర్పర్చుకునేందుకు కృషి చేయడం మంచిదని నా ఉద్దేశం.

మంచి సినిమా మంచి సమాజానికి ప్రతీక. అదే సమయంలో మంచి సినిమా మంచి సమాజం కోసం జరిగే ప్రయత్నాలన్నింటికీ భరోసా. అందుకే సహృదయులంతా ఎక్కడికక్కడ చిన్న చిన్న బృందాలుగా ఏర్పడి ఫిల్మ్‌సొసైటీలు ఏర్పాటు చేసుకుంటే బాగుంటుంది. ఇప్పటికిప్పుడే ఇలా చేయమని కాదు గానీ ఆ దిశగా భవిష్యత్తులో కార్యరూపం దాల్చేలా మిత్రులంతా ఆలోచన చేయాలని మనవి. కొద్దినెలల క్రితం మా ఊర్లో **పితాపురం ఫిల్మ్ సొసైటీ** స్థాపించుకుని వో ప్రయత్నం చేసాం కానీ వ్యక్తిగతంగా నా అస్థిరమయిన సంచార జీవితం, ఆర్థిక అసహాయత రీత్యా అప్పుడప్పుడూ మాత్రమే దానికి న్యాయం చేయగలుగుతున్నాం. **కళ లక్ష్యం మనిషిలోని భావోద్వేగాలను మేల్కొల్పడమే అయితే, అలాంటి దృశ్యకావ్యాల్ని చూడ్డానికి, చర్చించడానికి ఈ యాంత్రిక జీవనంలో చోటు కల్పించుకోవడం తప్పనిసరి.**

ప్ర) **ఫిలిం సొసైటీ అంటే ఏంటి? దాని ఉద్దేశాలు, లక్ష్యాలు వగైరాల గురించి క్లుప్తంగా చెప్పండి?**

జ) మంచి సినిమాలు కల్సి చూడ్డానికి, చూపించడానికి, చర్చించుకోడానికి మెరుగయిన సమాజాన్ని ఆశించే ఏ కొద్దిమంది వ్యక్తులైనా కల్సి ఏర్పాటు చేసుకునేదే ఫిలిం సొసైటీ. మన దేశంలో 80వ దశకంలో ఫిల్మ్ సొసైటీ మూమెంట్ చాలా విస్తృతంగా నడిచింది. **సినిమా అనేది కేవలం కాలక్షేపం కోసం కాదనీ, జీవితానికి సంబంధించిన మానవీయ స్పృహను కళాత్మక స్ఫూర్తితో, శాస్త్ర సాంకేతిక పరిజ్ఞానంతో ప్రజానీకానికి అందించగల ప్రభావశీలమయిన మాధ్యమం అనే విషయం ప్రపంచవ్యాప్తంగా నిరూపితమైంది.** ఈనాటికీ బెంగాల్, కేరళ, మహారాష్ట్ర వంటి చోట్ల నాటి చైతన్యం స్పష్టంగా కనిపిస్తుంది. తెలుగు రాష్ట్రాల్లో మట్టుకు మూడు నాలుగు చోట్ల తప్ప యాక్టివ్‌గా లేవు.

మంచి సినిమా నలుగురితో కల్సి చూడటం, వ్యాపారాత్మక, మూస చిత్రాల ఊబిలోపల కొట్టుమిట్టాడుతున్న ప్రధాన స్రవంతిలోని వెకిలి సినిమాలకి ప్రత్యామ్నాయంగా, ప్రయోగాత్మక, ప్రయోజనకర, ప్రజాభ్యుదయ చిత్రాలను ప్రదర్శించుకుంటూ, ఆ మేరకు కళ సంకుచితం కాదు, సార్వత్రికమని బలంగా ఎలుగెత్తి చాటిచెప్పగలగడమే ఫిలిం సొసైటీల లక్ష్యమని నా అభిప్రాయం.

పిఠాపురం ఫిల్మ్ సొసైటీ

(మంచి సినిమాల సమాహారం)

ఆహ్వానం

తేది :	సమయం :	స్థలం :
ఫిబ్రవరి 10, 2018, శనివారం	సాయంత్రం 6 గం॥లకు	చెలికాని భావనరావు సభాసదన్

వ్యవస్థ యాంత్రికంగా సాగుతోందని వీలున్నప్పుడు బాధపడటం తప్పా దానిని మానవీయంగా మార్చుకోడానికి ఎన్నడైనా ఆలోచించామా ? వ్యసనాల బారిన పడుతున్న యువత చెడిపోతోందని కుదిరినప్పుడు ఆవేశపడటమే కాని మంచి అలవాట్లను అలవర్చుకోవడానికి వారికెప్పుడైనా సహకరించామా ? సమాజం పాడైపోతోందంటూ ఒగర్చడం మినహా మనవంతు ఏదయినా మంచి చేద్దామని ముందుకొచ్చి నెలకో కొంత సమయం కేటాయించగలమా ? అదిగో, అలా కూర్చీలకి, ఉపన్యాసాలకీ, వేదికలకి, సమితులకి, మండళ్ళకి మాత్రమే పరిమితం కాకుండా విలువలతో కూడిన సాంస్కృతిక వికాసమే లక్ష్యంగా,

పిఠాపురం ఫిల్మ్ సొసైటీ

ఏర్పాటు చేస్తున్నాం. అందరికీ అందుబాటులో స్థానిక సూర్యరాయ విద్యానంద గ్రంధాలయం ఆవరణలో 'చెలికాని భావనరావు సభాసదన్'లో ప్రతి నెల ఒక ట్రెండు సార్లు అందరం కల్సి మంచి చిత్రాలు చూసి వాటిపై చర్చించుకుందాం.

మార్చి 8వ తేదీన లాంఛనప్రాయంగా ఆరంభించనున్న ఫిల్మ్ సొసైటీలో చెక్ స్లే షోగా ప్రపంచ ప్రఖ్యాత కళాకారుడు, ప్రజాప్రయోక్త, కవి, రచయిత **'బెర్తోల్ట్ బెహ్ట్'** జయంతి సందర్భంగా ఫిబ్రవరి 10న సాయంత్రం 6 గంటలకు భారతీయ శాస్త్రవేత్త, ప్రముఖ ఉర్దూ కవి, సామాజిక కార్యకర్త **గౌహర్ రజా** రూపొందించిన అద్వితీయ 15 నిమిషాల డాక్యుమెంటరీ **'జాల్మతోకీ దోర్ మే' (in dark times...)** ప్రదర్శించడం జరుగుతుంది.

అందరూ ఆహ్వానితులే

బెర్తోల్ట్ బ్రెహ్ట్ ఫిబ్రవరి, 10, 1898న జర్మనీలో జన్మించాడు. ప్రపంచాన్ని కుదిపేసిన రష్యన్ రచయిత మాక్సింగోర్కీ అద్వితీయ నవల 'అమ్మ'ని సామాజిక శాస్త్రవేత్తయిన గెలీలియో జీవితాన్ని, స్వార్టకస్ జీవితాన్ని, నాటకీకరించడం మొదలుకుని, అనేక కవితలు, నాటకాలు రచించాడు. ప్రపంచ యుద్ధాల్ని దగ్గరగా చూడటమే కాక ప్రవాస జీవితం కూడా అనుభవించాడు. మహిళల విషయంలో వివాదాస్పదుడనే పేరుంది. ఫాసిస్టు హిట్లర్ అధికారం చెలాయించి కళ, సాహిత్యం, సంస్కృతుల్ని నాశనం చేసినంత కాలం దేశాలు పట్టి తిరుగుతూనే ఉన్నాడు. ఆగస్టు 14, 1956లో గుండెపోటుతో మరణించాడు.

గౌహర్ రజా ఆగస్టు 17, 1956న ఉత్తరప్రదేశ్‌లోని అలీఘర్‌లో జన్మించారు. ఢిల్లీలో చదివారు. కవి, విజ్ఞాన వేత్త, సామాజిక కార్యకర్త. జహంగీరాబాద్ మీడియా ఇనిస్టిట్యూట్‌కి గౌరవ డైరెక్టర్‌గా ఉన్నారు. అచంచల దేశభక్తుడు భగత్‌సింగ్ జీవితం గురించి **'ఇంక్విలాబ్'** అనే డాక్యుమెంటరీ మొదలుకొని ఎన్నో లఘుచిత్రాలు తీసారు. మతోన్మాదుల చేతుల్లో చనిపోయిన ప్రజా ఉద్యమకారుడు సప్దార్‌హష్మి సోదరి షబ్నం హష్మి జీవిత భాగస్వామి.

పూనేలో 2016 డిసెంబర్‌లో జరిగిన ఆలిండియా సోషలిస్ట్ యూత్ మీట్‌లో గౌహర్ రజా పాల్గొనడమే కాక ఈ చిత్రాన్ని ప్రదర్శించడం జరిగింది. కేవలం వారం రోజుల నిడివిలోపల అనితర సాధ్యంగా నిర్మించిన ఈ చిత్రం హిందీ/ ఆంగ్లాలలో ఉంది. రాబోయే రోజుల్లో తెలుగులో చేసే ప్రయత్నం జరగనుంది. జర్మనీలో ఫాసిజం జెడలు విప్పి హిట్లర్ నాయకత్వంలో సాగించిన అమానుష దుర్మార్గాల్ని నగ్నంగా చిత్రించడం ఈ సినిమా సాధించిన అపూర్వ విజయం. మతోన్మాదం బుసలు కొడుతున్న ప్రస్తుత సమయంలో ఈ చిత్రం కొద్దిమందిలోనయినా ఆలోచన కలిగిస్తుందని ఆశిస్తున్నాం. రండి ఫిల్మ్ సొసైటీలో భాగం కండి, సాంస్కృతిక వికాసానికి చేయందించండి.

ఆనరీ అడ్వైజర్స్ :	అడ్వైజరీ బోర్డు :	అడహక్ బాడీ :
పీ.యస్.అజయ్ కుమార్ (అనకాపల్లి ఫిల్మ్ సొసైటీ)	డా॥ సి.హెచ్.రవికుమార్ (రాష్ట్ర అధ్యక్షులు, జనవిజ్ఞాన వేదిక)	పోతుల శ్రీనివాసు (బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా)
జంపా కృష్ణ కిషోర్, (విజయవాడ ఫిల్మ్ సొసైటీ)	డా॥గజరావు సీతారామస్వామి (సోమసుందర్ లిటరరీ ట్రస్ట్)	ఐ.వి.ఆర్.మణికంఠ (సోషల్ మీడియా ఫర్ సొసైటీ)
డా॥ఎం.వి. భరతలక్ష్మి, (రిటైర్డ్ పి.ఆర్.కాలేజ్ ప్రిన్సిపాల్)	కె. అప్పారావు, (రిటైర్డ్ డిప్యూటీ డైరక్టర్, సోషల్ వెల్ఫేర్)	స్టాలిన్ (ఫ్రెండ్స్ న్యూస్ ఏజెన్సీ)

కన్వీనింగ్ కమిటి :	స్క్రీనింగ్ కమిటి :
కొండేపూడి శంకరరావు (సూర్యారాయ విద్యానంద గ్రంథాలయం-కార్యదర్శి)	ఏకా కిషోర్, నడిగట్ల పద్మరాజు,
సీ. హెచ్. సతీష్ (సహృదయ మిత్రమండలి- కన్వీనర్)	బండే సుధాకర్, అద్దాల రాజు,
పీ. గంగాభవాని (మహిళా ప్రగతి వేదిక)	మహమ్మద్ కరీముల్లా

వివరాలకు : 90320 94492

ఇది పిఠాపురం ఫిల్మ్ సొసైటీ స్థాపన కరపత్రం

ఆహ్వానం

మత సమైక్యతా ప్రతీకలు

తేది : మార్చి 8, గురువారం సమయం : సా॥ 6గం॥ స్థలం : చెలికాని రామారావు సభాసదన్

పిరాపురం ఫిలిమ్ సొసైటీ (మంచి చిత్రాల సమాహారం)

ఆడవాళ్ళు ఏకమైతే (When Women Unite)

ప్రపంచ వ్యాప్తంగా 52 దేశాల్లో Educational Kit గా ఉపయోగించబడుతూ, జపాన్‌లో జరిగిన ఇంటర్నేషనల్ ఫిలిం ఫెస్టివల్‌లో ప్రత్యేక బహుమతి పొంది, యావత్ దేశాన్ని అట్టుడికించిన నెల్లూరు జిల్లా మధ్యపాన వ్యతిరేకోద్యమంలో స్వయంగా పాల్గొన్న స్త్రీలతో నిర్మించిన డాక్యుమెంటరీ (పది నిమిషాలు) ప్రదర్శించడం జరుగుతుంది.

నెల్లూరు జిల్లా దూబగుంట మహేశ్వర మద్యవ్యతిరేకోద్యమ రజతోత్సవ స్ఫూర్తితో
భారతదేశపు మొట్టమొదటి మహిళా ముస్లిం ఉపాధ్యాయురాలు ఫాతిమా షేక్ సంస్మరణలో
భారతదేశపు మొట్టమొదటి మహిళా ఉపాధ్యాయురాలు సావిత్రిబాయ్ పూలే వర్ధంతిని పురస్కరించుకుని
పురుషాధిపత్యాన్ని ఎదిరిద్దాం - సమానత్వాన్ని సాధిద్దాం

స్త్రీగా పుట్టడమే నేరమని భావించే సమాజంలో ఆడపిల్లను కనడమొక అపరాధంగా, అభద్రతా చిహ్నంగా చూడటం జరుగుతోంది. అందుకే, లింగ నిర్ధారణ చేసి మరీ ఆడశిశువుల్ని గర్భాల్లోనే హత్య చేయడం జరుగుతోంది. చెత్త కుండీలకి, చెరువులకి బలవుతున్న శిశువులకి లెక్కేలేదు. మగాడిగా జన్మించడం గొప్పగా చిత్రించబడే చోట మిగిలిన లింగాలన్నీ చులకనగానే చూడబడతాయి. అందుకే మనకే జెండర్ స్టడీస్ ఉండదు.

ఈ ఆలోచనలిు మార్చుకుందాం.

జ్ఞానమనే దాని అవసరం పురుషుడికి మాత్రమే ఉందనే భ్రమలోనున్న వ్యవస్థలో స్త్రీ రెండవతరగతి జీవిగానే చూడబడుతోంది. అధికారులు, నిపుణులు, నాయకులు, మేధావులు, రచయితలు, ఉద్యమకారులు అంతా ఎక్కువ శాతం మగవాళ్ళే. స్త్రీ నైపుణ్యాన్ని ప్రతిభనీ నాలుగ్గోడలకే పరిమితం చేసి ఆమెను వంట చేయడానికో, అంట్లు తోమడానికో, అలంకార బొమ్మ పడుండడానికో బలి చేయడం జరుగుతోంది. ఇంటిపని ఇంట్లో వారందరిదీ, స్త్రీది మాత్రమే కాదు.

ఈ ఆచరణను నేర్చుకుందాం.

స్త్రీ ఆమెకి నచ్చినట్లు ఉండకూడదు, పురుష ప్రపంచానికి నచ్చినట్లు ఉండాలనే ఆంక్షలున్నాయి. అమ్మాయి గట్టిగా నవ్వకూడదు, ఏడ్వకూడదు, నచ్చిన బట్టలేసుకోకూడదు, నచ్చిన సమయంలో బయటికెళ్ళకూడదు, స్వతంత్రంగా ఆలోచించకూడదు. స్త్రీ ఎలా వుండాలో ఏం చేయాలో పత్రికలు మొదలుకుని ప్రసారమాధ్యమాలు, మతాలు, సంప్రదాయాలు, అన్ని చేటుతూనే ఉంటాయి. సినిమాల్లో సైతం పురుష పాత్రలు కథానాయకుడిగా మొత్తం కథని నడిపించేవాడిగా, మార్పుకి కారణమయ్యేవాడిగా ఉంటే, స్త్రీ నాజాకుగా,అవయవ ప్రదర్శనా ప్రాణిగా, నంగినంగిగా, పిరికిగా ఉంటుంది.

ఈ పద్ధతులని ప్రశ్నించుదాం.

స్త్రీ లైంగికతకు సంబంధించిన అవయవాల్ని ప్రస్తావించకుండా వ్యవస్థ తిట్టుకోలేదు. పురుషాధిక్యత అనుక్షణం ప్రదర్శించబడే చోట స్త్రీ అంటే కేవలం ఎత్తుపల్లాలలతో, కొలతలతో కూడిన శరీరమనే భావన ఉంటుంది. స్త్రీని సొంత ఆస్తిగా పురుషుడి సొత్తుగా చూడబట్టే, వ్యక్తిని కించపర్చడానికి అతడికి సంబంధించినస్త్రీల అవయవాలు, లైంగికతలకి సంబంధించిన పదజాలాన్ని అసహ్యంగా ప్రయోగించడమే గొప్పగా చలామణీ అవుతోంది. స్త్రీనీ, జెండర్‌ని తక్కువ చేయడమే భాష పరమార్థమౌతోంది.

ఈ భాషను సంస్కరించుకుందాం.

శీలమనే భావనను స్త్రీ శరీరానికి మాత్రమే పరిమితం చేసిన సమాజం పెళ్ళి, కుటుంబం వంటి గుదిబండల్ని ఆమె నెత్తిన రుద్దింది. వివాహం మగాడికీ అతడి లైంగిక స్వేచ్ఛను ఎంతమాత్రం తగ్గించుకోకుండా ఇంటపని, ఒంటపనీ చేసి నిత్యం అతడ్ని సంతోషపెట్టడానికి చూసే బానిసను అందిస్తుంది. కానీ, స్త్రీకి ఆమె చిన్ని చిన్ని ఆనందాల్ని హరించి ఆమె ఇష్టాయిష్టాల్ని నిర్దేశించి ఆమెపై అధికారం ప్రదర్శిస్తూ జీవితాంతం ఆమెను పాలించేందుకు లోకువయినుకునే బానిస యజమానిని ఇస్తుంది.

ఈ సంప్రదాయాన్ని రూపుమాపుదాం.

మాతృత్వమనే తతంగాన్ని స్త్రీకి అంటగట్టిన వ్యవస్థ పురుషుడి ఆనందానికి, ఆస్తికి, కుటుంబానికి, వారసత్వానికి స్త్రీని వాడుకుంటోంది. పెళ్ళి పేరుతో ఎవరితో స్త్రీ పడుకోవాలో నిర్ణయించే సమాజం, సంతానం పేరుతో ఎంతమందిని కనాలో ప్రభుత్వంగా మారి శాసిస్తుంది. మాతృత్వమనే దానిని కాల్పనికంగా చాలా అపురూపమయిందిగా చిత్రిస్తూ, పిల్లల్ని కనకపోవడమొహ నేరంగా చూపిస్తోంది. పెళ్ళే కుటుంబం, పిల్లలు మాత్రమే సిసలైన స్త్రీ సౌభాగ్యాలుగా ప్రచారమవుతూండటం వలన వాటికి కట్టుబడకుండా కూడా స్త్రీ ఉండగలదనే ఊహ సైతం వ్యవస్థకి లేకుండా పోయింది.

ఈ విధానాన్ని విడనాడదాం.

స్త్రీ అంటే రెండు స్థనాలు, ఒక యోని కాదు. పుట్టుక కారణంగా ఆమె నేరస్తురాలు కాదు. నెలసరి కారణంగా ఆమె అపవిత్రురాలు కాదు. జీవితాంతం మగాడికి చాకిరీ చేయడం కోసమ్మే జన్మించిన దేవురు సేవకురాలు కాదు. మనిషి దేహంలో పురుషత్వ్తకి కోసం ప్రాకృతికంగా ఏర్పడినవి లైంగిక అవయవాలు. వాటి ప్రాతిపదికన స్త్రీ శరీరంలో జరిగే మార్పుని ఆధారం చేసుకుని ఆమె లైంగికతను ప్రచారం చేయడం దారుణం. రజస్సుల ముందలు సంబారాల్నీ అహేతుకం. నెలసరి గురించి, లైంగికత గురించి ఆరోగ్యకరంగా చర్చించే స్థాయికి సమాజం ఎదగాలి కానీ అదో పాపంగా ప్రచారం చేసే స్థాయికి దిగజారుడుదు.

ఈ మౌనాన్ని ఛేదిద్దాం.

మతగ్రంథాల్నీ, మగాళ్ళకు చెందినవి. దేవుళ్ళంతా పురుషాధిపత్యాన్ని కలిగినవారే. శారీరకంగా, మానసికంగా పురుషుడ్ని సంతృప్తిపరుస్తూ, అతడి కోసమే కాక వాడి స్నేహితులు, బంధువులు, తల్లిదండ్రుల కోసం, అలాగే అతని పరువు, గౌరవం, ప్రతిష్టల కోసం, నిత్యం వ్యవస్థ చేత స్త్రీ హత్య చేయబడుతోంది. ప్రేమ, పెళ్ళి, పాతివ్రత్యం, భక్తి, సంసారం, కుటుంబం అన్నింటా అంతరాత్మని చంపుకుని అభూతములు లేకుండా సాంత శరీరాన్ని, ఆత్మను శరీరం కోలతల మీది, చర్మం రంగు మీదో, ఆకర్షణీయ దుస్తుల మీదో, ఖరీదైన ఆభరణాల మీదో మాత్రమే కేంద్రీకరించుకుని సమాజం నిర్దేశించినట్లుగానే బతుకీడుస్తున్న స్త్రీ కనిపిస్తుంది.

ఈ అన్యాయాన్ని నిర్మూలిద్దాం.

సామాజిక న్యాయమంటూ సిద్ధాంతాలు చెప్పేవారు, రాజకీయ మార్పంటూ రాద్ధాంతాలు చేసేవాళ్ళు, కులాలు, మతాలు, పార్టీలు, నాస్తికత్వాలు, హేతువాదాలు, కమ్యూనిజాలు... అన్నింటిలోను మగాహంకారమే నెలకొని ఉంది. చట్టాలు చేసేదీ మగాళ్ళే, అతిక్రమించేది మగాళ్ళే, మద్యం తాగేది మగాళ్ళే, మద్యపాన వ్యతిరేకోద్యమాలు నిర్వహించి నాయకులయ్యేది మగాళ్ళే, ఇళ్ళల్లోని స్త్రీలని అమానుషంగా హింసించేది మగాళ్ళే, ఉపన్యాస వేదికల పైకెక్కి సమానత్వమంటూ గొంతు చించుకునేదీ వాళ్ళే. సాహిత్యం, పత్రికలు, ఉద్యమాలు, విప్లవాలు, వ్యాపారాలు అన్నింటిలోనూ దొంగమాటలు, కొంగ జపాలు, చొంగ చూపులు.

ఈ అక్రమాన్ని నిరసిద్దాం.

స్త్రీలకి శరీరాలుంటాయి, వాటికి కోరికలుంటాయి. ఆమెకి మనసుంటుంది, దానికి అనుభూతుంటుంది. వారికీ అభిప్రాయాలుంటాయి, వాటికీ ఆత్మగౌరవముంటుంది. స్త్రీలకి వారిదైన స్వతంత్ర వ్యక్తిత్వం ఉంది. అది నచ్చినట్లు వికసించాలి. నచ్చిన వారితో నచ్చిన విధంగా జీవించాలి. నచ్చిన బట్టలు వేసుకోవాలి. స్త్రీల శరీరాలకి చీర సొకర్యవంతం కాదు. మగాళ్ళు గంట చీర కట్టుకుంటే అందులోని అసౌకర్యం తెలుస్తుంది. చెదుడ్లుదు, ముక్కుపుడకలు, మెట్టెలు, పట్టీలు, బొట్టు, కాటుక... వంటివన్నీ ఎలా ఉంటాయో పురుషులు ఒకసారి పెట్టుకుంటే తెలిసొస్తుంది. స్త్రీ మనసు, శరీరంపై సమాజానికి గల ధోరణి సిగ్గుచేటు.

ఈ పెత్తనాన్ని పెకలించుదాం.

వందల సంవత్సరాల్నుండీ స్త్రీని బాధించే ఈ క్రమం నిస్సిగ్గుగా సాగుతోంది. మగాడు అనుభవిస్తున్న ప్రతీ సౌకర్యం వెనకా చిద్రమైపోతున్న స్త్రీ జీవితముంది. సంవత్సరానికొకసారి మహిళా దినోత్సవం పేరిట మొక్కుబడి కార్యక్రమాలు, మొసలి కన్నీళ్ళు కాదు. చిత్తశుద్ధితో కూడిన ఆచరణే అసమానతకు ముంద. మార్పు ఒక్కసారిగా రాకపోవచ్చు కానీ మొచ్చిన తర్వాత ఆగదు. పురుషాధిపత్యాన్ని ఎదిరించి సమానత్వాన్ని సాధించడం ప్రజాస్వామిక విలువ. ఈ కరపత్రం పూర్తిగా చదివారంటే ఆ స్ఫూర్తి ఎంతో కొంత మీలో ఉందని అర్థం.

మార్పు మనతోనే మొదలెడదాం.

చిత్తశుద్ధి లేని ఉపన్యాసాలు వద్దు
వక్రబుద్ధితో చేసే ఉద్యమాలు వద్దు
వాస్తవ మహిళా సాధికారత కావాలి.

ఇది మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రదర్శించిన ఫిల్మ్ యొక్క సొసైటీ కరపత్రం

అనుబంధం – 3

అప్రయోజన దృష్టికో నిదర్శనం

విశాలాంధ్ర ప్రచురణాలయం ప్రచురించిన డా॥ దేవరాజు మహారాజు రచన ప్రయో'జన' సినిమా : సమాంతర సినిమాలపై పరిశీలనాత్మక వ్యాసాలు గ్రంధం చదివాను. అందులో **'ద థర్డ్ కైండ్ : కొజ్జాలు కూడా మనుషులే'** అంటో ఒక డాక్యుమెంటరీ గూర్చి సమీక్షించే ప్రయత్నం చేసారు.

అదెంత అన్యాయకరంగా చేసారంటే చదివిన వెంటనే బాధపడి కాస్త కోపంతోనే అప్పటికప్పుడు వాట్సప్‌లో సమీక్ష రాసి పెట్టాను. నిజానికి విశాలాంధ్ర, రచయితా ఇరువురు చేస్తున్న కార్యక్రమాల మీద నాకు వ్యక్తిగతంగా గౌరవం ఉంది. కాకపోతే, కమ్యూనిజం, ప్రగతిశీల భావాలంటూ ప్రచారం చేసుకొనే ప్రకాశకులు, పదుల సంఖ్యలో గ్రంధాలు రచించీ సైన్సు రచయితలుగా వెలుగొందుతున్నవారూ వర్తమానంగా జరుగుతున్న సామాజికోద్యమాలపట్లా, సమాజంలో హక్కుల కోసం పోరాడుతున్న సమూహాలపట్లా, ముఖ్యంగా లైంగికత పట్లా సుస్థిర కోణంతో కూడిన విస్తృత దృక్పథాన్ని ఏర్పర్చుకోడం అవశరమని నా అభిప్రాయం. అందుకే మిత్రపూరితంగానే వారిరువురికీ ఈ అంశం విన్నవించుకొంటున్నాను.

అవడానికి ఇది పాత వ్యాసం కావచ్చు. అప్పటికి భిన్న లైంగిక ధోరణుల్ని కలిగి ఉన్న వార్ని గురించి తెలుగు వ్యవహారికంలో మరో పదం ప్రాచుర్యం పొంది ఉండకపోవచ్చు. అయినప్పటికీ ట్రాన్స్‌జండర్ల పట్ల రచయితకీ, ప్రకాశకులకీ ఉన్న అజ్ఞానానికీ, లైంగికత పట్ల వారి చిన్నచూపుకీ ఈ వ్యాసం ఒక నిదర్శనం. వందలాది పుస్తకాలు రాసామని చెప్పుకునే రచయితలు మొదలుకుని మహా మేధావుల వరకూ వ్యవస్థలోని లైంగికత పట్ల ఎంత కళ్ళుమూసుకుపోయి ఉన్నారో చూస్తే ఆశ్చర్యమేస్తుంది. అలాంటి ఒక కళ్ళు మూసుకుపోయినతనం ఈ వ్యాసంలో కనిపిస్తుంది.

ట్రాన్స్‌జెండర్లూ, క్వేర్‌ల పట్లా వారి దైనందిన జీవితాలను గురించి సమాజంలో నెలకొని ఉన్న అపోహల్ని తొలగించకపోగా మరిన్ని భయభ్రాంతులు కలిగించేలా ఉందిది. సిద్ధార్థ షా తీసిన సినిమా దాని విశ్వసనీయత సంగతలా ఉంచి రచయిత, ప్రకాశకుల వైఖర్ని ప్రశ్నించడం తప్పనిసరి అవుతోంది. కొజ్జాలు పిల్లల్ని ఎత్తుకుపోయి కొజ్జాలుగా మారుస్తారనీ, **'హార్మోన్ల లోపం'** వల్ల శరీర నిర్మాణరీత్యా పురుషుడైనా స్త్రీగా మారతారనీ, మూడో రకమని పిలవబడే కొజ్జాలలో మళ్ళీ హెర్మాఫ్ రోడిటీస్, ట్రాన్స్ సెక్సువల్, ట్రాన్స్ వెస్టిజ్ అనే 3 రకాల వాళ్లుంటారనీ చెబుతూ పిల్లల్ని కొజ్జాలుగా మార్చే తతంగాన్ని భయంకరంగా భీభత్సంగా రచయిత వర్ణించాడు. ఎల్.జి.బి.టి.క్యు.ల గురించి ప్రాథమిక అవగాహన ఉన్నా ఇలాంటి భావాలు ఉండవు.

ఈ వ్యాసాలు 80వ దశకంలో రాసినవైనప్పటికీ వ్యాసకర్త ముందుమాటలో ఇది సమగ్రం కాదనీ మొక్కుబడి మాటలు చెప్పడం తప్పా పొరపాట్లు దొర్లిన సంగతి గుర్తించినట్లు లేదు, సరికదా కేవలం **"సమాంతర సినిమా"**పై దృష్టి పెట్టి రాసిన వ్యాసాలు నాకంటే ముందు తెలుగులో ఎవరూ రాసినట్లు లేదని సొంత సర్టిఫికెట్ ఇచ్చుకున్నారు. ఇది కచ్చితంగా అతిశయోక్తితో కూడిన స్టేట్‌మెంట్. సమాంతర అనే పదం వాడలేదనే కానీ, కొ.కు. మొదలుకుని ఎందరో ప్రగతిశీల సినిమాపై రాసినవారున్నారు. ఈ శ్రద్ధ గతంలో రాసిన అభిప్రాయాలలో లోపాలుండవచ్చనీ ఈ వ్యాసాలు అప్పటికి పరిమితమైన సమాచారంతో రాసినవనీ చెప్పడంపై పెడితే హుందాగా ఉండేదని నా అభిప్రాయం.

ఇంతకుమించిన సిగ్గుమాలిన విషయం ఏమిటంటే ప్రకాశకులు ట్రాన్స్ జండర్లు, భిన్న లైంగికత గలవార్ని కించపరిచే పదజాలాన్ని కూడా సవరించకుండా హడావుడిగా దీనిని ప్రచురించడం. **లైంగికత ఇప్పటికీ ఉద్యమకారులనబడే వారి కంటికి 'లోపంగా' కనబడటం ప్రజా ఉద్యమాల దౌర్భాగ్యం.**

ఎల్‌జిబిటిక్యు అంశమే కాదు. స్త్రీ-పురుషుల లైంగిక సంబంధాలపై కూడా 'ప్రగతిశీలవాదులకి' మంచి అభిప్రాయం లేదు. 1925లో ప్రపంచ మేధావి బెట్రండ్ రస్సెల్ **'వాట్ ఐ బిలీవ్?'** అనే రచన చేసాడు. అదే సమయంలో గుడిపాటి వెంకటాచలం కూడా **మేన్ అండ్ వుమెన్** వ్యాసం రాసాడు. చిత్రమేమిటంటే పాశ్చాత్య

ప్రపంచం రస్సెల్ మేధస్సుని ఎంత పొగిడినప్పటికీ వామపక్షం అతడ్ని దూరం పెట్టింది. తెలుగు నేలమీద అక్షరాలతో విప్లవ బావుటా ఎగరేసిన చలం మన సోకాల్డ్ 'మేధావులకి' ఇప్పటికీ నిషిద్ధుడు. చలమే మూలాన్నొదిలి ఆ వ్యాసాన్ని స్త్రీగా విస్తరించి రాసాడు. ఎల్.జి.బి.టి.క్యూ + (లెస్బియన్స్, గేస్, బైసెక్సువల్స్, ట్రాన్స్‌జెండర్స్, క్వేర్+) సమూహాలకి సంబంధించి ఏమాత్రం అవగాహన ఉన్నా చలం తన వ్యాసాన్ని **మేన్, ఉమెన్ అండ్ అదర్స్** పేరుతోనో అలాంటిదే మరో శీర్షికతోనో కచ్చితంగా రాసితీరేవాడని నా నమ్మకం. ఆయన పురుషుడు – స్త్రీ, తొంభై సంవత్సరాలు తెలుగులో దాని అనువాదమే రాలేదు. 2014లో దాన్ని అనువదించి ప్రచురించాను. అయిదు సం॥రాలైంది. రోజురోజుకీ దాని ప్రాసంగికత పెరుగుతోందే కాని తగ్గుతున్నట్లు నాకు కనిపించడం లేదు.

డా॥ దేవరాజు మహారాజు, విశాలాంధ్ర వారి భావజాల కృషిపట్ల గౌరవభావం ఉన్నప్పటికీ భిన్నలైంగిక దృక్పథాల పట్ల వారి అవగాహనను మరింత పెంపొందించుకోవాల్సిన ఆవశ్యకతను తెలుపుతూ మిత్రపూరితంగా ఈ విమర్శ చేయడమయినది.

గౌరవ్ ఇతర రచనలు

1. ప్రజాస్వామ్య పతనం
2. అరాజకత్వం అంటే ఏంటి?
3. సాంఘిక తత్వం – వైప్లవ మార్గం
4. ఒక నాస్తికుడి నామా
5. ప్రజాస్వామ్య ప్రస్థానం
6. అస్తిత్వం – అరాజకత్వం
7. మద్యంపై యుద్ధం
8. మతానికి మరణశాసనం – మనిషికి పునరుజ్జీవనం
9. కరపత్రాల కథా కమామీషు
10. తత్వవిచారణ – తర్క వివేచన
11. కులానికో సవాలు
12. ప్రకృతి–శాస్త్రం–సమాజం
13. ధిక్కార స్వరాలు
14. హేతువాద దృక్పథం - విధానపర కర్తవ్యం
15. కలాలు – కరపత్రాలు
16. పార్టీరహిత ప్రజాస్వామ్యం సాధ్యమా?
17. శిధిలాక్షరం
18. విస్మృత స్వరాలు
19. సద్దమ్మ స్వరాలు
20. వ్యవస్థలు – వ్యసనాలు
21. ధీరోదాత్తులు
22. ప్రజా ఉద్యమాల ప్రాతిపదిక
23. మద్యపానమా? మానవత్వమా?
24. తరగతిగది తత్వశాస్త్రం
25. అభివ్యక్తి
26. మానవతకు భరోసా
27. సాఫల్య జీవులు
28. సంస్కృతి

స్వేచ్ఛానువాదాలు

1. పురుషుడు-స్త్రీ
   (చలం ఏకైక ఆంగ్ల రచన మేన్ అండ్ ఉమెన్ 100 సం॥రాల తర్వాత తెలుగులో)
2. సంపూర్ణ ప్రజాస్వామ్యం దిశగా
   (లోక్‌నాయక్ జయప్రకాష్ నారాయణ్ వ్యాసం తెలుగులో)
3. శాస్త్రీయ – హేతువాద – సామ్యవాద వివేకానంద
   (డా॥ దత్తప్రసాద్ దభోల్కర్ పరిశోధనాత్మక వ్యాసం తెలుగులో)
4. సాలీడు – ఈగ
   (జర్మన్ విప్లవకారుడు విలియం లిబ్నిక్ పిల్లల కోసం రాసిన కథ తెలుగులో)
5. నంది మూపురం
   (విఖ్యాత చరిత్రకారుడు డి.డి. కోశాంబి పిల్లల కోసం రాసిన ఏకైక కథ తెలుగులో)
6. మన విద్యా సమస్య
   (గదర్ పార్టీ స్థాపకుడు లాలా హర్‌దయాళ్ గ్రంథానికి జాతీయ నాయకుడు లాలా లజపతిరాయి రాసిన ముందుమాట తెలుగులో)
7. ఎక్కడ మనసు నిర్భయంగా ఉంటుందో..
   (విశ్వకవి రవీంద్రనాథ్ ఠాగూర్ ప్రసిద్ధ కవితకి రాడికల్ హ్యూమనిస్ట్ భాస్కర్ సూర్ విశ్లేషణ తెలుగులో)
8. చారిత్రక మహోద్యమం – చంపారన్ సత్యాగ్రహం
   (ప్రసిద్ధ మార్క్సిస్టు చరిత్ర కారుడు ఇర్ఫాన్ హబీబ్ మొదలుకుని ఇతరుల చంపారన్ ఉద్యమ శతవార్షికోత్సవ వ్యాసావళి)
9. ప్రకృతి శాశ్వత ప్రగతి (పర్యావరణ పితామహుడు, చిప్కో ఉద్యమ సారధి సుందర్‌లాల్ బహుగుణ, విమలా బహుగుణల ఇంటర్వ్యూ)
10. అభివృద్ధి - ఆదివాసులు - హింస (ప్రఖ్యాత సామాజిక కార్యకర్త హిమన్స్‌కుమార్ రచన అనువాదం.

సాఫ్ట్‌కాపీలు

1. స్వేచ్ఛ-సాంస్కృతిక ఆవశ్యకత
   (యం.ఎన్.రాయ్ వ్యాసం కల్చరల్ రిక్విసిట్స్ ఆఫ్ ఫ్రీడం తెలుగులో)
2. జీవితానికి అర్థం ఏమిటి?
   (సోషలిస్టు యోధులు ఆచార్య నరేంద్ర దేవ్, డా॥ రామమనోహర్ లోహియా వ్యాసాలు తెలుగులో)
3. పేదల కలలు
   (అహ్మద్ అబ్బాస్ మొదలుకుని ఇతరుల మతోన్మాత వ్యతిరేక ఉర్దూ అనువాద కథా సంకలనం తెలుగులో)
4. మనిషి – మార్జాలం (ప్రఖ్యాత ఆస్ట్రియన్ పరిణామవేత్త కానర్డ్ లోర్నెన్జ్ కథ అనువాదం)